www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 77
మంగళవారం | 2-7-2024 | పేజీలు: 14
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: ఏకాదశి ఉ. 8.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: కృత్తిక తె. 4.40 తదుపరి రోహిణి; వర్జ్యం: సా. 5.03-6.36; దుర్ముహూర్తం: ఉ. 8.24-9.16, రా. 10.25-11.07; అమృతఘడియలు: రా. 2.20-5.53; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.49
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జన్యుసవరణ ప్రక్రియకు
మనోళ్ల మెరుగు
జీన్ ఎడిటింగ్‌లో కీలక కాస్-9 ప్రొటీన్
కొత్త బ్యాక్టీరియా నుంచి సేకరణ
సీఎస్ఐఆర్-ఐజీఐబీ,
ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పరిశోధకుల ఘనత
కొత్త చికిత్సతో ఓ బాలుడికి కంటిచూపు
2

మేధాపాట్కర్‌కు 5 నెలల జైలు
పరువునష్టం కేసులో కోర్టు తీర్పు
సక్సేనాకు 10 లక్షలు కట్టాలని ఆదేశం
2

నిరుపేద ఇంటికి నడిచొచ్చిన నాయకుడు
పెనుమాకలో గిరిజనుడి పూరింటికి సీఎం.. ఉబ్బితబ్బిబ్బయిన రాములు నాయక్ కుటుంబం



కుక్కిమంచంలో కూర్చుని యోగక్షేమాలు విచారించిన చంద్రబాబు
నాయక్‌కు వృద్ధాప్య పింఛను పంపిణీ.. ఆయన భార్యకు వ్యవసాయ కూలీ పెన్షన్
కుమార్తెకు వితంతు పింఛను.. స్వయంగా అందజేసిన సీఎం
ఇల్లు కూడా మంజూరు చేస్తూ అక్కడికక్కడే పత్రాలు అందజేత

పెన్షన్, ఇంటి నిర్మాణ మంజూరు పత్రం అందుకున్నాక రాములు కుటుంబం ఆనందం





పెనుమాకలో సోమవారం ఉదయాన్నే బకాయిలతో కలిపి పెంచిన పెన్షన్ రూ.7 వేలను స్వయంగా అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పేదింటికి పండగొచ్చింది



శ్రీకాకుళంలో పెన్షన్ సొమ్ముతో వృద్ధురాలు

మామ్మ మురిసింది..

ఆహా... ఒకటో తారీఖు!
అమ్మో... ఒకటో తారీఖు కాదు! ఇది... ఆహా ఒకటో తారీఖు! అవ్వా తాతల మోములో 'పెంచిన పింఛను' వెలుగులు నింపిన రోజు! సోమవారం తెలతెలవారగానే ప్రత్యక్షమైన సచివాలయ సిబ్బంది... తలుపు తట్టి మరీ పింఛను అందించారు. మూడు నెలల బకాయి రూ.3వేలు, ఈ నెల పింఛను రూ.4వేలు కలిపి మొత్తం 7వేలు చేతికిచ్చారు. ఉదయం నుంచి రాత్రి దాకా నిరాటంకంగా పెన్షన్ పంపిణీ ప్రక్రియ సాగింది. ఇక... ఉద్యోగపర్వంలోనూ కొత్త అధ్యాయం మొదలైంది. నాలుగున్నరేళ్లుగా పదో తేదీ దాటినా పడని జీతాలు నేడు ఒకటో తేదీనే బ్యాంకు ఖాతాల్లో పడిపోవడం... మొబైల్ ఫోన్లో 'క్రెడిటెడ్' మెసేజ్‌లు టింగుటింగుమని మోగడంతో ఉద్యోగులు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. రాష్ట్రంలోని అత్యధిక శాతం ఉద్యోగులకు సోమవారమే జీతాలు పడ్డాయి. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లూ పడటం మొదలైంది. ఉపాధ్యాయులకు, మిగిలిన వారికీ మంగళవారం జీతాలు, పెన్షన్లు జమ కానున్నాయి. సుమారు 62 లక్షల మందికి సామాజిక పింఛన్లు, దాదాపు 10 లక్షలమందికిపైగా ఉద్యోగులకు వేతనాలు! వెరసి... ఈ ఒకటో తారీఖు లక్షల కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది.

ఇంటి గడపలోకే సంక్షేమం సొమ్ము
పెన్షన్ల చరిత్రలోనే తొలిసారి 7వేలు చేతికి...
యజ్ఞంలా 'ఎన్టీఆర్ భరోసా' కార్యక్రమం
ఉదయం 5.30కల్లా కదిలిన సచివాలయాల ఉద్యోగులు
రాత్రి 8 గంటల కల్లా 94.75 శాతం మందికి..
వలంటీర్లు లేకున్నా సాఫీగా కార్యక్రమం
ఉద్యోగులపై జగన్‌వి అబద్ధాలని తేలిపోయిన వైనం
పెనుమాకలో బాబు, పిఠాపురంలో పవన్ పంపిణీ
నియోజకవర్గాల్లో మంత్రులు, నేతలు నేరుగా హాజరు

పింఛన్ల చరిత్రలోనే తొలిసారి ఒకేనెల రూ.ఏడువేలు చేతికి అందుకున్న ఆనందం.. ఇక అందదు అనుకున్న లబ్ధి చేతికి రావడంతో ఉద్వేగం... ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా ఇంటి గడప తొక్కి 'ఇందా సొమ్ము' అని అందిస్తుంటే పట్టలేనంత సంబరం... వెరసి రాష్ట్రమంతా పింఛన్ల పండగ మహాసంరంభంగా సాగింది. సంక్షేమపథంలో టీడీపీ కూటమి ప్రభుత్వం
మిగతా 11వ పేజీలో...

సాయం కాదు.. బాధ్యత
ప్రతి ఇంటికీ పెద్దకొడుకుగా ఉంటా
ఈ ఒక్క నెలలోనే రూ.4,408కోట్లు
3 నెలల బకాయిలతో పెన్షన్ ఇచ్చాం: బాబు
65.31 లక్షల మందికి సామాజిక పింఛను
ఇక ఏటా రూ.33,100 కోట్లు ఖర్చు చేస్తాం
రాబోయే ఐదేళ్లలో 1,65,500 కోట్ల వ్యయం
నాడు పింఛన్ల కోసం మండుటెండల్లో
వృద్ధులను తిప్పి 33 మందిని చంపారు
తవ్వుతున్న కొద్దీ అప్పులు, తప్పులు!
వికృత చేష్టలతో ఆంధ్రా బ్రాండ్ దెబ్బతీశారు
పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారు: సీఎం
12

బాబు అనుభవంతోనే ఇది సాధ్యం!
వలంటీర్లు లేకుండానే పింఛన్ల పంపిణీ
12
జగన్ సర్కారులో కనివినీ ఎరుగని విధ్వంసం
'పంచాయతీ'లో తవ్వేకొద్దీ బాగోతాలు: పవన్



పిఠాపురంలో పెన్షన్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం పవన్

నాలుగున్నరేళ్ల తర్వాత ఒకటినే జీతాలు
90 శాతంపైగా ఉద్యోగులకు ఖాతాల్లో జమ
నేడు పెన్షన్లు కూడా 100 శాతం పూర్తి
11

అమాత్యుడి సతీమణి అతి
విపరీతం
తన కాన్వాయ్‌లో రాలేదని ఎస్ఐపై ఆగ్రహం
నడిరోడ్డుపై జనం చూస్తుండగానే ఓవరాక్షన్
మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య అనుచిత తీరు
చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం
ఉద్యోగుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి
ఘటనపై సీఎం తీవ్ర అసంతృప్తి.. మంత్రికి ఫోన్
3



అన్నమయ్య జిల్లా చిన్నమండెం ఎస్ఐ రమేశ్‌బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి భార్య హరిత

వినయం



మంత్రి నిమ్మల అణకువ
యలమంచిలి, జూలై 1: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి పళ్లెంలో వాళ్ల కాళ్లు కడిగి మరీ పెంచిన పింఛన్ సొమ్మును అందజేశారు. వాళ్లు వద్దని వారిస్తున్నా.. 'ఏం ఫర్వాలేదమ్మా.. నేను మీ మనవడిలాంటి వాడిని' అంటూ వృద్ధుల కాళ్లు కడిగారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా అడవిపాలెం, కొంతేరు, కాజ గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకే ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు
మిగతా 11వ పేజీలో...

పశ్చిమగోదావరి జిల్లా అడవిపాలెంలో వృద్ధురాలి కాళ్లు కడుగుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వృద్ధుల కాళ్లు కడిగి పింఛన్ అందజేసిన మంత్రి
ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు..
పశ్చిమగోదావరిలో పాల్గొన్న మంత్రి
ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారని ప్రశంస

ఇద్దరం కలిసి మాట్లాడుకుందాం!
విభజన అంశాలపై చర్చించుకుందాం
ఆమోదయోగ్య పరిష్కారాలు గుర్తిద్దాం



6వ తేదీన మీరున్న చోటికే వస్తా.. రేవంత్ రెడ్డికి బాబు లేఖ
తెలంగాణ ముఖ్యమంత్రి సానుకూల స్పందన
హైదరాబాద్‌లో ఇరువురు సీఎంల భేటీ

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్వయంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంలో సంబంధిత అంశాలపై ముఖాముఖి చర్చించుకుందామని ప్రతిపాదించారు. ఇందుకు రేవంత్ కూడా అంగీకరించారు. దీనిపై మంగళవారం లిఖితపూర్వకంగా తన స్పందన తెలియచేయనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికారికంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రులతోపాటు రెండు రాష్ట్రాల నుంచి ఇద్దరు చొప్పున సీనియర్ మంత్రులు, సంబంధిత అంశాలకు సంబంధించిన సీనియర్ అధికారులు కూడా హాజరవుతారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని అంశాలు రెండు రాష్ట్రాల మధ్య ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయాయి. ఉమ్మడి సంస్థల మధ్య ఆస్తుల విభజన కూడా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌తో భేటీకి చంద్రబాబు సిద్ధమయ్యారు. 'నేనే మీ వద్దకు వస్తాను' అంటూ భేషజాలను పక్కన పెట్టి మరీ లేఖ రాశారు. ఈ భేటీకి ముందు చంద్రబాబు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఆ సమయంలో ఈ అపరిష్కృత సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకురానున్నారు. దాని కొనసాగింపుగా రేవంత్‌తో ఆయా అంశాలపై చర్చిస్తారు. జగన్, కేసీఆర్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఒకసారి సమావేశమైనా... అది వారిద్దరి వ్యక్తిగత భేటీగానే జరిగింది. ఏ అంశమూ పరిష్కారం కాలేదు. ఈసారి ఇటు చంద్రబాబు, అటు రేవంత్ ఇద్దరూ సానుకూల
మిగతా 11వ పేజీలో...

డయాఫ్రం వాల్‌పై ఆందోళన వద్దు
ప్రత్యామ్నాయాలు సూచిస్తాం.. అమెరికా, కెనడా నిపుణుల వెల్లడి
పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వరుసగా రెండో రోజూ పర్యటన
వాల్ పునరుద్ధరణ సాధ్యమే.. దానిపై ఈసీఆర్ఎఫ్ డ్యాం కట్టొచ్చు
అంతర్జాతీయ నిపుణుల సూచన.. నేడు గైడ్‌బండ్ పరిశీలన
3



దెబ్బతిన్న డయాఫ్రం వాల్ వద్ద నిపుణులు

9సార్లు చార్జీలు పెంచినా
నష్టాలా?
రాష్ట్రం మిగులు విద్యుత్ నుంచి లోటులోకి ఎలా వెళ్లింది? కారణం ఎవరు?
'కృష్ణపట్నం', వీటీపీఎస్ కేంద్రాల్లో వాణిజ్య ఉత్పత్తి ఎందుకు ఆలస్యమయింది?
జరిగిన నష్టమెంత? పడిన భారమెంత?
వివరాలన్నీ ప్రజలకు అర్థమయ్యేలాచెప్పండి
విద్యుత్ రంగం శ్వేతపత్రంపై సమీక్షలో సీఎం
8న విడుదల చేయాలని నిర్ణయం
11

జూలైలో పుష్కలంగా వర్షాలు
సాధారణం కంటే ఎక్కువగా నమోదు
ఈశాన్య, తూర్పు, వాయవ్యంలో తక్కువే
కొన్నిచోట్ల కొనసాగనున్న ఎండ తీవ్రత
తాజా బులెటిన్‌లో ఐఎండీ అంచనా
జూన్‌లో 11% తగ్గిన వర్షపాతం
3

చేసిందెవరు? చేయించిందెవరు?
టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రారంభమైన దర్యాప్తు
11
రెండు రోజులుగా వాంగ్మూలాలు నమోదు
సీసీ టీవీ ఫుటేజ్ కోరిన పోలీసు శాఖ
దాడి చేసిన వారిని గుర్తించేందుకు చర్యలు
రాష్ట్రాన్ని వదిలిపోయిన అనుమానితులు..!

మీరు హిందువులే కాదు!
హింస, విద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నారు.. అధికార పక్షానికి 24 గంటలూ అదే పని
హిందూత్వం అహింస, నిర్భీతిని ప్రవచిస్తోంది
లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు
హిందూ సమాజాన్నే హింసావాదులంటారా?
రాహుల్ వ్యాఖ్యలు తీవ్రమైన విషయం: మోదీ
క్షమాపణలు చెప్పాలని అమిత్‌షా డిమాండ్


ఈ మూడున్నరేళ్లయినా నిజంవైపు ఉండండి
రాజ్యసభ చైర్మన్‌ను ఉద్దేశించి విపక్ష నేత ఖర్గే
ఇప్పటిదాకా పక్షపాతం చూపారా?: నడ్డా
అధికార, విపక్ష నేతల మధ్య వాడీవేడి చర్చ

దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల నిరసన



న్యూఢిల్లీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్ధాలను వ్యాపింపజేయడం హిందూత్వం కాదని చెప్పారు. హిందువులమని చెప్పుకొంటున్న వారంతా నిత్యం హింస, విద్వేష వ్యాప్తికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ వీరెవరూ మొత్తం హిందూ సమాజానికి ప్రతినిధులు కాదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం మధ్యాహ్నం సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదాలో తొలిసారిగా మాట్లాడారు. సందర్శకుల గ్యాలరీ నుంచి తల్లి సోనియా, సోదరి ప్రియాంక చూస్తుండగా సుదీర్ఘంగా
మిగతా 2వ పేజీలో...

నీట్.. కమర్షియల్
ధనవంతుల పిల్లల కోసమే ఈ పరీక్షను రూపొందించారు
జాతీయ స్థాయి పేరుతో అడ్మిషన్లు కేంద్రీకృతం చేశారు
లీక్‌పై చర్చకు ఒకరోజును కేటాయించాలి: రాహుల్‌గాంధీ
రాష్ట్రపతి ప్రసంగం ధన్యవాద తీర్మానంపై చర్చ ఉండగా వేరే అంశానికి సమయం కుదరదన్న రాజ్‌నాథ్, స్పీకర్
2
నిరసనగా లోక్‌సభ నుంచి 'ఇండియా' ఎంపీల వాకౌట్



గ్రేస్ మార్కుల 'టాపర్ల'కు
720 రాలేదు!
విడుదలైన నీట్ రీ-టెస్ట్ ఫలితాలు
మారిన జాబితాతో కౌన్సెలింగ్

శభాష్.. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి

- సకాలంలో పన్నులు చెల్లిస్తూ నవభారత నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.. కేంద్ర ఆర్థిక శాఖ ప్రశంస
- వరుసగా మూడో ఏడాది కేంద్రం నుంచి అభినందన

హైదరాబాద్, జూలై 1: తెలుగు మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'.. పన్నుల చెల్లింపులో మరోసారి తన క్రమశిక్షణను, నిబద్ధతను చాటుకుంది. కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వరుసగా మూడో ఏడాది అందుకున్న ప్రశంసాపత్రమే ఇందుకు నిదర్శనం. మీడియాను, పరపతిని అడ్డుపెట్టుకుని పన్నులు ఎగ్గొట్టాలని చూస్తున్నవారున్న ఈ రోజుల్లో పారదర్శకంగా పన్నులు చెల్లిస్తూ.. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తోంది. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో సకాలంలో, సక్రమంగా ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసి, జీఎస్టీ చెల్లించి కేంద్ర ఆర్థిక శాఖ నుంచి అభినందనలు అందుకుంది. తాజాగా.. జీఎస్టీ రిజిస్ట్రేషన్ నంబర్ 36AAHCA3752H1ZPను కలిగిన 'ఆమోద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్'ను అభినందిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రశంసా పత్రాన్ని పంపింది. సక్రమంగా ఆదాయపు పన్ను చెల్లిస్తూ నవ భారత నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'ని సీబీఐసీ ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ ఈ ప్రశంసాపత్రంలో అభినందించారు.

నీట్.. కమర్షియల్


దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, జూలై 1: మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష మొత్తం కమర్షియల్‌గా మారిపోయిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ధనవంతుల పిల్లల కోసమే దాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ఎగ్జామ్ పేరుతో రూ.వేల కోట్లు చేతులు మారుతున్నాయని వ్యాఖ్యానించారు. నీట్ ఎంతమాత్రం ప్రొఫెషనల్ పరీక్ష కాదన్నారు. జాతీయ స్థాయి పరీక్ష పేరుతో మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను కేంద్రీకృతం చేశారని విమర్శించారు. ఓ విద్యార్థి నీట్‌లో మంచి ర్యాంకు సాధించినా డబ్బు లేకపోతే కాలేజీలో చేరలేని పరిస్థితి ఉందన్నారు. సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే, రాహుల్ నీట్ పేపర్ అంశాన్ని లేవనెత్తారు. నీట్ ప్రశ్నపత్రం లీకైన వ్యవహారంపై చర్చకు ప్రత్యేకంగా ఒకరోజును కేటాయించాలని డిమాండ్ చేశారు. "నీట్ పేపర్ లీక్ ప్రభావం లక్షలాది మంది విద్యార్థులపై పడింది. దేశవ్యాప్తంగా ఏడేళ్లలో 70 చోట్ల పేపర్లు లీక్ అయ్యాయి. పార్లమెంట్‌లో దీనిపై చర్చించడం ద్వారా విద్యార్థులకు సానుకూల సంకేతాలిద్దాం. అందువల్ల చర్చకు అనుమతించండి" అని కోరారు. దీనిపై లోక్‌సభ డిప్యూటీ లీడర్ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ముగిసేవరకు వేరే అంశంపై చర్చ కుదరని చెప్పారు. సభకు కొన్ని నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. తాను సుదీర్ఘకాలంగా సభలో ఉన్నానని, ధన్యవాద తీర్మానాన్ని పక్కనపెట్టి వేరే అంశంపై ఎప్పుడూ చర్చ జరగలేదని అన్నారు. అలాగైతే ధన్యవాద తీర్మానంపై చర్చ ముగిసిన తర్వాతనైనా సమయం ఇవ్వాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. దీనిపై స్పష్టమైన హామీని ఇవ్వాలని కోరాయి. దీనిపై స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. ధన్యవాద తీర్మానం సందర్భంగా వేరే అంశంపై చర్చ సంప్రదాయం లోక్‌సభలో లేదన్నారు. నీట్‌పై చర్చ కావాలంటే సభ్యులు ప్రత్యేకంగా నోటీసు ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో, ధన్యవాద తీర్మానంపై అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభించడంతో విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఇదిలా ఉండగా, విపక్ష నేతల గొంతు నొక్కడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం మానుకోవాలని ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాహుల్ కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు.

గ్రేస్ మార్కుల 'టాపర్ల'కు 720 మార్కులు రాలేదు!

విడుదలైన నీట్ రీ-టెస్ట్ ఫలితాలు.. వాటి ఆధారంగా ర్యాంకుల సవరణ

న్యూఢిల్లీ, జూలై 1: ఈ ఏడాది మేలో నిర్వహించిన నీట్ పరీక్షలో.. గ్రేస్ మార్కుల కారణంగా 720కి 720 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినవారికి.. రీ-టెస్ట్‌లో ఆ మార్కులు రాలేదు! 1563 మందికి ఇచ్చిన గ్రేస్ మార్కులను రద్దు చేసి.. వారికోసం ప్రత్యేకంగా జూన్ 23న మళ్లీ పరీక్ష పెట్టిన జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం ఆ రీ-టెస్ట్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల ఆధారంగా.. నీట్-యూజీ 2024 అభ్యర్థులందరి ర్యాంకులను కూడా సవరించినట్టు తెలిపింది. ఈ పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీని అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని ప్రకటించింది. గ్రేస్ మార్కుల కారణంగా.. అప్పట్లో ఆరుగురు టాపర్లుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ మార్కులను ఉపసంహరించుకోవడంతో టాపర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గిపోయింది. ఆ ఆరుగురిలో ఐదుగురే రీ-టెస్ట్‌కు హాజరయ్యారు. మళ్లీ పెట్టిన పరీక్షలో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయనే విషయాన్ని ఎన్‌టీఏ వెల్లడించలేదుగానీ.. ఆ ఐదుగురిలో ఏ ఒక్కరికీ 720 మార్కులు రాలేదని విశ్వసనీయ సమాచారం. కాగా.. సవరించిన ర్యాంకుల ఆధారంగానే కౌన్సెలింగ్ జరగనుంది.

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ఫలితాల వెల్లడి: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. ఈ పరీక్షలు జూన్ 16న జరిగాయి. తుది ఫలితాలు వెల్లడయి, పరీక్షల ప్రక్రియ ముగిసిన అనంతరం జవాబుల కీ, కటాఫ్ మార్కులను ప్రకటిస్తారు.

వెంకయ్య నాయుడికి మోదీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "వెంకయ్యనాయుడు గారికి 75వ జన్మదిన శుభాకాంక్షలు. ఆయన దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా జీవించాలని ప్రార్థిస్తున్నాను. ఈ విశిష్టమైన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన గురించి ఒక వ్యాసం రాశాను. వెంకయ్యనాయుడి జీవనం, సేవ, దేశ నిర్మాణం పట్ల నిబద్ధతపై కొన్ని అభిప్రాయాలను ఆ వ్యాసంలో ప్రస్తావించాను" అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఏపీకి మోదీ చేయూతనివ్వాలి

- పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- రాజధాని అమరావతిని శరవేగంగా నిర్మించేందుకు నిధులివ్వాలి
- పార్లమెంటులో టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు



న్యూఢిల్లీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రధాని మోదీ చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన ఇటీవలి ఎన్నికల్లో ఏపీ ప్రజలు భారీ మెజారిటీతో ఎన్డీయేను గెలిపించిన విషయాన్ని గుర్తు చేశారు. 'గత పదేళ్లుగా ఏపీ ఎదుర్కొంటున్న రెవెన్యూ లోటు గురించి మాట్లాడుతూనే ఉన్నాం. దానిని పూరించవలసిన తక్షణ బాధ్యత కేంద్రంపై ఉంది. రూ.13.5 లక్షల కోట్ల మేరకు ఏపీపై రుణభారం ఉంది. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఈ మొత్తాన్ని ఏలాంటి మౌలిక సదుపాయాలకు ఉపయోగించలేదు. జలశక్తి మంత్రి పోలవరం ప్రాజెక్టుపై దృష్టి సారించాలి. గత ఐదేళ్లుగా అక్కడ పనులు స్తంభించి పోయాయి. పోలవరానికి నిపుణులను పంపించినందుకు కృతజ్ఞతలు. ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. గృహ నిర్మాణ మంత్రి, రాజధానిగా అమరావతి నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలి. పదేళ్లైన ఏపీకి రాజధాని లేదు. అందువల్ల దాన్ని శరవేగంగా నిర్మించేందుకు నిధులు అందించాలి. చెన్నై- విశాఖపట్నం పారిశ్రామిక కారిడార్ త్వరితగతిన పూర్తి చేయాలి. దీనివల్ల అన్ని రేవులు అనుసంధానం చేయవచ్చు. ఏపీకి హామీ ఇచ్చిన కేంద్ర సంస్థలను త్వరితగతిన పూర్తి చేయాలి. గిరిజన విశ్వవిద్యాలయం పనులను, కాకినాడలో గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ కాంప్లెక్స్‌ను పూర్తి చేయాలి. రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్రం నుంచి నిధులు కోరకుండా కేంద్రమే భరించాలి. గ్రామీణ మౌలిక సదుపాయాలకు కేంద్రం ప్రాధాన్యమివ్వాలి. గ్రామాలలో ఆరోగ్య సంరక్షణకు నిధులు పెంచాలి. రూరల్ ఏరియాల్లో డిజిటల్ సదుపాయాలను అందరికీ అందుబాటులో తేవాల్సిన అవసరం ఉంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే విషయంపై ఆలోచనలకు పరిమితం కాకుండా ఆచరణ సాధ్యమైన చర్యలు తీసుకోవాలి. ఉపాధి కల్పనపై దృష్టి సారించి యువతకు అవకాశాలు కల్పించాలి. సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు... అత్యధిక వడ్డీ రేట్లు, విద్యుత్ రేట్లు, సంక్లిష్టమైన కార్మిక చట్టాలతో సతమతమవుతున్నాయి' అని ఎంపీ లావు అన్నారు.

మీరు హిందువులే కాదు!

(మొదటి పేజీ తరువాయి)

గంటా 40 నిమిషాలపాటు ప్రసంగించారు. ఆయన మాట్లాడటానికి లేవగానే బీజేపీ సభ్యులు జైశ్రీరాం అని, విపక్ష సభ్యులు జైసంవిధాన్ అని పోటాపోటీ నినాదాలు చేశారు. ప్రసంగంలో భాగంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సభలో తీవ్ర దుమారం చెలరేగింది. మొత్తం అధికారపక్షం లేచి నిలబడింది. స్వయంగా ప్రధాని మోదీ రెండుసార్లు, మధ్యలో ఐదుగురు మంత్రులు ఒక్కోసారి రాహుల్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. అయితే, రాహుల్ ఎక్కడా తలొగ్గకుండా తన ప్రసంగ ధాటిని కొనసాగించారు. ధైర్యం గురించి అన్ని మతాలు చెప్పాయని, ఖురాన్ కూడా నిర్భీతిని ప్రబోధించిందని, దువా(ఆశీస్సుల) కోసం లేచే చేతిలో కనిపించేది అభయ ముద్రేనని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ సభలో శివుడు, జీసస్, గురునానక్ చిత్రాలను ప్రదర్శించారు. హిందూత్వం, ఇస్లాం, సిక్కు, క్రైస్తవం, బౌద్ధ, జైన మతాలు నిర్భీతిని ప్రబోధించాయని గుర్తు చేశారు. వీళ్లందరూ భయపడొద్దు.. భయపెట్టొద్దు అని చెప్పారన్నారు. పరమ శివుడు కూడా ఎవరికీ భయపడొద్దు, ఎవర్నీ భయపెట్టొద్దని అభయ హస్తాన్ని చూపుతున్నాడని, అహింసను ప్రబోధిస్తున్నాడని దేవుడి చిత్రాన్ని చూపిస్తూ అన్నారు.



రాహుల్ ప్రసంగంపై అభ్యంతరం చెప్తున్న బీజేపీ ఎంపీలు



విద్వేషాగ్ని...


తమను హిందువులుగా చెప్పుకొనే వాళ్లు 24 గంటలూ విద్వేషాన్ని, హింసను, అబద్ధాలను వ్యాపింపజేయడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ సభ్యుల వైపు వేలు పెట్టి చూపిస్తూ రాహుల్ అన్నారు. బీజేపీ సభ్యులు ఆగ్రహంతో లేచి నిలబడగానే మీరు హిందువులే కాదు అని మరింత గట్టిగా చెప్పారు. సత్యానికి కట్టుబడి ఉండాలని, వెనక్కి తగ్గొద్దని, సత్యం మాట్లాడటానికి భయపడొద్దని హిందూమతంలో రాసి ఉందన్నారు. ఈ సందర్భంగానే ప్రధాని మోదీ జోక్యం చేసుకున్నారు. "ఇది చాలా తీవ్రమైన విషయం. మొత్తం హిందువులను హింసావాదులనడం తీవ్రమైన విషయం" అన్నారు. దానికి రాహుల్ బదులిస్తూ, "బీజేపీ, మోదీయే మొత్తం హిందూ సమాజం కాదు. ఆరెస్సెస్ మొత్తం హిందూ సమాజం కాదు. హిందూత్వాన్ని బీజేపీకి కాంట్రాక్టు రాసివ్వలేదు" అన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా దేవుళ్ల పటాలను సభలో చూపించడం మీద అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడానికి అనుమతి లేదని చెప్పారు. బీజేపీ మైనారిటీలను బెదిరిస్తోందని, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని, హింసను ప్రేరేపిస్తోందని రాహుల్ ఆరోపించారు. సభలో తాను మాట్లాడేటపుడు మోదీ ఎందుకు సీరియస్‌గా ఉంటారని రాహుల్‌గాంధీ ప్రశ్నించగా, విపక్ష నేతను సీరియస్‌గా తీసుకుంటామని, ఆ పదవిని గౌరవించడం రాజ్యాంగం తనకు నేర్పిందని మోదీ అన్నారు. కాగా, మణిపూర్‌ను అంతర్యుద్ధం స్థాయికి తీసుకెళ్లిన మోదీ ఇంతవరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని రాహుల్ అన్నారు. అగ్నివీర్ పథకంతో సైనికులను వాడుకొని వదిలేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. భారత్ అనే భావన మీద, రాజ్యాంగం మీద బీజేపీ పూర్తి స్థాయిలో ఒక పద్ధతి ప్రకారం దాడి చేస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. చాలామంది విపక్ష నేతల మీద వ్యక్తిగత దాడికి పాల్పడ్డారని, కొందరు ఇప్పటికీ జైళ్లలో ఉన్నారని పరోక్షంగా కేజ్రీవాల్ అరెస్టును ప్రస్తావిస్తూ చెప్పారు.

అవసరమైతే మోదీ పాదాలకు నమస్కరిస్తా



సభలో రాహుల్‌కు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు మధ్య కూడా సంవాదం జరిగింది. స్పీకర్ తనతో కరచాలనం చేసినపుడు నిటారుగా నిలబడ్డారని, మోదీతో కరచాలనం చేసినపుడు పూర్తిగా తల వంచారని రాహుల్ ప్రస్తావించారు. దాంతో బీజేపీ సభ్యులు భగ్గుమన్నారు. సభాపతి మీదే రాహుల్‌గాంధీ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అమిత్‌షా మండిపడ్డారు. ప్రధాని సభా నాయకుడని, పెద్దలు నేర్పిన విలువలను అనుసరించి, వయసులో తనకన్నా పెద్దవాడైన మోదీకి తలవంచానని స్పీకర్ బదులిచ్చారు. అవసరమైతే పాదాలకు కూడా నమస్కరిస్తానన్నారు. రాహుల్‌గాంధీ స్పీకర్ అభిప్రాయాన్ని గౌరవిస్తున్నా అంటూనే సభలో స్పీకర్ కన్నా ఎవరూ పెద్ద కాదని గుర్తు చేయదలచుకున్నానని చెప్పారు. మొత్తం విపక్షం తరపున స్పీకర్‌కు తల వంచుతున్నానని అన్నారు. అదే సమయంలో స్పీకర్ ఎవరి ముందూ తలవంచరాదని విజ్ఞప్తి చేశారు.

లోకం తీరు



రాహుల్ క్షమాపణ చెప్పాలి: షా

లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై అమిత్‌షా ఎదురుదాడికి దిగారు. కోట్ల మంది తాము హిందువులమని గర్వంగా భావిస్తుంటే రాహుల్‌గాంధీ వాళ్లనందర్నీ హింసావాదులని అంటున్నారని ఆరోపించారు. ఎమర్జెన్సీ విధించిన, 1984లో ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోసిన కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన రాహుల్‌కు అహింస గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రాహుల్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలన్నారు. మరోవైపు, ముఖ్యమైన స్థానాల్లో ఉన్నవారు హిందూత్వను హింసతో ముడి పెట్టడం దురదృష్టకరమని ఆరెస్సెస్ ప్రచార విభాగం అధిపతి సునీల్ అంబేద్కర్ అన్నారు. వివేకానందుడి హిందూత్వ అయినా, గాంధీ హిందూత్వ అయినా సుహృద్భావాన్ని, సోదరభావాన్ని సూచిస్తాయని చెప్పారు.

మైకులు ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద స్విచ్ ఉండదు

న్యూఢిల్లీ, జూలై 1: లోక్‌సభలో శుక్రవారం తమ నేత రాహుల్‌గాంధీ మైకును స్పీకర్ ఆపేశారని కాంగ్రెస్ సభ్యులు చేసిన ఆరోపణను సభాపతి ఓం బిర్లా తోసిపుచ్చారు. స్పీకర్ వద్ద అలాంటి స్విచ్ ఉండదని స్పష్టం చేశారు. తనపై కాంగ్రెస్ ఎంపీలు చేసిన ఆరోపణపై ఆయన సోమవారం సభలో తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది సభాపతి గౌరవానికి సంబంధించిన అంశమని.. సభ దీనిపై చర్చించాలని కోరారు. 'సభాపతి ఆదేశాల మేరకు మైక్ నియంత్రణ జరుగుతుంది తప్ప మైకు స్విచ్ దగ్గర ఉండదు. కాంగ్రెస్ ఎంపీసురేశ్ సైతం ప్యానెల్ చైర్‌పర్సన్‌గా సభను నడుపుతున్నారు. మైక్ స్విచ్ సభాపతి వద్ద ఉంటుందా ఆయన చెప్పాలి' అని నేరుగా ఆయన్నే అడిగారు. ఇదిలా ఉండగా, ఎంపీలు ప్రమాణం చేసేటప్పుడు రాజ్యాంగం పేర్కొన్న నిర్దిష్ట ఫార్మాట్‌లోనే చేయాలని ఓం బిర్లా సూచించారు. దానికి అదనపు పదాలు జోడించడం రాజ్యాంగం గౌరవాన్ని తగ్గిస్తుందని స్పష్టం చేశారు.

మూడున్నరేళ్లయినా నిజం వైపు ఉండండి

రాజ్యసభ చైర్మన్‌ను కోరిన ఖర్గే.. సభాపతిపై ఆరోపణలు సరికాదు: నడ్డా



న్యూఢిల్లీ, జూలై 1: రాజ్యసభలో అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. నీట్‌లో అవకతవకలు, పార్లమెంటు ఆవరణలోని విగ్రహాల తరలింపు, ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ ప్రసంగాలు, ఆరెస్సెస్ తదితర అంశాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సభల్లో మోదీ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారన్నారు. ఆరెస్సెస్ సిద్ధాంతాలపైనా ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యూనివర్సిటీలు, ఎన్‌సీఈఆర్‌టీతో పాటు ఇతర విద్యాసంస్థల్లో ఉప కులపతులు, ప్రొఫెసర్ల నియామకాల్లో ఆరెస్సెస్ ప్రమేయం ఉంటున్నదని, ఆ సంస్థ సిద్ధాంతాలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ధన్‌ఖడ్ మండిపడ్డారు. "ఆరెస్సెస్ దేశ అభివృద్ధికి కృషి చేస్తోంది. దేశ ప్రగతి కోసం శ్రమిస్తున్న ఎంతోమంది గొప్పవారు అందులో ఉన్నారు. అదేమైనా నేరమా?" అని ప్రశ్నించారు. ప్రధాని ప్రసంగాలపై, ఆరెస్సెస్‌పై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని జేపీ నడ్డా కోరగా.. తొలగిస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు. పదేళ్ల పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని ఎన్నికల సమయంలో మోదీ చెప్పారన్న ఖర్గే.. మూడోసారి అధికారంలోకి రాగానే పేపర్ లీక్‌లు, ఉగ్రదాడులు, రైలు ప్రమాదం, విమానాశ్రయంలో టెర్మినల్ కూలడం, వంతెనలు కూలడం లాంటి అనేక ఘటనలు జరిగాయని ఎద్దేవా చేశారు. ఖర్గే వ్యాఖ్యలపై జేపీ నడ్డా మండిపడ్డారు. రాబోయే మూడు, మూడున్నరేళ్ల కాలంలో (ధన్‌ఖడ్ పదవీ కాలం ముగిసే సమయం) అయినా నిజం పక్షాన నిలవాలంటూ ఖర్గే వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన ధన్‌ఖడ్ తానెప్పుడూ సత్యం వైపే ఉంటానన్నారు. నడ్డా మాట్లాడుతూ.. రాబోయే మూడున్నరేళ్లయినా నిష్పక్షపాతంగా ఉండాలని ఖర్గే వ్యాఖ్యానించారని, అంటే గడిచిన 18 నెలలు చైర్మన్ పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించినట్లేనన్నారు. ఇది తీవ్రమైన ఆరోపణ అని, దీన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదని అన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఇలాంటి మాటలు మాట్లాడడం సరికాదని, చైర్మన్‌పై ఆరోపణలను అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలో న్యాయం

సుప్రీం స్థాయిలో పరిష్కారం.. నేరాలకు అడ్డుకట్ట.. విపక్షాలది అనవసర రాద్ధాంతం.. చర్చలకు సిద్ధం

- కొత్త చట్టాల కింద గ్వాలియర్‌లో తొలి కేసు
- మీడియాతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



న్యూఢిల్లీ, జూలై 1: కొత్త నేర న్యాయ చట్టాల కింద.. సుప్రీం కోర్టు స్థాయిలో ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలో అన్ని కేసుల్లో న్యాయం లభిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 90% కేసుల్లో దోషులు ఎవరో తేలి.. శిక్షలు పడతాయని, భవిష్యత్తులో దారుణాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదీర్ఘ నిరీక్షణలకు అవకాశం లేకుండా, న్యాయ ప్రక్రియకు కాల పరిమితిని నిర్దేశించామన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు నుంచి నాలుగేళ్లలో పూర్తి సాంకేతికతతో ప్రపంచంలో మనదే అత్యాధునిక నేర న్యాయ వ్యవస్థ అవుతుందని తెలిపారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన పది నిమిషాలకు.. ఆదివారం అర్ధరాత్రి 12.10కు మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో ద్విచక్ర వాహన చోరీపై తొలి కేసు నమోదైనట్లు అమిత్ షా చెప్పారు. ఢిల్లీలోని వీధి వ్యాపారిపై మొదటి కేసు నమోదైనట్లు వచ్చిన వార్తలను పోలీసులు ఖండించారని తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాల్లో శిక్షకు ప్రాధాన్యం ఉందని, తాము మాత్రం న్యాయానికి పెద్దపీట వేశామని, జీరో ఎఫ్ఐఆర్, ఈ-ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాల ద్వారా ఫిర్యాదు నమోదును సులభతరం చేశామని వివరించారు. "మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించిన అధ్యాయాన్ని చేర్చడం, ఏడు రోజుల్లో విచారణ నివేదికను ఫైల్ చేయాలనే నిబంధన ద్వారా కొత్త చట్టాలను మరింత సమర్థంగా తీసుకొచ్చాం. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యలు, మూక దాడులకు నిర్వచనం ఇచ్చాం. మూక దాడుల నిరోధానికి ప్రత్యేక నిబంధన తీసుకొచ్చాం. లైంగిక దాడుల ఉదంతాల్లో బాధితురాలి ఇంటి వద్దనే, సంరక్షకుల సమక్షంలో మహిళా పోలీసు ద్వారా వాంగ్మూలం నమోదుకు అవకాశం ఉంటుంది" అని అమిత్ షా తెలిపారు. కొత్త చట్టాల్లో పోలీసులకు మరిన్ని అధికారాలను ఇవ్వలేదని స్పష్టం చేశారు. రిమాండ్ వ్యవధి 15 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. కాగా, కొత్త క్రిమినల్ చట్టాలపై సందేహాలు ఉంటే నివృత్తి చేయడానికి పోలీసు పరిశోధన, అభివృద్ధి సంస్థ కంట్రోల్ రూంను నెలకొల్పింది. న్యూఢిల్లీలోని బీపీఆర్‌డీ ప్రధాన కార్యాలయంలో ఇది ఏర్పాటైంది.

ఏ చట్టాలపైనా ఇంతగా చర్చ జరగలేదు..

తమను పార్లమెంటు నుంచి బహిష్కరించి, ఎలాంటి చర్చ లేకుండా కొత్త నేర చట్టాలను తీసుకొచ్చారన్న విపక్షాల ఆరోపణలను అమిత్ షా కొట్టిపేశారు. చరిత్రలో ఏ చట్టాలపైనా జరగనంత చర్చ వీటిపై సాగిందన్నారు. లోక్‌సభలో 9 గంటలు, రాజ్యసభలో 6 గంటలు చర్చించారని, 118 సార్లు తాను స్వయంగా పాల్గొన్నట్లు చెప్పుకొచ్చారు. 30 గంటలకు పైగా సంప్రదింపులు జరిగాయన్నారు. విపక్షాలది అనవసర రాద్ధాంతమని, ఇంకా అనుమానాలున్న నాయకులతో సమావేశానికి సిద్ధమని ప్రకటించారు. అభిప్రాయాలు చెప్పాలని ఎంపీలకూ లేఖ రాసిన సంగతి గుర్తుచేశారు.

మేధాపాట్కర్‌కు 5 నెలల జైలు

- పరువునష్టం కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు



న్యూఢిల్లీ, జూలై 1: నర్మదా బచావో ఆందోళన ఉద్యమకారిణి, సామాజిక కార్యకర్త మేధాపాట్కర్‌కు ఢిల్లీలోని ఓ కోర్టు 5 నెలల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న వీకే సక్సేనా 24 సంవత్సరాల క్రితం ఆమెపై దాఖలు చేసిన పరువునష్టం కేసులో కోర్టు సోమవారం ఈ తీర్పు ఇచ్చింది. దీంతోపాటు సక్సేనాకు జరిగిన పరువు నష్టానికిగాను 10 లక్షల రూపాయలను ఆమె చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఈ ఏడాది మే నెలలోనే ఈ కేసులో మేధాపాట్కర్‌ను దోషిగా తేల్చారు. సక్సేనాపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఆయనకు పరువునష్టం కలిగించడమే కాకుండా, ఆయనపై ప్రతికూల భావనలు రేకెత్తించేలా ఉన్నాయని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం మేధాపాట్కర్ వయసు 69 సంవత్సరాలు. ఆమె వయసు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆమెకు కఠిన కారాగార శిక్ష విధించడం లేదని, కేవలం సాధారణ జైలుశిక్ష విధిస్తున్నామని మేజిస్ట్రేట్ తెలిపారు. కాగా, బెయిల్ కోసం మేధాపాట్కర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగే వరకు ఆమెకు ఉపశమనం కలిగించేందుకు శిక్షను ఈనెల 30వ తేదీ వరకు నిలిపివేశారు.

జన్యుసవరణ ప్రక్రియకు మనోళ్ల మెరుగు

హైదరాబాద్ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాస్9.. జన్యు సవరణ ప్రక్రియలో వాడే అత్యంత కీలకమైన ప్రొటీన్ ఇది! ఇప్పటిదాకా శాస్త్రజ్ఞులు దీన్ని 'స్ట్రెప్టోకోకస్ ప్యోజీన్స్' అనే బ్యాక్టీరియా నుంచే తీసుకుంటున్నారు. అలా కాకుండా.. మనదేశానికి చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ (సీఎస్ఐఆర్-ఐజీఐబీ) శాస్త్రజ్ఞులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి (ఎల్వీపీఈఐ) వైద్యులు కలిసి 'ఫ్రాన్సిసెల్లా నోవిసిడా' అనే బ్యాక్టీరియమ్ నుంచి సేకరించారు. జన్యువ్యాధుల నిర్ధారణలో, వాటికి సమర్థంగా చికిత్స చేయడంలో ఈ కొత్త ప్రొటీన్ చాలా మెరుగ్గా పనిచేస్తుందని ఎల్వీపీఐఈ వైద్యులు వివరించారు. రకరకాల జన్యువ్యాధుల చికిత్సలో కీలకపాత్ర పోషిస్తుందని వెల్లడించారు. చిన్నవయసు నుంచే కంటిచూపును తగ్గించే 'లేబర్స్ కంజెనిటల్ అమరోసిస్ టైప్ 2(ఎల్‌సీఏ-2)' అనే జన్యుసమస్యతో బాధపడే చిన్నారికి ఈ కొత్త విధానం ద్వారా చికిత్స అందించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు.. అతడి కంటిచూపును సమర్థంగా మెరుగుపరిచారు. కంటిలో సాధారణ ప్రొటీన్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే ఒక జన్యు పరివర్తన వల్ల ఈ సమస్య వస్తుందని వారు వివరించారు. దీన్ని గుర్తించిన అనంతరం.. డాక్టర్ దేబోజ్యోతి చక్రవర్తి ఆధ్వర్యంలోని వైద్య బృందం.. కొత్త కాస్9 ప్రొటీన్ ద్వారా జన్యుసవరణ చేసి, ఆ బాలుడి దృష్టిలోపాన్ని సరిచేసినట్లు వెల్లడించారు. రోగి చర్మకణాల నుంచి సేకరించిన మూలకణాలను రీ ప్రోగ్రామ్ చేయడం ద్వారా అతడి సమస్యను పరిష్కరించి, దోష నివారణ చేసినట్లు చెప్పారు. వారి అధ్యయన ఫలితం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది.

రాజకీయేతర అంశాలతో 'ప్రత్యేక హోదా'!

ఆర్థిక సంఘానికి ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సభ్యురాలు ఆషిమా గోయల్ సూచన



న్యూఢిల్లీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బిహార్, ఏపీ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే అంశాన్ని రాజకీయేతర అంశాల ఆధారంగానే నిర్ణయించాలని ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సభ్యురాలు ఆషిమా గోయల్ సూచించారు. తక్కువ జనసాంద్రత ఉన్న కొండ ప్రాంతాలు, బలహీనమైన సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి అంశాల ఆధారంగా ప్రత్యేక హోదా ప్రమాణాలు నిర్ణయించబడ్డాయని ఆమె తెలిపారు. ఏపీ, బిహార్‌కు ఈ ప్రమాణాలు వర్తించవని ఆషిమా సోమవారం పీటీఐ వార్త సంస్థకు తెలిపారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాల్లో కేంద్ర ప్రాయోజిత పథకానికి అవసరమైన నిధుల్లో 90%, సాధారణ కేటగిరి రాష్ట్రాలకు 60 శాతం కేంద్రం సమకూరుస్తుందని, మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఆమె అన్నారు. 14వ ఆర్థిక సంఘం ఇక నుంచి రాష్ట్రాలకు కొత్తగా ప్రత్యేకహోదా ఇవ్వకూడదని స్పష్టం చేసిందని తెలిపారు

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ, జూలై 1: వ్యాపారులు, వాణిజ్య సంస్థలకు ఊరటనిస్తూ చమురు గ్యాస్ కంపెనీలు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాయి. దేశవ్యాప్తంగా 19 కేజీల సిలిండర్ ధరను సరాసరిన రూ. 30 మేర తగ్గిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్నాయి. తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నాయి. సవరించిన రేట్లతో ఢిల్లీలో రూ.1646, ముంబైలో రూ.1598, చెన్నైలో రూ.1756, కోల్‌కతాలో రూ.1787 మేర వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఉన్నాయి. రెండు నెలలుగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. జూన్ 1న రూ. 69 మేర తగ్గగా, మే 1న రూ. 19 మేర తగ్గించారు.



ప్రజల వద్దే రూ.7,581 కోట్ల విలువైన 2 వేల నోట్లు: ఆర్బీఐ

ముంబై, జూలై 1: రద్దయిన రూ.2 వేల నోట్లలో దాదాపు 97.87% బ్యాంకులకు చేరగా.. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని ఆర్బీఐ సోమవారం తెలిపింది. 2023 మే 19న చలామణిలో నుంచి 2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికీ రూ.3.56 లక్షల కోట్ల విలువైన 2 వేల నోట్లు వాడుకలో ఉండగా.. ఈ ఏడాది జూన్ 28 నాటికి అందులో రూ.7,581 కోట్లు తగ్గిందని తాజాగా పేర్కొంది. గతేడాది అక్టోబరు 7వ తేదీ వరకు 2 వేల నోట్లను అన్ని బ్యాంకుల్లో మార్చుకునేందుకు అవకాశం కల్పించారు. అదే నెల 9 తర్వాత కూడా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో 2 వేల నోట్లను మార్చుకొనే వెసులుబాటు ఇచ్చారు.

ప్రధాని మోదీ కూడా అంతరిక్షంలోకి వెళ్లొచ్చు..

- గగన్‌యాన్‌పై ఇంటర్వ్యూలో ఇస్రో చైర్మన్



న్యూఢిల్లీ, జూలై 1: భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మానవ మిషన్ 'గగన్‌యాన్' కార్యరూపం దాలిస్తే ప్రధాని మోదీ కూడా అంతరిక్షంలోకి వెళ్లవచ్చని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. గగన్‌యాన్ మిషన్‌పై ఆయన ఓ జాతీయ చానెల్‌కు సోమవారం ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా 'ప్రధాని మోదీ అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం ఉందా..?' అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఆ శక్తిసామర్థ్యాలను సాధిస్తే అది మనందరికీ ఎంతో గర్వకారణమేనని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యపడదని, దానికి ఎంతో శిక్షణ అవసరమని చెప్పారు. "ప్రధాని మోదీకి కచ్చితంగా ఎన్నో కీలక బాధ్యతలు ఉంటాయి. ప్రముఖులను అంతరిక్షంలోకి పంపించడం ప్రస్తుత దశలో సాధ్యపడదు. ఎందుకంటే ఎంతో నైపుణ్యం అవసరమైన ఈ కార్యక్రమంలో భాగం కావాలంటే నెలల తరబడి శిక్షణ పొందాల్సి ఉంటుంది" సోమనాథ్ పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి పంపి వారిని తిరిగి సురక్షితంగా భూమిపైకి తీసుకురావాలని ఇస్రో భావిస్తోంది. కాగా, ఈ ఏడాది ఆగస్టులో ఫాల్కన్-9 రాకెట్ ద్వారా జీశాట్-20 ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నామని సోమనాథ్ చెప్పారు.



న్యాయవాదులనుద్దేశించి ప్రసంగిస్తున్న జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు

బాధితులకు సత్వర న్యాయం కోసమే బీఎన్ఎస్

- సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాలు మారుతున్నాయి
- జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందించడమే ధ్యేయంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినీయమ్ చట్టాలను కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు అన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టాలు నవ జాత శిశువులు లాంటివన్నారు. న్యాయవాదులు వాటిని క్రమం తప్పకుండా అధ్యయనం చేయాలన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంపై న్యాయవాదులకు అవగాహన కల్పించేందుకు న్యాయవాదుల సంఘం సోమవారం హైకోర్టులో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై బీఎన్ఎస్ చట్టంలోని పలు సెక్షన్ల గురించి వివరించారు. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)లో మొత్తం 511 సెక్షన్లు ఉండగా, దాని స్థానంలో అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్‌లో 358 సెక్షన్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఐపీసీలోని కొన్ని సెక్షన్లను ఏకం చేయడం, కొన్ని సెక్షన్లను తొలగించడం వల్ల బీఎన్ఎస్‌లో సంఖ్య తగ్గిందన్నారు. కొత్తగా 14 నుంచి 15 సెక్షన్లను బీఎన్ఎస్‌లో చేర్చారన్నారు. ఐపీసీలో ఐదురకాల శిక్షలు విధించేందుకు వీలుండగా, వీటికి తోడు బీఎన్ఎస్‌లో సామాజిక సేవ శిక్ష విధించేందుకు వీలు కల్పించారన్నారు. అయితే సామాజిక సేవను బీఎన్ఎస్ చట్టంలో నిర్వచించలేదన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, జనరల్ సెక్రెటరీ శ్రీహరి పాల్గొన్నారు.

ఎస్‌జీపీలుగా న్యాయవాదులు ఎస్.ప్రణతి, టి.విష్ణుతేజ

- ఉత్తర్వులు జారీ చేసిన న్యాయశాఖ

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఎస్.ప్రణతి, తిరుమాని విష్ణుతేజ హైకోర్టులో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులుగా నియమితులయ్యారు. అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌కు వృత్తిపరంగా వీరు ఇరువురు సహాయకులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.సునీత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు గత ప్రభుత్వ హయంలో ముగ్గురు ఎస్‌జీపీలు, 26మంది జీపీలు, ఆరుగురు ఏజీపీలు, ఓ స్పెషల్ కౌన్సిల్ సమర్పించిన రాజీనామాలను ఆమోదిస్తూ న్యాయశాఖ కార్యదర్శి జీవో జారీచేశారు.



దెబ్బతిన్న డయాఫ్రం వాల్ ప్రాంతంలో నిపుణుల బృందం

దయాఫ్రం వాల్‌పై ఆందోళన వద్దు

ప్రత్యామ్నాయాలు సూచిస్తాం.. అమెరికా, కెనడా నిపుణుల వెల్లడి

- పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వరుసగా రెండో రోజూ పర్యటన
- వాల్ పునరుద్ధరణ సాధ్యమే
- దానిపై ఈసీఆర్ఎఫ్ డ్యాం కట్టొచ్చు
- అంతర్జాతీయ నిపుణుల వెల్లడి
- నేడు గైడ్‌బండ్ పరిశీలన
- నిర్మాణ సంస్థలతోనూ భేటీ
- దెబ్బతిన్న కట్టడాల మరమ్మతుపై స్పష్టత వచ్చే అవకాశం!

అమరావతి-ఆంధ్రజ్యోతి/పోలవరం, జూలై 1: పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతినడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంతర్జాతీయ నిపుణులు భరోసా ఇచ్చారు. ఇలా దెబ్బతిన్న డయాఫ్రం వాల్స్‌కు తాము గతంలో మరమ్మతులు, ప్రత్యామ్నాయాలు సూచించామన్నారు. వాటికి అనుగుణంగా నిర్మించిన కట్టడాలు భద్రతాపరంగా బలీయంగానే ఉన్నాయని స్పష్టం చేశారు. దీనికీ ప్రత్యామ్నాయాలు సూచిస్తామని హామీ ఇచ్చారు. అమెరికాకు చెందిన ప్రాజెక్టుల నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ సోమవారం వరుసగా రెండో రోజు కూడా ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. ఉదయం 10 గంటలకు ప్రాజెక్టు అతిథి గృహానికి చేరుకుని.. ప్రాజెక్టు కార్యాలయంలో గంటన్నర సేపు పీజియో మీటర్ల ద్వారా సీపేజీ తీవ్రత తెలుసుకున్నారు. దానిని నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. కేసింగ్ పైపులను ఎగువ కాఫర్ డ్యాం నడుమ పలు ప్రాంతాల్లో భూమిలో దింపి నీటిని పంపి పరీక్షలు నిర్వహించడం ద్వారా కాఫర్ డ్యాం లోపల భూగర్భంలో ఎన్ని మీటర్ల లోతు నుంచి ఎత్తు వరకూ సీపేజీ వస్తోందో చర్చించారు. ఇతర పద్ధతుల ద్వారా సీపేజీ తెలుసుకోవడానికి ఆస్కారం ఉందో లేదో పరిశీలించారు. కేంద్ర జలసంఘం డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్‌కుమార్, ప్రాజెక్టు సీఈ నరసింహమూర్తి, జలసంఘం శాస్త్రవేత్త మనీశ్ గుప్తా, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యాం నిపుణుడు, ఆఫ్రి కన్సల్టెన్సీ సభ్యుడు సంపత్ పూర్తి వివరాలను తెలియజేశారు. దాదాపు గంటన్నర సేపు జరిగిన చర్చల్లో కాఫర్ డ్యాం గ్యాప్‌ల పూడ్చివేత, సీపేజీ నివారణ అంశాలపై నిపుణులు మాట్లాడారు. అనంతరం కాఫర్ డ్యాంల మధ్య జరుగుతున్న వైబ్రో కాంపాక్షన్ పనులను స్వయంగా పరిశీలించి సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత భోజన విరామానంతరం అధికారులతో భేటీ అయ్యారు. ఇప్పటిదాకా నిర్మాణ సంస్థలు చేపట్టిన కట్టడాలకు సంబంధించి డిజైన్లు, వాటికి కేంద్ర జలసంఘం ఇచ్చిన అనుమతులు వంటివాటిపై సమీక్ష జరిపారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్న తర్వాత.. పోలవరం ప్రాజెక్టు డిజైన్లకు ఆమోదం తెలిపేందుకు జల సంఘం జంకుతోంది. అయితే.. అలాంటి భయాలేమీ అక్కర్లేదని నిపుణులు సూచించారు. డయాఫ్రం వాల్ పునరుద్ధరణ సాధ్యమేనని.. అది కట్టాక దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం వేసేయవచ్చని తెలిపారు. మంగళవారం నిర్మాణ సంస్థలతో సమావేశమయ్యాక.. డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంల్లో సీపేజీపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్టులో ఇప్పటిదాకా నిర్మించిన కట్టడాల డిజైన్లు, వాటి సామర్థ్యాలను కూలంకషంగా వివరించాలని నిపుణులు వాటికి సూచించారు. తర్వాత రాజమహేంద్రవరం బయల్దేరి వెళ్లారు. ఇటీవల కుంగిన స్పిల్‌వే గైడ్ బండ్‌ను మంగళవారం వారు పరిశీలిస్తారని సీఈ నరసింహమూర్తి తెలిపారు. కాగా.. ప్రాజెక్టుల కీలక నిర్మాణాలపై అనుభవం కలిగిన అంతర్జాతీయ నిపుణులు.. దెబ్బతిన్న పోలవరం నిర్మాణాలపై భయపడాల్సిందేమీ లేదని భరోసా ఇవ్వడం జల వనరుల శాఖ అధికారులకు ఊరటనిచ్చింది. ఇక నిర్మాణాలపై ముందడుగు వేయడంపై దృష్టిసారించాలని భావిస్తున్నారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చీఫ్ ఇంజనీర్ రాజేశ్‌కుమార్, వ్యాప్కోస్ మేనేజర్ ఎస్‌కే పట్నాయక్, ఈఈలు మల్లికార్జునరావు, బాలకృష్ణ, పాండురంగయ్య, ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో వైసీపీ కోర్టుధిక్కరణ పిటిషన్

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): గుంటూరుజిల్లా తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయం విషయంలో చట్టనిబంధనలకు లోబడి వ్యవహరించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించి అధికారులు నిర్మాణాన్ని కూల్చివేశారని, బాధ్యులైన అధికారులపై కోర్టుధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ హైకోర్టులో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఆపార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు ఈ పిటిషన్ దాఖలు చేశారు. సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌లను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

జూలైలో పుష్కలంగా వర్షాలు

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొన్ని ప్రాంతాలు తప్ప అనేక ప్రాంతాల్లో జూలైలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాల సగటులో 106 శాతం) నమోదుకానుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. అయితే ఈ నెలలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఎండలు కొనసాగుతాయని తెలిపింది. ఈ మేరకు సోమవారం బులెటిన్ విడుదల చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏడాదిపాటు కొనసాగిన ఎల్‌నినో బలహీనపడి ప్రస్తుతం తటస్థ పరిస్థితులు ఏర్పడ్డాయి. వచ్చే నెలకల్లా లానినా పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా, తూర్పు ప్రాంతంలో తక్కువగా ఉన్నాయి. ఇంకా హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐవోడీ) తటస్థంగా ఉంది. ఇది వచ్చే రెండు నెలల్లో పాజిటివ్ దశలోకి మారనుందని అంచనా వేస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో జూలైలో దేశంలో అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఈశాన్య, తూర్పు, వాయవ్య భారతాలు, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూలైలో దేశంలో సగటున 280.4 మి.మీ. వర్షపాతం కురవాలి. అయితే దీనికంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుందని ఐఎండీ పేర్కొంది. జూన్‌లో సాధారణ వర్షపాతం నమోదుతుందని మే 27న విడుదల చేసిన బులెటిన్‌లో ఐఎండీ అంచనా వేయగా, 11 శాతం తక్కువగా నమోదైంది. అయితే జూన్ చివరిలో రుతుపవనాలు పుంజుకోవడంతో సోమవారంనాటికి వాయవ్య భారతంలో కొద్దిప్రాంతాలు తప్ప దేశంలోని అన్ని ప్రాంతాలకూ నైరుతి రుతుపవనాలు విస్తరించాయి.

ఏపీలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో జూలైలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ, రాయలసీమలో కొంత భాగంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ పేర్కొంది. పగటి ఉష్ణోగ్రతలు శ్రీకాకుళం జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా, మిగిలిన జిల్లాల్లో తక్కువగా నమోదవుతాయని తాజా బులెటిన్‌లో తెలిపింది. రాష్ట్రంలో జూన్‌లో సాధారణం కంటే 61.3 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో తొలకరి పనులు ఊపందుకున్నాయి.

మరో నాలుగు రోజులు వానలు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న 4 రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, అనేక చోట్ల తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ సోమవారం తెలిపింది.

అమాత్యుడి సతీమణి అతి

- తన కాన్వాయ్‌లో రాలేదని ఎస్ఐపై ఆగ్రహం
- నడిరోడ్డుపై జనం చూస్తుండగానే ఓవరాక్షన్
- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య అనుచిత తీరు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆమె.. మంత్రి లేదా చట్టసభ సభ్యురాలు కాదు. కనీసం ప్రజాప్రతినిధి కూడా కాదు. జరుగుతున్నది ప్రభుత్వ కార్యక్రమం. మంత్రి భార్యగా ఓ ప్రైవేటు వ్యక్తిగా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారంతే. ఆమె వస్తున్నారని పోలీసులు ఎలాంటి ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం లేదు. అయినాసరే తమ కాన్వాయ్‌లో ఎస్ఐ రాలేదంటూ అమాత్యుడి సతీమణి అతి చేశారు. నడిరోడ్డు మీద స్థానిక ప్రజలు చూస్తుండగానే ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నేతలకు, వీళ్లకు తేడా ఏంటని ప్రజలు విమర్శిస్తున్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత హాజరయ్యారు. తమ కాన్వాయ్‌లో చిన్నమండెం ఎస్ఐ రమేశ్‌బాబు రాకపోవడంతో మండిపడ్డారు.



ఎస్ఐ రమేశ్‌బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత

పిలిపించి మరీ...

సోమవారం ఉదయం 9 గంటలకు దేవగుడిపల్లెకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత వెళ్లారు. అక్కడ సీఐతో పాటు ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఎస్ఐ రమేశ్ బాబు లేకపోవడంతో మంత్రి భార్య ఆరాతీశారు. దీంతో సీఐ ఫోన్ చేసి ఎస్ఐను అక్కడికి రప్పించారు. సాధారణ దుస్తుల్లో వచ్చిన ఆయన సీఐ సూచనతో సమీపంలో వాహనంలో ఉన్న యూనిఫాం వేసుకుని వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సతీమణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జరిగిన సంభాషణ....

మంత్రి భార్య: ఏం ఇప్పుడు తెల్లారిందా?

ఎస్ఐ: కాన్ఫరెన్స్ ఉండింది మేడం.

మంత్రి భార్య: సీఐకి లేని కాన్ఫరెన్స్ నీకే ఉందా? పెళ్లికొచ్చావా? డ్యూటీలో రావాలి. యూనిఫాంలో రావాలని కూడా తెలియదా మీకు?

ఎస్ఐ: సారీ మేడం.

మంత్రి భార్య: దేనికి సారీ?

ఎస్ఐ: పొరపాటు జరిగింది మేడం.

మంత్రి భార్య: ఏం పొరపాటు? హా.. గవర్నమెంటే కదా జీతం ఇస్తోంది. వైసీపీ వాళ్లు ఏమైనా ఇచ్చారా? మరి.. డ్యూటీ చేస్తున్నారా? ఇంకేమన్నా.. మీ కోసం అరగంట నుంచి వెయిట్ చేశాం.

ఎస్ఐ: (మంత్రి భార్యకు ఏదో చెప్పారు. అనంతరం సెల్యూట్ చేశారు.)

మంత్రి భార్య: హా.. పొండి. (పదండి..)

చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం

- ఉద్యోగుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి
- మంత్రి సతీమణి తీరుపై చంద్రబాబు అసంతృప్తి
- రాంప్రసాద్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన సీఎం
- ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి సతీమణి పోలీసులతో వ్యవహరించిన తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి సతీమణి హరిత స్థానిక ఎస్ఐతో మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు. రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సోమవారం ఆయన విశాఖ నగరంలో తమ శాఖకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు పెంచిన పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన తరఫున పాల్గొనాలని సతీమణి హరిత భావించారు. చిన్నమండెం మండలంలో పింఛన్ల పంపిణీకి తాను వెళ్తున్నాని, భద్రతా ఏర్పాట్ల కోసం తన వాహనానికి ఎస్కార్ట్‌గా రావాలని స్థానిక ఎస్ఐకి చెప్పారు. ఎస్ఐ ఆలస్యంగా రావడంతో ఆమె పరుషంగా మాట్లాడారు. ఆమె మాట్లాడిన మాటలు టీవీల్లో విస్తృతంగా ప్రసారమయ్యాయి. ఈ విషయం తెలియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడి వివరణ కోరారు. 'అధికారులు, ఉద్యోగుల పట్ల అంతా గౌరవంగా మసలుకోవాలి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఏ స్థాయి వారు వ్యవహరించినా ఉపేక్షించేది లేదు. ఇలాంటి వైఖరిని సహించేది లేదు' అని ఆయన మంత్రికి స్పష్టం చేశారు. జరిగిన సంఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకొంటానని ముఖ్యమంత్రికి చెప్పారు.


డీఎడ్ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

- టెట్ నోటిఫికేషన్ జారీ.. ఆగస్టు 5 నుంచి 20 వరకు పరీక్షలు.. 30న ఫలితాలు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను డీఈడీ అభ్యర్థులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం జారీచేసిన టెట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. గత ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులకు అర్హత విషయంలో పదే పదే నిర్ణయాన్ని మార్చుకుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీఈడీ చదివిన వారు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. ఈనెల 3 నుంచి 16 వరకు ఫీజు చెల్లించే గడువుగా పేర్కొంది. 4 నుంచి 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని, 16 నుంచి ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. 25 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలు ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు రోజూ రెండు సెషన్లలో జరుగుతాయని పేర్కొంది. ఒక్కో కేటగిరీ పరీక్షలు ముగిసిన తర్వాత 10 నుంచి ప్రాథమిక కీ విడుదలవుతుందని, 11 నుంచి 21 వరకు అభ్యర్థులు అభ్యంతరాలు తెలపవచ్చని వివరించింది. 25న తుది కీ విడుదల చేసి, 30న ఫలితాలు విడుదల చేస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టంచేసింది. తాజా నిర్ణయం ప్రకారం ఎస్జీటీ పోస్టులకు పరీక్షలు జరిగే పేపర్-1ఏకు డీఈడీ అర్హత కలిగినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నెల్లూరులో వైద్యురాలి ఆత్మహత్య!

- మెడికల్ కళాశాల నాలుగో అంతస్థు నుంచి పడి మృతి
- ఫోన్ మాట్లాడుతూ దూకిన వైనం.. డాక్టర్స్ డే రోజే విషాదం



మృతిచెందిన డాక్టర్ జ్యోతి (ఫైల్)

నెల్లూరు (వైద్యం), జూలై 1: డాక్టర్స్ డే రోజునే విషాదం చోటుచేసుకుంది. నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ యువ వైద్యురాలు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. నెల్లూరు జిల్లా చేజర్ల మండలం చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నంబూరి జ్యోతి (34) 2022 సెప్టెంబరు నుంచి డాక్టర్‌గా పనిచేస్తున్నారు. కేన్సర్ వ్యాధిపై శిక్షణ కోసం ఆమె సోమవారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు వచ్చారు. తోటి వైద్యులతో కలిసి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. భోజన విరామం తర్వాత కూడా ఉత్సాహంగానే ఉన్నారు. ఇంతలో ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. దీంతో ఆమె హడావుడిగా ఫోన్ మాట్లాడుతూ మొదటి అంతస్థు నుంచి నాలుగో అంతస్థుకు చేరుకున్నారు. కొద్దిసేపటికే పైనుంచి కిందకు దూకి మృతి చెందారు. నాలుగో అంతస్థులో నాలుగు అడుగుల ఎత్తులో ఇనుప కంచె ఉంది. కాబట్టి జారిపడే అవకాశం లేదు. ఫోన్ మాట్లాడే సమయంలో మానసిక సంఘర్షణకు లోనైన జ్యోతి పైనుంచి దూకి ఉండొచ్చని శిక్షణకు వచ్చిన తోటి వైద్యులు చెబుతున్నారు. కుటుంబ కలహాల కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, మృతురాలి భర్త రవిబాబు కూడా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడిగా పనిచేస్తున్నారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. హైదరాబాదులోని జ్యోతి తల్లిదండ్రులు వస్తే తప్ప అసలు విషయాలు వెలుగులోకి రావని పోలీసులు తెలిపారు. వారు ఇచ్చే ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

కొనసాగుతున్న వీసీల రాజీనామాలు

తాజాగా ఎన్టీఆర్, ఏఎన్‌యూ జేఎన్టీయూకే తదితర వీసీలు

అమరావతి, జేఎన్టీయూకే, కర్నూలు(అర్బన్), పెదకాకాని, జూలై 1(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల వీసీల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మారిన నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన పలు విశ్వవిద్యాలయాల వీసీలు కొంతమంది ఇప్పటికే తమ పదవులకు రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే!. తాజాగా విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బాబ్జీ సహా, కాకినాడ జేఎన్టీయూ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ సోమవారం రాజీనామా చేశారు. డాక్టర్ బాబ్జీ తాను రాజీనామా చేస్తున్నట్లు డాక్టర్స్ డే కార్యక్రమంలో ఆయన ప్రకటించి, ఆ వెంటనే స్వయంగా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు. గత ఏడాది ఫిబ్రవరి 13న ఆయన వీసీగా నియమితులయ్యారు. అంతకుముందు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ వీసీగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీగా మార్చగా, ఇక్కడ బాబ్జీ వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వైఎస్ఆర్ బొమ్మను ఏర్పాటు చేశారు. నిబంధనలప్రకారం వీసీ నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీ ఏర్పాటు చేస్తుంది. సమర్థులను ఎంపిక చేస్తారు. కానీ.. డాక్టర్ బాబ్జీ.. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ వియ్యంకుడు కావడంతో వీసీ నియామకంలో పోటీ లేకుండా పోయింది. అలాగే, తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వీసీ దేపూరు భారతి, ఆచార్య నాగార్జున వర్సిటీ వీసీ రాజశేఖర్, ఏఎన్‌యూ రెక్టార్ పి. వరప్రసాద్ మూర్తి కూడా సోమవారం రాజీనామా చేశారు. ఇదిలాఉంటే విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన పదవులు నుంచి తమను రిలీవ్ చేయాలని కోరుతూ వర్సిటీ లోని డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు మూకుమ్మడిగా తమ రిలీవింగ్ ఆర్డర్లను వీసీ రాజశేఖర్‌కు అందజేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అద్భుత ఛాంపియన్లు

టీమిండియా మరో సువర్ణాధ్యాయానికి తెరతీసింది. కదనరంగంలో కసిగా పోరాడితే అందలం ఎలా దక్కుతుందో నిరూపించింది. నాటి కపిల్ డెవిల్స్, ధోనీ సేన సాధించిన విజయాలను మరిపిస్తూ ప్రపంచ కప్పును ఒడిసిపట్టుకుంది. తుది పోరులో దక్షిణాఫ్రికాను ఓడించి రెండో పర్యాయం టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ చారిత్రక సందర్భమే టీ20 ఆటనుంచి కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలకు ఘన వీడ్కోలును కూడా ఇచ్చింది.

ఆటలో గెలుపోటములు సహజం. సరిగ్గా ఏడునెలల క్రితం మన దేశంలోనే జరిగిన వన్డే ప్రపంచకప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. అజేయమైన ఆటతీరుతో ఫైనల్ చేరి, కప్పుపై ఎన్నో కలలు పెట్టుకున్న రోహిత్‌సేన ఆ టోర్నీ తుదిపోరులో ఓడడం కోట్లాది భారతీయుల హృదయాలను కలచివేసింది. ఆ□యా చేతిలో పరాజయం మన ఆటగాళ్లను ఎంతో మనోవేదనకు గురిచేసింది. ఇది వారిలో మరింత కసిని పెంచింది. అవసరాలకనుగుణంగా వ్యూహాల్లో మార్పులు చేసుకొని ముందుకు సాగేలా చేసింది. గోడకు కొట్టిన బంతిలా ఎగసి, ఆ తరువాత ఏడు నెలల్లోనే జరిగిన ఈ పొట్టికప్పు విశ్వసమరంలో జట్టు అద్భుత ప్రదర్శన కనబరచింది. తమకు ఎదురే లేదనుకున్న ఆ□యన్లను, డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఓటమన్నదే లేకుండా వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చినా, ఏమరుపాటుకు అవకాశమివ్వలేదు. కలిసికట్టుగా కదం తొక్కి రెండో టైటిల్‌తో క్రికెట్‌లో నవచరిత్రను ఆవిష్కృతం చేసింది. సమర్థమైన నాయకుడిగా ముందుండి నడిపించిన రోహిత్ శర్మ జట్టు విజయంలో ఆటగాడిగానూ కీలకపాత్ర పోషించాడు. కొన్ని మ్యాచుల్లో భారీస్థాయిలో పరుగులు రాబట్టి గెలుపు బాట వేశాడు. ఈ విజయంతో భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ సరసన నిలిచిన రోహిత్, తన పదిహేడేళ్ల టీ20 కెరీర్‌ను అద్వితీయంగా ముగించాడు. ప్రపంచ క్రికెట్‌లో కింగ్‌గా నీరాజనాలందుకుంటున్న విరాట్ కోహ్లీ ఈ టోర్నీలో వరుస మ్యాచుల్లో విఫలమైనా, ఆఖరి ఆటలో అత్యుత్తమంగా రాణించాడు. ఫైనల్‌కు ముందు ఏడు మ్యాచుల్లో 75 పరుగులే చేసిన కోహ్లీ అసలైన సమరంలో 76 పరుగులు సాధించి తన విలువేంటో చాటిచెప్పాడు. తన చివరి పోరులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొని తన 14 ఏళ్ల టీ20 కెరీర్‌కు సగర్వంగా ముగింపు పలికాడు. ఘోర రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలతో బయటపడిన రిషబ్ పంత్, ఈ టోర్నమెంట్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. మునుపటి స్థాయిలో బ్యాటింగ్‌లో, కీపింగ్‌లో నైపుణ్యాన్ని చాటుకొన్నాడు. మన బౌలర్లను ప్రతిభ గురించి ఎంత చెప్పినా తక్కువే. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ముందుండి బౌలింగ్‌ను నడిపించాడు. అవసరమనుకున్న ప్రతిసారీ వికెట్ పడగొట్టి ప్రస్తుత తరంలో ప్రపంచంలోనే అత్యుత్తమ పేసర్‌గా తన పేరును సార్థకం చేసుకున్నాడు. యువ పేసర్ అర్షదీప్ సింగ్ 17 వికెట్లతో టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్ల వీరునిగా నిలిచాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ బంతితో మాయాజాలం చేశాడు. పేలవమైన ఫామ్‌తో ప్రపంచకప్‌నకు ముందు అనేక విమర్శలు ఎదుర్కొన్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన ఆటతోనే సమాధానమిచ్చాడు. హార్దిక్‌కు దీటుగా అక్షర్ పటేల్ బంతి, బ్యాటుతో విజృంభించిన తీరు ప్రశంసనీయం. ఇలా.. ప్రతి ఆటగాడు బాధ్యతాయుతంగా ఆడి జట్టును విశ్వవిజేతగా నిలిపారు. పదిహేడేళ్ల క్రితం వెస్టిండీస్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రాహుల్ ద్రవిడ్ కెప్టెన్సీలో భారత జట్టు తొలిరౌండ్లోనే వెనుదిరగడంతో నాడు అతను తలదించుకున్న పరిస్థితి. కానీ, ఇప్పుడు అదే విండీస్ గడ్డపై గురువు స్థానంలో జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టి తలెత్తుకున్న తీరు సర్వదా ప్రశంసనీయం. మూడేళ్లు జట్టు వెంటే ఉండి మార్గదర్శనం చేసిన తనకు ఇప్పుడు శిష్యులు ప్రపంచకప్‌ను అందించారు. ఎన్నడూ తన భావాలను బయటకు కనిపించనీయని ద్రవిడ్ కూడా చిన్నపిల్లాడిలా గంతులేస్తూ జట్టుతో కలిసి సంబరాలు చేసుకున్నాడు. జట్టు చీఫ్‌కోచ్ హోదాలో ఆఖరిరోజును చిరస్మరణీయం చేసుకున్నాడు.

విజేత భారత్‌కే గాకుండా అఫ్ఘానిస్తాన్, అమెరికా జట్లకు ఈ ప్రపంచకప్ ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది. ఆట ఆడటమే కష్టంగా ఉన్న తమ దేశంలో పాలకులను ఒప్పించి, ఎన్నో సవాళ్లను అధిగమించి, ఒక్కో మెట్టు ఎక్కుతూ విశ్వసమరంలో సెమీఫైనల్ దాకా చేరిన అఫ్ఘానిస్తాన్ ఆటగాళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఆతిథ్య జట్టు హోదాలో టోర్నీలో అడుగుపెట్టిన అమెరికా, అంచనాలకు మించిన ఆటతీరుతో సూపర్–8 దశకు చేరి పిట్టకొంచెం కూత ఘనం అన్న సామెతను గుర్తుచేసింది. అపజయమన్నదే లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ప్రదర్శననూ తక్కువ చేయలేం. మెగా టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరిన సఫారీ జట్టు కప్పుకోసం తుదికంటా పోరాడిన తీరు అమోఘం.

భారత్ సాధించిన ఈ అమోఘ విజయాన్ని ఆస్వాదిస్తూనే నవతరం ఆటగాళ్లు మున్ముందు ప్రతిష్ఠాత్మక సిరీస్‌లకు సన్నద్ధం కావాలి. రోహిత్, కోహ్లీ, జడేజాలాంటి గొప్ప ఆటగాళ్ల వారసత్వాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగాలి.

మరోమారు చూస్తాం 'స్మార్ట్ పాలన'!

విభజనానంతర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు రెండవ పర్యాయం బాధ్యతలు స్వీకరించిననాడు తనను కలిసిన అఖిల-భారత సర్వీస్ అధికారులతో జరిపిన క్లుప్త సమావేశంలో గత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనపై సున్నితంగా స్పందిస్తూ, తనదైన శైలిలో విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనిచేసిన కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సహా పలువురు నిబద్ధతకలవారి సమర్థతను, నిజాయితీని దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వ పాలన సాగిందని ఆయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రోజులనాటి ఆయన 'స్మార్ట్ (SMART) పాలన' (సింపుల్, మోరల్, అకౌంటబుల్, రెస్పాన్సివ్, ట్రాన్స్‌పరెంట్) గురించి తెలిసిన కొందరికి మాత్రమే ఆయన సద్విమర్శలు సులభంగా అర్థం అవుతాయి.


akbar

ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో రూపుదిద్దుకున్న ఓఎంఆర్ ఫార్మాట్ ఆధారిత 'శిక్షణ అవసరాల విశ్లేషణ' అనతికాలంలో, బృహత్తరమైన 'స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్' (ఎస్‌టిఐ)కు మార్గం సుగమం చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థను ఒక విశిష్టమైన 'కెపాసిటీ, కాపబిలిటీ బిల్డింగ్' అభివృద్ధి సంస్థగా మార్చి వేసింది.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్) సంస్థలో తొమ్మిది సంవత్సరాలు ఫ్యాకల్టీ సభ్యుడిగా, అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన నాకు, సరిగ్గా అదే తొమ్మిది సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడి 'స్మార్ట్ పాలన'ను, దాని పట్ల ఆయనకు ఉండే అసాధారణమైన ఆసక్తిని, విషయ సామర్థ్యాన్ని, నిబద్ధతను సమీపంగా పరిశీలించే అవకాశం కలిగింది. అప్పటి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ (డీజీ) పీవీఆర్‌కే ప్రసాద్, అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) ఊర్మిళా సుబ్బారావు, తదితర అధికారుల తోడ్పాటుతో, తనదైన దార్శనికతతో, అనాథగా ఉన్న ఐఓఏ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మిని□్)ను మాజీముఖ్యమంత్రి చెన్నారెడ్డి మరణానంతరం డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌గా పేరుమార్చి, ప్రపంచ 'మానవ అభివృద్ధి, శిక్షణా కేంద్రాల'లో అగ్రస్థానంలో నిలిపిన ఘనత చంద్రబాబునాయుడుదే!

ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థీకృత శిక్షణ, తద్వారా వారి పనితీరు, సామర్థ్యం పెంపుదలకు సంబంధించి జాతీయ శిక్షణా విధానం (నేషనల్ ట్రైనింగ్ పాలసీ–ఎన్‌టిపి) మార్గదర్శకాలకు అనుగుణంగా చంద్రబాబు నాయుడు విలువైన సమయాన్ని కేటాయించారు. ఒకసారి, నేను ఏడీజీ (అప్పటికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మిని□ే అది) ఊర్మిళా సుబ్బారావు, 1996 సంవత్సరాంతంలో, ఇన్‌స్టిట్యూట్ సందర్శనకు వచ్చిన 'ఓడీఏ' (డీఎఫ్ఐడీ) ప్రతినిధివర్గంతో సీఎం చంద్రబాబునాయుడిని కలిసినప్పుడు ఆయన ముఖ్యమైన ఒక విషయాన్ని ప్రస్తావించారు. 'ఐఓఏ'ను సుపరిపాలన కేంద్రంగా, తత్సంబంధమైన జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ విధానాలను గుర్తించే సంస్థగా అభివృద్ధి చేయడానికి నిధులు సమకూర్చమని అడిగారు. ప్రతినిధివర్గం సూచనప్రాయంగా అంగీకరించి, తక్షణ ప్రతిపాదనలు ఇవ్వమని కోరారు. ఊర్మిళాసుబ్బారావు ప్రారంభ ప్రతిపాదనను తయారు చేశారు. ఆ ప్రాథమిక ప్రతిపాదన, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలు, సలహాలతో మార్పులు చేర్పులు జరిగి 2001లో 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)' స్థాపనకు దారితీసింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ విశాలమైన ప్రాంగణంలో, డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (డీఎఫ్ఐడీ), ప్రపంచ బ్యాంక్ సంయుక్త ఆర్థిక సహకారంతో రూపుదిద్దుకున్న భవన సముదాయాన్ని నాటి బ్రిటన్ ప్రధానమంత్రి టోనీ బ్లేర్ ప్రారంభించి, క్యాంపస్ ఆవరణలో చాలా సమయం గడిపి, చంద్రబాబునాయుడుతో ఇన్‌స్టిట్యూట్ అతిథిగృహంలో కాసేపు దె□క్షిక సమావేశమయ్యారు.

సీఎం చంద్రబాబునాయుడుతో, నేను ఏడీజీ ఊర్మిళాసుబ్బారావు జరిపిన మరో సమావేశంలో ఏడీజీ సూచనను సూత్రప్రాయంగా ఆయన అంగీకరించారు. ఉన్నతోద్యోగుల నుంచి జూనియర్ అసిస్టెంట్ల దాకా ఉన్న సుమారు ఐదు లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులందరి 'శిక్షణ అవసరాల విశ్లేషణ (Training Needs Analysis)' కోసం ఓఎంఆర్ (ఆప్టికల్ మార్క్ రీడర్) షీట్ల ద్వారా విషయ సేకరణ జరిపి, జాతీయ శిక్షణా విధానానికి (NTP) అనుగుణంగా, '(టీఎఫ్ఏ) Training For All' (ప్రతి ఉద్యోగికీ శిక్షణ విధానాన్ని) అమలు చేయాలని నిర్ణయించారు.

అలా ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో రూపుదిద్దుకున్న ఓఎంఆర్ ఫార్మాట్ ఆధారిత 'శిక్షణ అవసరాల విశ్లేషణ' అనతికాలంలో, బృహత్తరమైన 'స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్' (ఎస్‌టిఐ)కు మార్గం సుగమం చేసింది. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌ను ఒక విశిష్టమైన 'కెపాసిటీ, కాపబిలిటీ బిల్డింగ్' అభివృద్ధి సంస్థగా మార్చివేసింది. ప్రతి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికి కనీసం 60 గంటల శిక్షణను అందించే సామర్థ్యాలను సమకూర్చే దిశగా, రాష్ట్ర ప్రభుత్వ మానవ వనరుల అవసరాలను తీర్చడానికీ, మానవ వనరులను అభివృద్ధి చేసే బాధ్యతను డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించారు.

ఇన్‌స్టిట్యూట్ శిక్షణ గదులు, వీడియో కాన్ఫరెన్స్ హాల్, మూడంతస్తుల బిల్డింగ్ కాంప్లెక్స్ విస్తరణ, ప్రపంచ స్థాయి ఆడిటోరియం, అతిథి గృహాలు, హాస్టల్ సదుపాయాలు, మైక్రోసాఫ్ట్ ఐటీ అకాడమీ లాంటి సౌకర్యాల కల్పన చేసి, సంస్థను 'స్టేట్ ఆఫ్ ఆర్ట్' స్థాయికి తెచ్చారు. అప్పటికీ, ఇప్పటికీ, బహుశా ఎప్పటికీ చంద్రబాబు నాయుడు, డీజీ పీవీఆర్‌కే ప్రసాద్, ఏడీజీ ఊర్మిళా సుబ్బారావుల ముద్ర ఆ సంస్థ మీద స్పష్టంగా కనిపిస్తుంది.

'స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్' ప్రారంభించిన తొలినాళ్లలో, దానిని శాస్త్రీయంగా అమలుపరచడానికి, 'శిక్షణా నైపుణ్యం, ఉన్నత స్థాయి శ్రేణి అర్హతలున్న ఒక ప్రధాన శిక్షకుని (మాస్టర్ ట్రెయినర్)' కోసం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ ప్రయత్నాలు చేసింది. అప్పట్లో, బ్రిటన్ 'థేమ్స్ వ్యాలీ' యూనివర్శిటీలో శిక్షణ పొంది, అలాంటి అర్హతలు కలిగివున్న వారు, భారతదేశం మొత్తంలో కేవలం 8 మంది మాస్టర్ ట్రెయినర్లు మాత్రమే ఉండేవారు. వారందరిలో, ఇండియన్ నావల్ స్టోర్స్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో సీనియర్ స్థాయి ఉద్యోగిగా, అప్పటిదాకా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక శిక్షణా సంస్థ 'ఐఎస్టీఎం'లో డిప్యుటేషన్ మీద పనిచేస్తున్న, 'టాప్ ర్యాంకర్ మాస్టర్ ట్రైనర్ ఎంపీ సేథి సేవలను ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఉపయోగించుకోవడానికి డీజీ పీవీఆర్‌కే ప్రసాద్ ప్రతిపాదనలను పంపించారు. ఆ ప్రతిపాదన సాఫల్యం కావడంలో జాప్యం కలిగితే, పీవీఆర్‌కే అభ్యర్థన మేరకు, నాటి రక్షణ మంత్రి మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌తో సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ఫోన్లో మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ స్థాయిలో ఆయన చేరిక, ఇన్‌స్టిట్యూట్ శిక్షణా సామర్థ్యతను ఆకాశమే హద్దుగా చేసింది.

ఉద్యోగుల శిక్షణను ప్రాధాన్యతా అంశంగా గుర్తించిన చంద్రబాబునాయుడు అది సఫలం కావడానికి, వివిధ శాఖాధిపతుల, సీనియర్ ఐఏఎస్ అధికారుల నిబద్ధతను కాంక్షిస్తూ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు, నేను, సేథి ఉమ్మడిగా డిజైన్ చేసినదే మూడురోజుల వర్క్‌షాప్ మాడ్యూల్ 'ఓరియంటేషన్ టు మేనేజ్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ (ఓఎంటీ)'. సీఎం చంద్రబాబునాయుడు, డీజీ పీవీఆర్‌కే ప్రసాద్ కనుసన్నులలో నిర్వహించిన 15–16 వర్క్‌షాపులకు సుమారు 200 ఐఏఎస్, ఐపీఎస్, నాన్–కాడర్ అధికారులు హాజరయ్యారు.

హార్వార్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన మేనేజ్‌మెంట్ నిపుణుడు, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత కొయంబత్తూర్ కృష్ణారావు ప్రహ్లద్ (సీకే ప్రహ్లద్) అప్పట్లో డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించినప్పుడు చంద్రబాబునాయుడు చేసిన ఐటీ రంగ అభివృద్ధిని, ప్రోత్సాహకాలను, పరిపాలనలో టెక్నాలజీ, ఇ–గవర్నెన్స్ వినియోగాన్ని, ప్రజాసేవలను మెరుగుపర్చడాన్ని, ఆర్థిక అభివృద్ధితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడాన్ని అభినందిస్తూ, ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కూడా చంద్రబాబునాయుడు, అదే విధానాన్ని మరింత వేగవంతం చేస్తూ, 25 సంవత్సరాల క్రితం ఆయన చొరవతో రూపుదిద్దుకున్న సంస్కరణలను వర్తమాన అవసరాలకు అనుగుణంగా పునఃపరిశీలించి అమలుచేస్తే మంచిదేమో!

■ వనం జ్వాలానరసింహారావు

రాజకీయాల్లో అందరివాడు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ తనకంటూ ప్రత్యేకముద్ర వేసుకున్న నాయకుడు ధర్మపురి శ్రీనివాస్. అనారోగ్య కారణాలకు గుండెపోటు తోడై 76 ఏళ్ల వయస్సులోనే ప్రాణాలు కోల్పోయారు. ఐదు దశాబ్దాలుగా తెలుగు నేలపైన వివిధ హోదాల్లో జన బాహుళ్యానికి ఆయన సేవలందించారు. సమకాలీన రాజకీయాలకు ప్రతీకగా, నవయువ నాయకులకు స్ఫూర్తిగా నిలచిన శ్రీనివాస్‌ను రాజకీయ శ్రేణులు ఆప్యాయంగా 'శీనన్న' అని పిలుచుకుంటారు.

అది 1989 నవంబర్ నెల. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న వేళ. ధర్మపురి శ్రీనివాస్ నిజామాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా జోరైన ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. తొలిసారి నేను ఆయనను ఎన్నికల ప్రచారంలో కలుసుకుని పరిచయం చేసుకున్నాను. శ్రీనివాస్ నన్ను ఎగాదిగా చూసి 'ఏమిటి చూస్తే చిన్న పిల్లాడిలా ఉన్నావ్. (నాకు అప్పుడు 18 ఏళ్లు) పెద్ద పత్రిక (ఈనాడు) విలేఖరినని చెబుతున్నావు' అనేశారు. నేను విద్యార్థి దశలోనే జర్నలిజంలోకి అడుగుపెట్టడంతో ధర్మపురి శ్రీనివాస్‌ను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పనిచేసినప్పటి నుంచి నిశితంగా పరిశీలించే అవకాశం వచ్చింది. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ముగ్గురు ముఖ్యమంత్రులు — మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డిల కేబినెట్లలో శ్రీనివాస్ మంత్రిగా కొనసాగారు.



ధర్మాగ్రహాన్ని ప్రదర్శించే డీఎస్ కుల మతాలకు అతీతంగా నాయకులెందరినో ప్రోత్సహించారు. డీఎస్‌ను నమ్ముకున్న నేతలు ఎందరో తమ జీవితాలను నల్లేరుపై బండి నడకలా సాఫీగా మార్చుకున్నారు. వివాదాలకు దూరంగా, ప్రజాసేవయే పరమావధిగా ఆయన ముందుకు వెళ్లారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీ నాయకులు సైతం మెచ్చేలా తనను తాను నిరూపించుకున్నారు.

అనూహ్యంగా తన శిష్యుడైన సతీష్ పవార్ పార్టీ మారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడంతో 1994 అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ ఓడిపోయారు. 1994–99 మధ్య తనకు తానుగా రూపాంతరం చెంది, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ విజయం సాధించారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక ఆయన జీవితాన్ని సమూలంగా మార్చివేసింది. 42 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి శ్రీనివాస్ ప్రత్యేక తెలంగాణ కోసం గళం వినిపించారు. ప్రజల్లో ప్రత్యేక రాష్ట్రం పట్ల ఆసక్తి, ఆశలు రేపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బలపడుతున్న వేళ కాంగ్రెస్ అధిష్ఠానం అనూహ్యంగా తెలంగాణకు చెందిన వెనుకబడిన తరగతుల నేత ధర్మపురి శ్రీనివాస్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షునిగా నియమించింది. 'ప్రజా ప్రస్థానం' పేరిట వందల కిలోమీటర్ల పాదయాత్రతో నాటి కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, పీసీసీ చీఫ్‌గా ధర్మపురి శ్రీనివాస్ ద్వయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించింది. అప్పటివరకు శీనన్నగా చిరపరిచితుడైన శ్రీనివాస్‌ను పార్టీ శ్రేణులు, మీడియా కలిసి 'వైఎస్' తరహాలో 'డీఎస్'గా మార్చివేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేతలుగా వైఎస్, డీఎస్ చరిత్రలో నిలిచిపోయారు.

2004 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్‌తోపాటు డీఎస్ కూడా ముఖ్యమంత్రి పదవిని అధిరోహించాలని ఆయన అభిమానులు అభిలాషించారు. కానీ సహజంగానే కాంగ్రెస్ అధిష్ఠానం వైఎస్ వైపే మొగ్గు చూపింది. అనూహ్యంగా 2009 సార్వత్రిక ఎన్నికల్లో డీఎస్ ఓటమిపాలు కావడంతో ఆయన సీఎం పదవి ఆశలకు తాత్కాలికంగా తెరపడినట్లు అయింది. రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో, తర్వాత 2010లో ఉప ఎన్నిక రావడంతో మళ్లీ ముఖ్యమంత్రి పదవిపై డీఎస్ అనుచరులకు ఆశలు చిగురించాయి. ప్రత్యేక తెలంగాణ వాదం కోసం నిజామాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికకు దారి తీసిన ఎండల లక్ష్మీనారాయణ బీజేపీ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచారు. కాబోయే ముఖ్యమంత్రిగా అవకాశమున్న డీఎస్ కంటే ప్రజలు తెలంగాణ వాదానికి పట్టం కట్టారు. దాంతో డీఎస్ ప్రత్యేక తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ పార్టీ టీఆరఎస్ (ప్రస్తుత బీఆరఎస్), కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదిరేలా కృషి చేసిన డీఎస్ మాటకు కాంగ్రెస్ అధిష్ఠానం సానుకూలంగానే స్పందించింది. హైదరాబాద్‌తో కూడిన సంపూర్ణ తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంతో డీఎస్ ఎమ్మెల్సీగా ఎన్నికై తెలంగాణ శాసనమండలిలో తొలి ప్రతిపక్ష నాయకునిగా సేవలందించారు. ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికకు కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలు సహకరించకపోవడంతో డీఎస్ నాటి ముఖ్యమంత్రి, బీఆరఎస్ అధినేత కేసీఆర్ ఆహ్వానం మేరకు పార్టీ మారిపోయారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాన్ని మానుకుని విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌లో ఉన్న ధర్మపురి శ్రీనివాస్ క్రియాశీలక రాజకీయాల్లో చేరిపోయారు. తన సమకాలికులు, సీనియర్‌లతో పోల్చుకుంటే ధర్మపురి శ్రీనివాస్ తన రాజకీయ జీవితంలో అత్యంత ప్రతిభతో 'ఆక్సిలరీ ప్రమోషన్లు' పొందారనే చెప్పాలి. మాతృభాష తెలుగుతోపాటు ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో అనర్గళంగా మాట్లాడే శ్రీనివాస్ సమర్థుడైన నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. తనలో ఉన్న బ్యూరోక్రాటిక్, పొలిటికల్ రెండు కోణాలతో సక్సెస్‌ఫుల్ రాజకీయ నేతగా గుర్తింపు పొందారు.

ధర్మాగ్రహాన్ని ప్రదర్శించే డీఎస్ కుల మతాలకు అతీతంగా నాయకులెందరినో ప్రోత్సహించారు. డీఎస్‌ను నమ్ముకున్న నేతలు ఎందరో తమ జీవితాలను నల్లేరుపై బండి నడకలా సాఫీగా మార్చుకున్నారు. నక్సలిజం ప్రాబల్యం ఉధృతంగా ఉన్న ఆ రోజుల్లో కేబినెట్ మంత్రిగా పనిచేసిన శ్రీనివాస్ తన సహచరులు ఎందరో నక్సలైట్లకు సాఫ్ట్ టార్గెట్లుగా మారినా, తాను అజాతశత్రువుగా ఉండిపోయారు. వివాదాలకు దూరంగా, ప్రజాసేవయే పరమావధిగా ఆయన ముందుకు వెళ్లారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీ నాయకులు సైతం మెచ్చేలా తనను తాను నిరూపించుకున్నారు. తన అనుచరులను సర్పంచ్, మున్సిపల్ కౌన్సిలర్ పదవుల నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించుకున్నారు. డీఎస్‌లో ఉన్న మరో గొప్పతనం — ఆయన ఎంతటి కరడుగట్టిన తెలంగాణవాదో అంతటి ప్రాంతీయ విద్వేషాలు లేని విశాల హృదయుడుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయన్ను మనస్ఫూర్తిగా అభిమానిస్తారు. వెనుకబడిన తరగతుల నాయకుడిగా పేరున్న ఆయన అన్ని వర్గాలను సమదృష్టితోనే చూశారు, ప్రోత్సహించారు. డీఎస్ అనుచర గణంలో కుల మత ప్రాంతాలకు అతీతంగా ఎంతో మంది రాజకీయంగా ఎదిగారు.

అభివృద్ధి పనుల్లోనే కాకుండా పార్టీ పటిష్ఠత విషయంలోనూ డీఎస్ ఆలోచనాధోరణి చిరస్మరణీయంగా మిగిలిపోతుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో డీఎస్ భూమికను లోతుగా విశ్లేషించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక సందర్భంలో డీఎస్ గురించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ సాధనాలు అందుబాటులో ఉంటే డీఎస్‌ను మించిన కమ్యూనికేటర్, పొలిటికల్ లీడర్ దేశంలోనే లేడని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అగ్రనేత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ డీఎస్‌పై ఉన్న అభిమానంతో ఆయన నియోజకవర్గం నిజామాబాద్‌లో విస్తృతంగా పర్యటించారు. డీఎస్ రాజకీయ వారసత్వాన్ని తమ తమ సైద్ధాంతికదారుల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు ఆయన తనయులు ఇద్దరూ బీజేపీ ఎంపీ అరవింద్ ధర్మపురి, కాంగ్రెస్ మాజీ మేయర్ సంజయ్ ధర్మపురి కృషి చేస్తున్నారు. తెలుగు రాజకీయాల్లో అందరివాడుగా ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) ఎప్పటికీ నిలచిపోతారు.

○ నరేందర్ పుల్లూరు
ఆంగ్ల పాత్రికేయుడు, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత

ఈవీఎంలు పారదర్శకమే!

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 'కూటమి' భారీ మెజారిటీతో విజయం సాధించింది. గతంలో 151 స్థానాలు పొందిన వైసీపీ అవమానకర రీతిలో కేవలం 11 స్థానాలలో గెలిచింది. 2019లో తెలుగుదేశం పార్టీకి 23 స్థానాలు వస్తే దేవుని స్క్రిప్ట్ అంటూ ఎద్దేవా చేశారు. అప్పుడు ఈవీఎంలు బాగా పని చేశాయి. ఇప్పుడేమో హ్యాక్ అంటున్నారు. ఆడలేక మద్దెల ఓడు అంటే ఇదే. ఈవీఎంల హ్యాక్ అసాధ్యం అని ఐఐటి డైరెక్టర్ రజత్ స్పష్టం చేశారు. ఒకవేళ హ్యాక్ చేసేటట్లయితే వైసీపీలో 'ఘనపాఠీలు' ఉన్నారు. వాళ్ళు చేయవచ్చు కదా! ఓటమిని హుందాగా ఒప్పుకుంటే బాగుంటుంది. అలా కాకుండా హ్యాక్ జరిగిందని చెప్పడం మూర్ఖత్వం. వైసీపీకి ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వలేదంటే ప్రజా ఆగ్రహం ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. బూతులు మాట్లాడటం, అగౌరవంగా సభ్యులను కించపరచడం, జగన్ ముసిముసి నవ్వులు నవ్వడం తెలిసిందే. అందుకే దేవుడు తగిన శాస్తి చేశాడు.

ప్రజాస్వామ్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రతిపక్ష నాయకుడి సలహాలు స్వీకరించాలి. అవేవీ జగన్ పాటించలేదు. ఫలితమే పోలవరం నాశనం. దానికి తోడు రాజధాని లేని రాష్ట్రాన్ని చేసి అపహాస్యం పాలయ్యారు. మూడు రాజధానులు అంటూ ఊదరగొట్టారు. కేవలం కక్ష సాధింపు ధోరణితోనే ఇదంతా సాగింది. అమరావతిని జగన్ మెరుగులు దిద్ది ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఈపాటికి అందుబాటులోకి వచ్చి ఉండేది. వారి ఓటమికి ఇది కూడా ఒక కారణం. కేవలం బటన్ నొక్కుడుతో పరిపాలన సాగించారు. అభివృద్ధి అనే మాటే లేదు. కేవలం ఐదువేల రూపాయలతో వాలంటీర్లకు ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. మెగా డీఎస్సీ లేదు. ధరలు పెరుగుదల, ఇసుక రేట్లు ఆకాశాన్ని తాకడం వంటివి ఓటమికి కారణాలు. ఇప్పుడు మూడు వేలు పెన్షన్ తీసుకున్న అవ్వాతాతల ఓట్లు ఏమైపోయాయి అని గగ్గోలు పెడుతున్నారు. అవగాహన లేని విధానాలు తీసుకువచ్చి అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి, అహంకారపూరితంగా వ్యవహరించారు. తప్పులు తెలుసుకోక ఓటమిని చవిచూసే సరికి ఈవీఎంలపై పడ్డారు. బ్యాలెట్ పాత పద్ధతి. రిగ్గింగ్‌కు అవకాశాలు ఎక్కువ. ఈవీఎంలను పరీక్ష చేశాకే ఉపయోగిస్తారు. ఎవరైతే హ్యాక్ అంటున్నారో వారే ప్రత్యక్షంగా హ్యాక్ ఎలా చేస్తారో చేసి చూపిస్తే బాగుంటుంది. అందుకు మాత్రం ముందుకురారు. ఇప్పటికైనా ఓటమి విషయం మరచిపోయి ప్రభుత్వానికి సహకరించాలి. గెలిచిన వైసీపీ సభ్యులు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి. రాజధాని విషయంలో తప్పు జరిగిందని ఒప్పుకుని, మద్దతు ఇచ్చి, ప్రజల మనసులు గెలవాలి. అంతే కాని ఈవీఎంల హ్యాక్ జరిగింది అని పదే పదే మాట్లాడకండి. అవి పారదర్శకమే.

— కనుమ ఎల్లారెడ్డి, తాడిపత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ముకుళిత భారత్, వికసిత ఇండియా!

2024 ఎన్నికలు ఇండియా, భారత్‌ల మధ్య జరిగినట్లయింది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని మొత్తంగా రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని ముందుకు తెస్తూ 'ఇండియా' కూటమి ఎన్నికలకు వెళ్లింది. వికసిత భారత్, సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ లక్ష్యాలున్నా వాటిని పక్కకు నెట్టివేస్తూ మైనారిటీలను బూచిగా చూపించి, మెజారిటీలను ఆకర్షించే ప్రయత్నం చేసింది 'భారత్'. అది ఆశించిన ఫలితాలనే కాదు, అవసరమైన ఫలితాలనైనా సాధించలేకపోయింది. 'ఇండియా' కూడా అవసరమైన ఫలితాలను సాధించలేకపోయినా, నిలువరించగలిగే ఫలితాలను సాధించగలిగింది.

భారత్, ఇండియాల వెనుక రెండు ప్రతీకాత్మక భావజాలాలు ఈ ఎన్నికల్లో పనిచేశాయి. గెలుపు ఓటములు ఆ భావజాలాలవే. పాలకపక్షానికి భారత్ అనే మాటమీద అంత మమకారం ఎందుకు? అది ఎప్పుడు బయటపడింది? ఎందుకు ఆమోదం పొందలేకపోతోంది? మరోమారు సమాధానం వెతుక్కోవలసిన ప్రశ్నలివి.

ఇండియా కూటమి జూలై 2023లో ఏర్పడితే అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఇండియా అనడం మానేసి భారత్ అని పిలవాలని మొదట పిలుపునిచ్చారు. తరువాత రెండు రోజులకు ఢిల్లీలో జరిగిన జి–20 సమ్మిట్ సందర్భంగా వేసిన ఆహ్వానపత్రంలో మొదటిసారి 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించడమే కాదు, ఇండియాకు బదులు భారత్ అని రాసి ఉన్న నామఫలకాన్ని ముందుంచుకుని ప్రధాని ప్రసంగించి ఆశ్చర్యపరిచారు. ఎందుకు అనే ప్రశ్నకు సమాధానంగా విదేశీయులు పెట్టిన ఇండియా కన్నా దేశీయమైన భారత్ సముచితం అన్నారు. విదేశీయులు అంటే బ్రిటిష్ వారనే అర్థం తెస్తూ మనం వలస-భావనలు వదులుకోవలసిన (decolonize) అవసరం ఉందన్నారు.

ఇండియా అనే మాటను ఆంగ్లేయులు విరివిగా వాడిన మాట నిజమే కానీ మొదట వాడింది పారశీకులు, గ్రీకులూ. సింధును పారశీకులు హిందు అని ఉచ్చరిస్తే, గ్రీకులు ఇండస్ అన్నారు. గ్రీకులు ఇండస్‌కు తూర్పున ఉన్నదాన్ని ఇండియా అని క్రీస్తు పూర్వం నుంచీ అంటుంటే, సింధుకు తూర్పున ఉన్నది హిందూస్థాన్ అని మధ్యయుగాల నుంచి వాడుకలోకి వచ్చింది. హిందు అనే మాటకు మతపరమైన అర్థ వ్యుత్పత్తి మన ప్రాచీన గ్రంథాలలో లేదు. ఆర్యులకంటే ముందు నుంచీ హిందూ పదం ఉన్నదనీ, సంస్కృతీకరణలో అది సింధు అయిందనే వితండవాదం చేశాడు సావర్కర్. దీనికి ఏ ఆధారాలూ లేవు.

భారత్ అనే మాట భరతుడు అనే రాజు పేరిట వచ్చిందంటారని అందరికీ తెలుసు. ఎవరీ భరతుడు? శకుంతల, దుష్యంతుల కుమారుడితోపాటు అనేకమంది భరతులున్నారు. ఒకానొక రిషభుడి కుమారుడు భరతుడనీ, అతని పేరిటే భరతవర్షం వచ్చిందంటుంది విష్ణుపురాణం. వీళ్లెవరూ చారిత్రక వ్యక్తులు కాదు. ఇవి చిన్నపిల్లలకు చెప్పటానికి సరిపోయే కథలు. కాగా, అసలు సంగతి అది కాదు. తొలినాటి ఆర్యగణాల్లో పంచగణాలుగా ప్రసిద్ధిచెందిన వాటిలో పురులు ఒకటి. దీని శాఖల్లో ఒకటి భరతులు. భరత తెగకు చెందింది కురు వంశం. ఈ వంశానికి చెందిన దాయాదులు కౌరవ పాండవులు. వాళ్ల కథే భారతం.

ఇది అట్లా ఉంచితే, భరత వర్షం మీద పరిశోధన చేసిన జెఎన్‌యూ ప్రొఫెసర్ బిడి చటోపాధ్యాయ ఇండియా, భరతవర్షం వంటి మాటలకు చరిత్ర పొడవునా ఒకే భౌగోళిక స్వరూపం లేదంటారు. భరతవర్షం 'జన' అనే చిన్న పరిపాలనా భాగంగా మొదలై కొంచెం పెద్దదైన జనపదంగా, ఆ తరువాత దిశ్‌గా విస్తరించిందంటారు. ఈ దశలో అది ఉత్తరాపథంలో కొంత ప్రాంతానికి మాత్రమే పరిమితమైన భూభాగం అని అన్నారు. ఇందులో దక్షిణం ఎంతమాత్రమూ భాగం కాదు. ఏ పురాణం ఎప్పుడు క్రోడీకరింపబడిందో చెప్పడం కష్టం కానీ స్థూలంగా క్రీ.శ. 5, 6 శతాబ్దాల్లో క్రోడీకరింపబడిన విష్ణుపురాణం భరతవర్ష వర్ణన చేస్తూ వసుంధర (ప్రపంచం)లో ఉన్న ఏడుభాగాల్లో జంబూద్వీపం (భారత ఉపఖండం) ఒకటనీ, అందులో ఉన్న తొమ్మిది విభాగాల్లో భరతవర్షం ఒకటనీ అంటూ అది సముద్రానికి ఉత్తరాన, హిమాలయాలకు దక్షిణాన ఉన్నది అని చెప్పింది. అప్పటికే చంద్రగుప్తమౌర్యుడూ, సముద్రగుప్తుడూ దేశంలో అత్యధికభాగాన్ని జయించి పాలించారు కాబట్టి విష్ణుపురాణానికి ఈ అవగాహన రావడంలో ఆశ్చర్యం లేదు. అయితే భౌగోళిక అవగాహన వేరు భావనాత్మక అవగాహన వేరు. ఒక వ్యక్తి తనను కోసల రాజ్య పౌరుణ్ణనో, మగధ రాజ్య నివాసిననో చెప్పుకున్నాడు కానీ, ఏ దశలోనూ తను భరతఖండానికి చెందినవాణ్ణని చెప్పుకున్న ఆధారాల్లేవంటారు ఆచార్య చటోపాధ్యాయ.

విదేశీయులనీ, ఇతరులనీ దురాక్రమణదారులనీ పేర్లు పెట్టబడినవారు ప్రవేశించక మునుపే భరత ఖండం అనే భౌగోళిక స్వరూపం ఉందని చెప్పడం 'భారత్' లక్ష్యం. వారిని మినహాయించి లేక ద్వితీయశ్రేణి పౌరులుగా దేశాన్ని రూపొందించాలనుకున్నపుడు వారు లేనప్పటి పేరే ఆదర్శమౌతుంది.

భారత్ అనడం వెనుక ఉన్న భావనలో ఏమి ఉంది, ఎవరు లేరు అనేవి కీలక ప్రశ్నలు. వీటికి సమాధానాలు 2020లో యుజిసి రూపొందించిన Learning Outcomes Based Curriculum Frameworkలో భాగంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు నిర్దేశించి సిలబస్‌లో ప్రవేశపెట్టిన Idea of Bharath (భారత్ అనే భావన) అనే పేపర్‌లో దొరుకుతాయి. ఇప్పుడిది జాతీయ విద్యావిధానం 2020లో భాగం. ఇది మొత్తం బీఏ చరిత్రకు పరిచయాత్మక అంశంగా మొదటి పేపర్‌గా నిర్ణయించబడింది. దీని సిలబస్‌లో భరత వర్షం, స్థల కాల భావనలు, వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, జైన బౌద్ధ వాఙ్మయం, లిపి పరిణామం, జ్ఞాన సంప్రదాయాలు, శౌర్యం (Indian valour), విద్యావిధానం, నైతికత, సామాజిక విలువలు, వసుధైక కుటుంబకం, శాస్త్రసాంకేతిక అభివృద్ధి, ఆయుర్వేదం, ప్రకృతివైద్యం, ఆర్థికభావనలు– భూమి, పరిశ్రమలు, వ్యాపారం, సముద్ర వాణిజ్యం మొదలైన అంశాలున్నాయి. ఇవన్నీ ప్రాచీన భారతదేశానికి సంబంధించినవే. ఇవి తప్పక అధ్యయనం చెయ్యవలసిన అంశాలనడంలో సందేహం లేదు. అయితే ఇది మాత్రమే భారత్ భావన ఎట్లా అవుతుందీ? దీనిలోకి మధ్యయుగాలనాటి అపారమైన పర్షియన్ సాహిత్యం, మదర్సాలు, యునానీ వైద్యం, యుద్ధతంత్రం, కొనసాగిన శాస్త్రసాంకేతిక అభివృద్ధి, అన్నిటినీ మించి భక్తి ఉద్యమంలోని సంస్కరణ భావాలు, సూఫీ తత్వం, ఉర్దూ భాష, వెల్లివిరిసిన దక్షిణ భారత, ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలు, ఇక ఆధునిక యుగానికొస్తే పాశ్చాత్య విద్య, సాంఘిక మత సంస్కరణోద్యమాలు, జాతీయభావ చైతన్యం, ప్రజాస్వామిక లౌకిక భావనలూ ఇవన్నీ కలిస్తే కానీ భారత్ భావన ఏర్పడదు కదా! 1947 దాకా జరిగిన పరిణామాల సారాంశంతో వైవిధ్యాన్ని భారతదేశ ఆత్మగా ప్రతిష్ఠిస్తూ రూపొందించాల్సిన భారత్ భావన ఈ పేపర్‌లో కేవలం హిందు భావనగా మిగిలింది.

ఇండియాను తొలగించి భారత్‌ను వెలిగించడం వెనుక ఉద్దేశ్యం ఇదే కావొచ్చు. భారత్ అంటే తొలినాళ్ల దేశమేననే సంకేతమివ్వడం కావొచ్చు. తరువాత ప్రవేశించిన జాతులు, మతాలు భారత్‌లో భాగం కాదని చెప్పడం కావొచ్చు. అది ఒక అధికసంఖ్యాకవాద వ్యక్తీకరణ కావొచ్చు. లేక భారతీయులందరూ హిందువులేనని చెప్పడం కావొచ్చు. దేశమంటే మనుషులు కాదు, మట్టి మాత్రమే అనడం కావొచ్చు.


భారత్ భావన ఇంతవరకే పరిమితం కాలేదు. అధికరణాల్ని అధిగమించి కశ్మీర్ సరస్సులో వికసించగల కమలం అయింది. మైనారిటీలుగా హిందువులు ఇతర దేశాల్లో తింటున్న దెబ్బలకు సీఏఏతో దెబ్బకు దెబ్బ తీయగల వస్తాద్‌ను అంది. అర్థై



దేశాలకు పైగా కోవిడ్ టీకాను అందించిన ఆధునిక ధన్వంతరిగా మారింది. చంద్రుడిపై అంతరిక్షనౌకను దింపగల వ్యోమ అగ్రగామి. దేశ ఆర్థికవ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్ల సంపదను దాటించగల బిగ్ బుల్. ఒకవైపు మనుస్మృతిని పాటిస్తూనే ఇతర మతాలకు మాత్రం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురాగల న్యాయసింహం. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోగల మహాబలి. విశ్వగురు.

ఈ మొత్తం భావజాలాన్ని ఎన్నికల ఫలితాలు ఒక్క కుదుపుకు లోనుచేశాయి. ఎన్నికల్లో సాధారణ మెజారిటీ సాధించలేకపోయినా ఎన్డీఏ కూటమిలో బీజేపీ భాగస్వామ్యం 82 శాతం ఉంది. అనేక ప్రయోజనాలు ఆశించి కూటమిలో ఉన్న తెలుగుదేశం, జనతాదళ్‌లు బీజేపీ మౌలిక భావజాల వ్యాప్తిని అరికట్టగలవా, అసలా ఉద్దేశ్యం వాటికి ఉన్నదా? వాటికీ బీజేపీకి మధ్య సాగే ఇచ్చిపుచ్చుకునే బంతులాటలో అవి రాజ్యాంగ స్ఫూర్తిని జారవిడుస్తాయేమోనని అనుమానం. ఎందుకంటే ఈ సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో ఇండియాను తొలగించి భారత్ అని రాయనున్నట్టు గతంలోనే ప్రకటించారు. దేశానికి పాఠ్యపుస్తకం రాజ్యాంగం కదా! అందు నుంచి తొలగించే అవకాశం ఇప్పుడు లేకపోవచ్చు కానీ, ఈ ప్రతీకాత్మక అడుగును ఇండియా ఎదుర్కొనవలసి ఉంటుంది. ఈ దేశం గర్భస్థ పిండంగా ఉన్నప్పటి పేరు భారత్. సర్వాంగాలూ సంతరించుకుని పూర్ణశిశువుగా జననం పొందినపుడు ప్రామాణిక గ్రంథంలో 'ఇండియా దట్ ఈజ్ భారత్' అనే పేరును నమోదు చేశారు. అది ఇండెలిబుల్ ఇంక్‌తో రాయబడింది. దాన్ని చెరిపితే దేశం చెదిరిపోతుంది.

• కొప్పర్తి వెంకటరమణమూర్తి





ఊరూవాడ పండుగ వాతావరణం కనిపించింది. ముదుసలుల మోముల్లో రెట్టింపు ఆనందం నిండింది. దివ్యాంగుల కళ్లలో ఆనందబాష్పాలు రాలాయి. రెండు జిల్లాల్లో సోమవారం ఉదయం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సంబరాలను తలపించింది. బకాయిలు సహా పెంచిన పెన్షన్ రూ.7 వేలను టీడీపీ నాయకులు అట్టహాసంగా లబ్ధిదారులకు అందజేశారు. వలంటీర్ల ప్రమేయం లేకుండా సచివాలయ ఉద్యోగుల సమక్షంలో, టీడీపీ కూటమి ఎమ్మెల్యేల సహకారంతో ప్రతి ఇంటికీ వెళ్లి అనుకున్న సమయానికి పెన్షన్ ఇచ్చారు. రెట్టింపు పెన్షన్ అందుకున్న ఆనందంతో చాలాచోట్ల చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్రమోదీ చిత్రపటాలకు పెన్షనర్లు క్షీరాభిషేకం చేశారు.

పండుగలా..

పెన్షన్ పంపిణీ

జిల్లావ్యాప్తంగా సంబరాలను తలపించిన పింఛన్ల పంపిణీ

- తొలిరోజు 94.81 శాతం పూర్తి
- రెట్టింపు పింఛన్ అందుకున్న వృద్ధుల మోముల్లో ఆనందం
- ఆనందంతో కన్నీటిపర్యంతమైన దివ్యాంగులు
- సచివాలయ ఉద్యోగులతోనే ఇంటింటికీ పంపిణీ
- వెంట వెళ్లి సహకరించిన టీడీపీ నాయకులు

పంపిణీలో పాల్గొన్న కూటమి ఎమ్మెల్యేలు

వాడవాడలా వేడుకలు.. క్షీరాభిషేకాలు



గుడ్లవల్లేరులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు





పింఛన్లు అందుకున్న ఆనందం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీ ప్రారంభమైంది. తొలిరోజు 94.81 శాతం పూర్తయింది. వలంటీర్లు లేకపోయినా సచివాలయ ఉద్యోగులే పెన్షన్ల పంపిణీని విజయవంతం చేశారు. నూతన ప్రభుత్వ తొలి ప్రతిష్ఠాత్మక కార్యక్రమం కాబట్టి దిగ్విజయంగా పూర్తిచేయాలని కలెక్టర్ సృజన.. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావుకు నిర్దేశించారు. దీంతో ముందస్తు ప్రణాళికతో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించారు. జగ్గయ్యపేట, వీరులపాడు, చందర్లపాడు మండలాలకు చెందిన పెన్షనర్లలో ఎక్కువమంది హైదరాబాద్‌లో ఉపాధి పనులకు వెళ్లడంతో పించన్ అందించలేకపోయారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం నాటికి నూరుశాతం పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,35,477 మంది పెన్షనర్లకు ప్రభుత్వం రూ.160.53 కోట్లు కేటాయించింది. జూలైలో పెంచిన రూ.1,000తో కలిపి రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించిన బకాయిలు రూ.3 వేలు అదనంగా కలిపి మొత్తం రూ.7 వేలు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, చేనేత కార్మికులు ఈ పెన్షన్ అందుకున్నారు. దివ్యాంగులు రూ.6 వేలు పెన్షన్ అందుకున్నారు. మంచాన పడినవారు, వీల్‌చైర్లలో ఉంటున్నవారు రూ.5 వేల నుంచి రూ.15 వేల మేర పెన్షన్‌ను అందుకున్నారు. అవయవాల మార్పిడి జరిగినవారు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు రూ.5 వేల నుంచి రూ.10 వేల పెన్షన్ తీసుకున్నారు.



నగరంలో దివ్యాంగుడికి పెన్షన్ అందజేత

ఆనందంగా ప్రతి నియోజకవర్గ పరిధిలోని మండలాలు, గ్రామాలు, వార్డుల్లో పెన్షన్ల పంపిణీని పండుగలా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఉదయం 5 గంటలకు తమతమ డివిజన్లు, వార్డుల్లోని వీధుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సచివాలయ ఉద్యోగులను తమ వెంటపెట్టుకుని ఇంటింటికీ తిరిగి పెన్షన్లు అందజేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, తిరువూరు పట్టణంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జి.కొండూరు మండలంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్‌లో ఎమ్మెల్యే సుజనాచౌదరి, సెంట్రల్ నియోజకవర్గం 57వ డివిజన్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందిగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పింఛన్లు పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీలో కలెక్టర్ సృజన

పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ సృజన కూడా పాల్గొన్నారు. మైలవరం, విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో పాల్గొన్న ఆమె.. జక్కంపూడి కాలనీ, ఫకీరుగూడెం, గిరిపురం ప్రాంతాల్లోని లబ్ధిదారులకు తన చేతులమీదుగా పెన్షన్లు ఇచ్చారు.



గొల్లపూడిలో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత, కలెక్టర్ సృజన

జై జవాన్



లడక్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన జవాన్ సాదరబోయిన నాగరాజు పార్థివదేహం సోమవారం రాత్రి స్వస్థలమైన పెడన రూరల్ మండలం చేవేంద్రకు చేరుకుంది. ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి, అక్కడి నుంచి వ్యాన్‌లో చేవేంద్రకు తీసుకొచ్చారు. స్థానిక గ్రామాల ప్రజలు, కమాండర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్మీ మాజీ అధికారులు అధిక సంఖ్యలో తరలిరాగా, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు. 6లో..

నందిగామ మున్సిపాలిటీలో టీడీపీదే పైచేయి

గత ఎన్నికల్లో వైసీపీపరమైన మున్సిపాలిటీ పీఠం

- ప్రస్తుతం వైసీపీకి 9, టీడీపీ కూటమికి 9 మంది బలం
- సార్వత్రిక ఎన్నికల గెలుపుతో కూటమికి ఎమ్మెల్యే, ఎంపీ మద్దతు
- ఇప్పటికే సునాయాసంగా చేజిక్కించుకునే అవకాశం
- ఉప ఎన్నికలు జరగాల్సినవి రెండు వార్డులు
- ఆ తర్వాత పాగా వేసేందుకు టీడీపీ సన్నాహాలు



నందిగామ : సార్వత్రిక ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి మంచి జోష్ మీదున్న టీడీపీ తన దృష్టిని నందిగామ మున్సిపాలిటీపై పెట్టింది. రాష్ట్రంలో తిరుగులేని విజయం సాధించిన పార్టీ అలవోకగా ఈ మున్సిపాలిటీని చేజిక్కించుకునేందుకు చూస్తోంది. ఇందుకు బలమైన కారణాలే ఉన్నాయి.

మెజారిటీ టీడీపీవైపే.. 20 వార్డులు ఉన్న నందిగామ మున్సిపాలిటీని గత ఎన్నికల్లో వైసీపీ మిగతా 6లో

దేవదాయ శాఖ అధికారిణిపై వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎన్టీఆర్ జిల్లా బాధ్యతల నుంచి శాంతి తొలగింపు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ అధికారిణి కె.శాంతిపై వేటు పడింది. ఈ మేరకు సోమవారం దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ నేత విజయసాయిరెడ్డి అండతో 2021లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల దేవదాయ శాఖ అధికారిణిగా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆమె తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. అవినీతి ఆరోపణలతో పాటు ఉద్యోగుల్లోనూ తీవ్ర వ్యతిరేకత రావడంతో ఎట్టకేలకు శాంతిని ఎన్టీఆర్ జిల్లా బాధ్యతల నుంచి తొలగించారు. ఆమె కృష్ణా జిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా కొనసాగుతున్నారు. దీనిపైనా విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులన్నా, ఉన్నతాధికారులన్నా లెక్కలేనితనంతో వ్యవహరించే శాంతిని కృష్ణాజిల్లాలో కొనసాగించడంపై స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా గ్రేడ్-1 ఈవో అయిన వీవీకే సీతారావమ్మను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీతారామ కల్యాణ మండపానికి విముక్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైసీపీ చెర నుంచి దేవదాయ శాఖకు అప్పగింత

విజయవాడ, ఆంధ్రజ్యోతి/సత్యనారాయణపురం : సత్యనారాయణపురంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీసీతారామ కల్యాణ మండపానికి ఎట్టకేలకు విముక్తి కలిగింది. సుమారు 900 గజాల స్థలంలో ఉన్న ఈ కల్యాణ మండపాన్ని కబ్జా చేసేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సహకారంతో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అనుచరులు ప్రయత్నించారు. సుమారు రూ.10 కోట్ల విలువైన ఈ స్థలాన్ని మల్లాది విష్ణు బంధువులకు చెందిన శ్రీభువనేశ్వరి పీఠానికి అప్పగించారు. ఈ అంశాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. దేవదాయ శాఖ స్థలాన్ని పరాధీనం చేయడం ఏమిటని ప్రశ్నించింది. దీనిపై స్థానికులు కూడా స్పందించారు. హైకోర్టు న్యాయవాది డీవీ శశిధర్ ఆధ్వర్యంలో హైకోర్టులో న్యాయపోరాటానికి దిగారు. హైకోర్టు సైతం దేవదాయ శాఖ నిర్ణయాన్ని తప్పుబట్టి తక్షణం కల్యాణ మండపాన్ని శ్రీభువనేశ్వరి పీఠం నుంచి స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది.
ఈ ఉత్తర్వుల మేరకు సోమవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎయిర్‌పోర్టు నుంచి కార్గో సేవలు ప్రారంభం 6లో..

స్టాండింగ్ సమరం

వీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైసీపీ విభేదాలు

- రెబల్ అభ్యర్థులుగా ఇద్దరు కార్పొరేటర్ల నామినేషన్
- గతంలో ఏకగ్రీవంగానే ఎన్నిక.. ప్రస్తుతం మారిన పరిస్థితులు
- టీడీపీ నుంచి కూడా నామినేషన్ దాఖలు
- ఆరు పదవులకు తొమ్మిది నామినేషన్లు.. ఎన్నిక తప్పనిసరి



చిట్టినగర్, జూలై 1 : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వైసీపీలో విభేదాలను బహిర్గతపరిచాయి. కొద్దిరోజుల క్రితం వరకు పార్టీ అధికారంలో ఉండటంతో నోరెత్తని కార్పొరేటర్లు ఇప్పుడు అసంతృప్తి స్వరాలను వినిపిస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ రాగానే మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు తమ ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. స్టాండింగ్ కమిటీకి ఎన్నికైన వారికి కార్పొరేషన్‌లో గౌరవంతో పాటు మంచి ఆదాయం కూడా ఉంటుంది. దీంతో ఈ ఎన్నికల్లో కమిటీలో చోటు కోసం వైసీపీలో రెబల్ అభ్యర్థులు తయారయ్యారు. ఫలితంగా ఆరు పదవులకు ఈసారి ఎన్నిక జరగడం అనివార్యంగా మారింది.

ఎవరికి వారే..

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 64 డివిజన్లకు గానూ వైసీపీకి 49 డివిజన్ల బలం ఉంది. ఈ నేపథ్యంలో గత మూడుసార్లు స్టాండింగ్ కమిటీలోని ఆరు స్థానాల కోసం వైసీపీ కార్పొరేటర్ల నుంచే ఏకగ్రీవ ఎన్నికల జరిగేది. కానీ, రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో కార్పొరేటర్లలోనూ ధిక్కారం మొదలైంది. ఆరు స్థానాలకు వైసీపీ నుంచే ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి ఒకరు నామినేషన్ వేయడంతో సోమవారం మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ రెండో డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 33వ డివిజన్ కార్పొరేటర్ వల్లూరి ఎన్‌డీఎస్ మూర్తి, 41వ డివిజన్ కార్పొరేటర్ ఇర్ఫాన్, 43వ డివిజన్ కార్పొరేటర్ బాపటి కోటిరెడ్డి, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవిని ఎంపిక చేశారు. ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ దగ్గరుండి వారితో నామినేషన్లు వేయించారు. ఈ ఆరుగురు కాకుండా వైసీపీకి చెందిన 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి, 30వ డివిజన్ కార్పొరేటర్ భీమిరెడ్డి శివ వెంకట జానారెడ్డి నామినేషన్ దాఖలు చేసి నాయకులకు షాక్ ఇచ్చారు.

ఎన్నిక అనివార్యమే..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీఎంసీతో పాటు ఇతర పదవులను రెడ్డి సామాజికవర్గానికే కేటాయించారన్న అసంతృప్తిలో పలువురు కార్పొరేటర్లు ఉన్నారు. ముఖ్యంగా మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కాపు సామాజికవర్గాన్ని దూరంపెట్టి, రెడ్డి సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇచ్చారన్న వాదన వినిపించింది. స్టాండింగ్ కమిటీలో ఇప్పటి వరకు వెలంపల్లి సూచించిన వారికే పదవులు ఇచ్చారని పలువురు కార్పొరేటర్లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితమే ఆదిలక్ష్మి నామినేషన్ దాఖలు చేయడం. ఇక తనకు అవకాశం ఇవ్వాలని, తాను సీనియర్ అని జానారెడ్డి నామినేషన్ వేసినట్టు తెలుస్తోంది. కమిటీలో ఆరు పదవులు ఉంటే, ఎనిమిది మంది నామినేషన్ దాఖలు చేయడం, మరోవైపు టీడీపీ కార్పొరేటర్ కూడా వేయడంతో వైసీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. రెబల్స్‌గా ఉన్న ఇద్దరు కార్పొరేటర్లతో మంతనాలు చేయడానికి పార్టీ నేతలు రంగంలోకి దిగారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు మంగళవారంతో గడువు ముగియనుంది. వారిని బుజ్జగించి ఒక దారికి తెచ్చుకోవాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఒకవేళ వైసీపీ రెబల్స్ ఉపసంహరించుకున్నా.. టీడీపీ నుంచి 32వ డివిజన్ కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహనరావు నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.



చికిత్స పొందుతున్న బాలుడు ఉపేంద్ర

పేటలో మళ్లీ కలకలం

ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురికి డయేరియా లక్షణాలు

జగ్గయ్యపేట, జూలై 1 : జగ్గయ్యపేటలో మళ్లీ డయేరియా కేసులు బయటపడుతున్నాయి. ఈ లక్షణాలతో సోమవారం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో ఆరుగురు చేరారు. షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన కే.లోకేశ్ (33), బూదవాడ గ్రామానికి చెందిన ఓ.గోపి (24), డాంగేనగర్‌కు చెందిన ఆర్.పాల్ చిన్ని (4), జి.ఉపేంద్ర (13), చిల్లకల్లుకు చెందిన మల్లెల జ్యోత్స్న (6), కాకానినగర్‌కు చెందిన ఆర్.ఉదయకుమారి (37) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకరిని విజయవాడకు రిఫర్ చేసినట్టు వైద్యాధికారులు తెలిపారు.

మత్తు మంటలు!



ఈడేపల్లిలో గండికోట శ్యాంప్రసాద్ ఇంటి వద్ద నిందితుడు శబరీనాథ్ దహనం చేసిన మోటారు సైకిళ్లు

గంజాయి మత్తులో సొంత మామ, బంధువులకు చెందిన ఆరు మోటార్ సైకిళ్లు, రెండు సైకిళ్లను దహనం చేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. కుటుంబ కలహాలే ఈ దుశ్చర్యకు కారణమని పోలీసులు తెలిపారు. వాహనాల దహనంతో భారీ శబ్దాలు రావడంతో జనం ఇళ్లలో నుంచి రోడ్డుపైకి పరుగులు తీశారు. చిలకలపూడి, ఆర్‌పేట పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

- గంజాయి మత్తుతో సొంత మామ, బంధువుల వాహనాలు దహనం చేసిన నిందితుడు
- రెండు ఇళ్ల వద్ద ఆరు మోటారు సైకిళ్లు, రెండు సైకిళ్లు కాల్చివేత
- కుటుంబ కలహాలే కారణం



నిందితుడు శబరినాథ్

మచిలీపట్నం టౌన్, జూలై 1: ఈడేపల్లికి చెందిన గండికోట వీర వెంకట శ్యాంప్రసాద్ కుమార్తె హనీషాతో పెడనకు చెందిన దాసరి శబరినాథ్‌తో రెండేళ్ల కితం వివాహమైంది. వీరిది ప్రేమ పెళ్లి. ఇద్దరూ బీటెక్ వరకు చదువుకున్నారు. దాసరి శబరినాథ్ గంజాయికి, మద్యానికి అలవాటు పడి భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇతనిపై పెడన పోలీసు స్టేషన్‌లో కేసులు కూడా ఉన్నాయి. శబరినాథ్ భార్య హనీషా ఉద్యోగం వెతుక్కునేందుకు హైదరాబాద్ వెళ్లింది. శబరినాథ్ తండ్రి వద్దే పెడనలో ఉంటున్నాడు. ఈడేపల్లిలో నివసిస్తున్న తన మామ గండికోట వీరవెంకట శ్యాంప్రసాద్ ఇంటికి ఆదివారం రాత్రి గంజాయి మత్తుతో పెట్రోలు పట్టుకుని శబరినాథ్ వచ్చాడు. మూడు మోటారు సైకిళ్లు, ఒక సైకిల్‌పై పెట్రోలు పోసి దహనం చేశాడు. ఇంట్లో నిద్రపోతున్న శ్యాంప్రసాద్ బయటకు వచ్చాడు. మోటారు సైకిళ్లను ఆర్పేందుకు ప్రయత్నం చేయగా, అతని ముఖానికి గాయమైంది.

● ఈడేపల్లిలో వాహనాల దహనం..

శబరినాథ్ ఈడేపల్లిలో బంధువు కోన ప్రసాద్ ఇంటికి వెళ్లాడు. అక్కడ కూడా మరో మూడు మోటారు సైకిళ్లపై



కోన ప్రసాద్ ఇంటి వద్ద నిందితుడు దహనం చేసిన వాహనాలు

పెట్రోలు పోసి కాల్చేశాడు. పెద్ద శబ్దాలు వినబడ్డాయి. మంటలు కనబడ్డాయి. ఇంటి బయట ఏం జరుగుతుందో తెలియక కోన ప్రసాద్ నిద్రలేచి బయటకు వచ్చాడు. మూడు మోటారు సైకిళ్లు, ఒక సైకిల్ కాలిపోయాయి. కారు ముందు భాగం కాలింది. ఫైర్ అధికారులు వచ్చి ఇరు ప్రాంతాల్లో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. శ్యాంప్రసాద్‌కు రూ.2 లక్షల 20వేల వరకు ఆస్తినష్టం సంభవించిందని అంచనా. కోన ప్రసాద్‌కు చెందిన రూ.లక్షా50 వేల నష్టం కలిగినట్టు అంచనా. కుటుంబ కలహాలే ఈ దుశ్చర్యకు కారణమని పోలీసులు తెలిపారు. శ్యాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి ఎస్ఐ కె.వి.వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కోన ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌పేట ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. నిందితుడు శబరినాథ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

పింఛన్ల ఘనత టీడీపీదే

జగ్గయ్యపేటలో నెట్టెం రఘురాం



సీతారాంపురంలో పింఛన్ అందిస్తున్న నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, జూలై 1 : పేదలకు భరోసా ఇచ్చిన పింఛన్లు తొలిసారి ప్రవేశ పెట్టింది ఎన్టీఆర్ అని, తానే పింఛన్లను కనిపెట్టినట్టు బిల్డప్ ఇచ్చిన జగన్‌రెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పారని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. ఆయన సోమవారం పురపాలకసంఘ పరిధిలో సీతారాంపురం, యాదవ బజార్‌లలో 10, 11 వార్డుల్లో, మండలంలో గండ్రాయి దళిత వాడలో పెన్షన్లను ఇంటింటికి పంపిణి చేశారు. ఆయన వెంట నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు నెట్టెం శివరాం, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, పదో వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మీ ఉన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం కృషి : ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు, గొల్లపూడి, మైలవరం, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం : పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయకుడు ఎంతో కృషి చేస్తున్నారని ఇచ్చిన మాట ప్రకారం పెంచిన దాంతో సహా పింఛను అందించారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. గొల్లపూడిలో జిల్లా కలెక్టర్ సృజనతో కలిసి, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో కూటమి నేతలతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించారు.

● పైడూరుపాడులో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్థానిక నాయకుడు రంగినేని నరేంద్రతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందించారు. మైలవరంలో లంక లితీష్, గడ్డమణుగులో ఎంపీటీసీ నూతక్కి అపర్ణ, నూతక్కి రాజారావు... లబ్ధిదారులకు పింఛన్ అందించారు.

● విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో మెండెం జమలయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులు సీఎం చంద్రబాబు చిత్ర పటాలతో సంబరాలు చేశారు.

బట్టు ట్రస్ట్ సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే రాము

గుడివాడ : విద్యాభివృద్ధిలో బట్టు ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక ఐఎంఏ హాల్‌లో బట్టు వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ-2024 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బట్టు మనోరంజితం మెమోరియల్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ ప్రతిభ చూపిన మున్సిపల్ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళితేనే విజయాలు సొంతమవుతాయన్నారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలును నిర్వహిస్తామన్నారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా టాపర్ భానుప్రసన్నకు రూ.25 వేలు, ఇద్దరు విద్యార్థులకు రూ.15వేలు, రూ.10వేలు, 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులను తీర్చిదిద్దిన 8 మంది పురపాలక సంఘ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ట్రస్ట్ చైర్మన్ బట్టు పద్మకుమారి పాల్గొన్నారు.

సీపీడీసీఎల్ యాప్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపులు

విజయవాడ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎంల్లో నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నారా? ఇక నుంచి ఆ చెల్లింపులను ఆ యాప్‌లు స్వీకరించవు. సీపీడీసీఎల్ యాప్ ద్వారా చేసిన చెల్లింపులను మాత్రమే స్వీకరిస్తాయి. దీనికి సంబంధించి సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులు కొంతమంది బిల్లులను రెవెన్యూ కౌంటర్ల వద్ద చెల్లిస్తున్నారు. కొంతమంది సీపీడీసీఎల్ యాప్‌లో చెల్లిస్తున్నారు. చాలామంది గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా చెల్లిస్తున్నారు. ఈ యాప్‌ల్లో ఒకసారి బిల్లు చెల్లిస్తే తర్వాత నెల నుంచి ఆటోమెటిక్‌గా బిల్లు చూపిస్తుంది. దీనిపై క్లిక్ చేసి నేరుగా చెల్లింపు చేయడంతో ఒక స్టెప్‌తో తతంగం ముగుస్తుంది. ఇక నుంచి ఇలా చేయడం కుదరని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆర్‌బీఐ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నేరుగా ఆ యాప్‌ల నుంచి చెల్లింపులు చేయడం కుదరదు. ముందుగా సీపీడీసీపెల్ యాప్‌లోకి వెళ్లిన తర్వాత పే అనే ఆప్షన్‌పై క్లిక్ చేయగానే గేట్ వేలు కనిపిస్తాయి. అందులో యూపీఐ అనే గేట్‌వే పై క్లిక్ చేసి తర్వాత ఈ యాప్‌లు కనిపిస్తాయి. అప్పుడు చేసిన చెల్లింపులను మాత్రమే ఈ యాప్‌లు స్వీకరిస్తాయని అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ఫలితాల విడుదల

టెన్త్‌లో 63.3%, ఇంటర్‌లో 69.07% ఉత్తీర్ణత

తూర్పు, కోనసీమ జిల్లాలు టాప్

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పరీక్షలు రాసిన అభ్యర్థుల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం విడుదల చేశారు. టెన్త్‌లో 15058 మందికి గాను 9531 (63.3శాతం) మంది, ఇంటర్‌లో 27279 మందికి గాను 18842(69.07శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. టెన్త్‌లో అబ్బాయిలు 60.53శాతం మంది, అమ్మాయిలు 66.43శాతం మంది, ఇంటర్‌లో అబ్బాయిలు 67.82శాతం మంది, అమ్మాయిలు 71.35శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. టెన్త్ ఉత్తీర్ణతలో తూర్పుగోదారి జిల్లా టాప్‌లో, ఏలూరు చివరన ఉన్నాయి. ఇంటర్‌లో కోనసీమ అగ్రస్థానంలో ఉంటే, నెల్లూరు ఆఖరున నిలిచింది.

మున్సిపల్ పాఠశాలల విలీనం జీవో రద్దు చేయాలి

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలలను విద్యాశాఖ పరిధిలోకి తీసుకొస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 84ను రద్దు చేయాలని మున్సిపల్ టీచర్లు కోరుతున్నారు. మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ విజ్ఞప్తితో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ టీచర్లు మెయిల్స్ చేస్తున్నారు. గత ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా పాఠశాల విద్యాశాఖలో విలీనం చేస్తూ ఏకపక్ష జీవో జారీచేసిందన్నారు. చాలా కాలంగా ఏకీకృత సర్వీసు రూల్స్ అంశం పెండింగ్‌లో ఉందని, పదోన్నతులు అపరిష్కృతంగా ఉన్నాయని, అలాంటప్పుడు ఏకంగా విలీనం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం దీనిని పునఃపరిశీలించి జీవో 84ను రద్దుచేయాలని కోరారు.

'24 శాతం హెచ్‌ఆర్‌ఏ' పొడిగించాలి

అమరావతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సోమవారం అమరావతి సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు కలిశారు. సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల్లో వారానికి 5 రోజులు పనిదినాలు విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. గత పీఆర్సీ ప్రకటన సందర్భంగా సచివాలయం, హెచ్‌వోడీల్లో పని చేసే ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ప్రొటెక్షన్ గడువు జూన్ నెలతో ముగిసిందని, దానిని తిరిగి కొనసాగించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారని రామకృష్ణ తెలిపారు.

వీర జవాన్‌కు జోహార్లు

● స్వగ్రామానికి చేరిన నాగరాజు పార్థీవదేహం

పెడన రూరల్ : లడక్‌లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ పార్థీవదేహం స్వగ్రామమైన చేవేంద్రకు సోమవారం రాత్రి చేరింది. గ్రామానికి చెందిన జవాన్ సాదరబోయిన నాగరాజు పార్థీవదేహాన్ని చూసి భార్య మంగాదేవి, తలిదండ్రులు కుటుంబసభ్యులు రోదించారు. ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు ప్రత్యేక విమానంలో తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఆర్మీ వ్యాన్‌లో వడ్లమన్నాడు చేరుకోగానే చేవేంద్ర పరిసర ప్రాంత యువకులు, మహిళలు చేవేంద్ర వరకు జోహార్లు పలుకుతూ ర్యాలీగా చేవేంద్ర చేరుకున్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, పెడన నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త పంచకర్ల సురేష్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్... నాగరాజు తండ్రి వెంకన్నను, కుటుంబసభ్యలను ఓదార్చారు. కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ అస్మిన్ నయీమ్ అద్మీ ఆర్డీవో వాణి, అంత్యక్రియల కార్యక్రమాలను దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. నాగరాజు భౌతిక కాయానికి కమాండర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఆర్మీ ఉద్యోగులు, గ్రామస్థులు, అభిమానులు నివాళులర్పించారు. ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.



జవాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాగిత



నాగరాజు పార్థీవదేహంతో గ్రామానికి వస్తున్న వాహనం

ఆగస్టు 31 దాకా స్టాప్ డయేరియా

● విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి ● అధికారులు సమన్వయంతో పనిచేయాలి ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కృష్ణలంక, జూలై 1 : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి డయేరియాను సమర్థవంతంగా అడ్డుకోవడంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో కలెక్టర్ సృజన అధికారులతో కలిసి 'స్టాప్ డయేరియా' పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అతిసార వ్యాధి అంటే ఏది? దీనిని ఎలా నివారించాలి? ఓఆర్ఎస్, జింక్ ఉపయోగాలు తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. అతిసార వ్యాధి నుంచి చిన్నారులకు రక్షించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తతతో పగడ్బందీ కార్యాచరణను అమలు చేయాలన్నారు. కార్యక్రమాల నిర్వహణలో వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డీఐఓ డాక్టర్ అమృత, డీఎల్ఏటీఓ డాక్టర్ జె.ఉషారాణి పాల్గొన్నారు.



అధికారులతో కలిసి 'స్టాప్ డయేరియా' పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన

రైల్వేల భద్రతలో లోకో పైలట్ల పాత్ర కీలకం

● దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ జైన్

రైల్వేస్టేషన్, జూలై 1: రైల్వేల భద్రతలో లోకో పైలట్లు కీలకమని, వారి పాత్ర గణనీయమైనదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అన్నారు. సత్యనారాయణపురంలోని ఎలక్ట్రికల్ ట్రాక్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన సేఫ్టీ సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేలో భద్రత చాలా ముఖ్యమన్నారు. సెలవును కేవలం విశ్రాంతి కోసమే వినియోగించుకోవాలన్నారు. ప్రశాంతమైన మనస్సుతో విధులకు రావాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. 400 మంది లోకో పైలట్లు సెమినార్‌కు హాజరయ్యారు. అలాగే డీఆర్ఎం కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన డివిజన్ పనితీరుపై అరుణకుమార్ జైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ డివిజన్ పనితీరుపై నివేదిక సమర్పించారు. పెండింగులోని విజయవాడ- గూడూరు డబ్లింగ్ పనుల వేగవంతం, ఉత్తర విభాగంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్, విద్యుదీకరణ పనులు,రద్దీగా ఉండే హౌరా-చెన్నైకారిడార్‌లో సాఫీగా కార్యకలాపాలు సాగడం కోసం సెక్షన్‌పై ఒత్తిడిని తగ్గించడం వంటి పలు అంశాలు ప్రస్తావించారు. సమయపాలన, భద్రత, లోడింగ్ పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేకంగా వివరించారు. పురోగతిలోని పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. తొలుత సీఎం చంద్రబాబును వెలగపూడిలోని సచివాలయంలో అరుణకుమార్ జైన్, గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో చేపట్టిన రైల్వే ప్రాజెక్టుల ప్రగతిపై నివేదిక సమర్పించారు.

సర్వేశాఖలో పైసల దుమారం!

జోగి కబ్జాకాండలో సస్పెండైన సర్వేయర్‌కు అభయం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: మాజీ మంత్రి జోగి రమేష్ రూరల్ మండలం పరిధిలో అగ్రిగోల్డ్ భూముల కబ్జా వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా ఉన్న మండల సర్వేయర్ రమేష్‌తో పాటు మండల డిప్యూటీ తహసీల్దార్, గ్రామ సర్వేయర్లపై కలెక్టర్ ఢిల్లీ రావు సస్పెండ్ వేటువేశారు. అయితే జిల్లా సర్వే ఉన్నతాధికారులు మాత్రం రమేష్‌కు సస్పెండ్ ఆర్డర్ ఇవ్వలేదు. మిగిలిన ఇద్దరికీ ఇచ్చారు. కీలక సూత్రధారి రమేష్‌కు ఎందుకు సస్పెండ్ ఆర్డర్ ఇవ్వలేదన్న వ్యవహారం వెనుక భారీగా ముడుపుల పర్వం నడిచిందన్న విమర్శలు వస్తున్నాయి. మండల సర్వేయర్ నుంచి భారీగా ముడుపులు అందుకున్న అధికారులు అతడిని కాపాడటానికి ఇదే సమయంగా భావించారు. దీంతో సర్వేయర్ రమేష్‌కు సస్పెండ్ ఆర్డర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఎయిర్‌పోర్టు నుంచి కార్గో సేవలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : విజయవాడ విమానాశ్రయం నుంచి కార్గో సేవలు ప్రారంభమయ్యాయి. సోమవారం కార్గో సేవలను విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కోస్తా జిల్లాలకు చెందిన వ్యాపారులు, రైతులు, పారిశ్రామికవేత్తలు ఎప్పటి నుంచో కార్గో సేవల కోసం పట్టుబడుతున్నారు. చాంబర్ వర్గాలు కూడా కార్గో సేవలను ప్రారంభించాల్సిందిగా విన్నవించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టు అధికారులు కార్గో సేవలు ప్రారంభించేందుకు టెండర్లు పిలిచారు. ఒమేగా ఎంటర్ ప్రైజెస్ సంస్థ పోటీ పడి టెండర్‌ను దక్కించుకుంది. కార్గో సేవలను అందించటానికి వీలుగా ఈ సంస్థ అన్ని అనుమతులను సాధించింది. విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ 50 టన్నుల వరకు విమానాల్లో సరకు రవాణా చేయటానికి అవకాశం ఉంది. కార్గో సేవల వల్ల రైతులు తాము పండించిన కూరగాయలను దేశవ్యాప్తంగా ఎగుమతి చేయవచ్చు.

ఖరీఫ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

● వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 1 : జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో ప్రత్యేకంగా దృష్టిసారించి సీజన్‌ను విజయవంతం చేసేలా కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సృజన, వ్యవసాయం, ఉద్యాన, పట్టు, పశుసంవర్థక, మత్స్య శాఖలతో పాటు మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతు బజార్ల కార్యకలాపాలపైనా సమీక్షించారు. ఉద్యాన శాఖ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలను కూడా సమీక్షించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.నాగమణెమ్మ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విద్యాసాగర్, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, సెరీకల్చర్ ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ, మత్స్యశాఖ అధికారి పెద్దిరాజు, ఏపీఎంఐపీ పీడీ పి.ఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. నేటి నుంచి(మంగళవారం) ఈనెల 10 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువు ఇచ్చింది. 5న సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, 11 నుంచి 15 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని సూచించింది. 19న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 20 నుంచి 22లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని స్పష్టంచేసింది. కాగా ఈ ఏడాది మొత్తం 3.5లక్షల వరకు డిగ్రీ సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. కాలేజీల యాజమాన్యాలు ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టాలని కోరగా, ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్‌లోనే ప్రక్రియను ప్రారంభించింది.

నందిగామ మున్సిపాలిటీలో టీడీపీదే పైచేయి

(5వ పేజీ తరువాయి)

వశం చేసుకుంది. అధికార బలంతో పాటు టీడీపీకి అంతగా ఆర్థిక వనరులు లేకపోవడంతో వైసీపీ 13 స్థానాల్లో విజయం సాధించింది. టీడీపీ ఆరు, జనసేన ఒకచోట గెలిచాయి. ఆ తర్వాత ఆరో వార్డులో గెలిచిన యాకూబ్ ఆలీ వైసీపీలో చేరడంతో టీడీపీ బలం ఐదుకు తగ్గి, వైసీపీ బలం 14కు పెరిగింది. ఈ క్రమంలోనే చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మీ, వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం మృతిచెందారు. దీంతో వైసీపీ బలం 12కు తగ్గింది. కాగా, సాధారణ ఎన్నికల సమయంలో వైసీపీకి చెందిన 4, 13, 16 వార్డుల కౌన్సిలర్లు మారం అమరయ్య, గద్దె శేషుకుమారి, అచ్చి దివ్య టీడీపీలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీకి 9, టీడీపీకి 8, జనసేనకు ఒక కౌన్సిలర్ ఉన్నట్టయ్యింది. ప్రస్తుతం టీడీపీ, జనసేన కూటమి కావడం వల్ల కౌన్సిల్‌లో బలం చెరి సమానమైంది. ఇప్పుడు టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన తంగిరాల సౌమ్య, ఎంపీగా గెలుపొందిన కేశినేని శివనాథ్ ఓట్లు అదనపు బలంగా తోడయ్యాయి. దీంతో ఇప్పటికే మున్సిపాలిటీపై టీడీపీ పట్టు సాధించింది. మండవ వరలక్ష్మీ, మాడుగుల నాగరత్నం మరణంతో ఖాళీ ఏర్పడిన 11, 7 వార్డులకు ఉప ఎన్నికలు జరిగిన వెంటనే ప్రభుత్వం చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చేపడుతుంది. భారీ విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న టీడీపీ ఆ రెండు స్థానాలను కూడా కైవసం చేసుకుని తమ పార్టీకి చెందిన సభ్యురాలిని చైర్‌పర్సన్ పీఠం ఎక్కించేందుకు తహతహలాడుతోంది. ఓటమి భారంతో ఉన్న వైసీపీ ఈ వార్డులకు జరిగే ఉప ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. వైసీపీ పోటీ చేసినా.. తమదే విజయమని టీడీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు తమతో టచ్‌లోకి వచ్చారని, ఏ క్షణమైనా వారు టీడీపీలో చేరే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగరేస్తామంటున్నారు. మొత్తంగా చూస్తే మున్సిపాలిటీని టీడీపీ అతి సునాయాసంగా చేజిక్కించుకునే అవకాశం ఉంది.

ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక దృష్టి

నందిగామ మున్సిపల్ పాలన తన కనుసన్నల్లోకి తెచ్చుకుని మెరుగైన పాలన అందించడం ద్వారా ప్రజల రుణం తీర్చుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భావిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మున్సిపాలిటీ పరిధిలో ఆమెకు 8 వేల ఓట్ల ఆధిక్యత లభించింది. తనకు ఇంత మద్దతు ఇచ్చిన మున్సిపాలిటీని తనవైపు తెచ్చుకోవాలని ఆమె చూస్తున్నారు. తన రాజకీయ చతురతను ఉపయోగించి, తన మనిషిని మున్సిపల్ పీఠం ఎక్కించేందుకు చూస్తున్నారు.

అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం ముఖ్యం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కృష్ణలంక, జూలై 1 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిష్కరించడం ప్రధానమని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సృజన, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీ కుమారితో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, జూలై 01 : ఐటీఐలలో 2024-2025 విద్యా సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్లకు ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐటిఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 27వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం నుంచి అమల్లో ఉన్న కొత్త విధానం ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తులో పేర్కొన్న ఐటీఐ కళాశాలకు 25వ తేదీన సాయంత్రం 5గంటల లోపుగా హాజరై తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం ఆ ఐటీఐలోని ప్రిన్సిపల్ వెబ్‌సైట్‌లో ధ్రువీకరించుకోవాల్సి ఉంది. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 27వ తేదీ నుంచి 28వ తేదీ వరకు, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో29వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 94906 39639, 77804 29468 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఏడీసీ సీఎండీగా లక్ష్మీపార్థసారథి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న లక్ష్మీపార్థసారథి

వన్‌టౌన్, జూలై 1 : అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా డి.లక్ష్మీపార్థసారథి సోమవారం అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్ మార్క్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ విభాగాల అధిపతులతో ఆమె సమావేశమై ప్రస్తుతం అమరావతిలోని నిర్మాణాల పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో సంస్థ ముఖ్య ఇంజనీర్ సీహెచ్ ధనుంజయ్, సూపరింటెండెంట్ ఇంజనీర్ భాస్కర్, సీఏవో ఉమామహేశ్వరి, ఉద్యానవన అధికారి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

రికార్డు స్థాయిలో పెన్షన్ల పంపిణీ

- కేవలం సచివాలయ ఉద్యోగులతోనే..
- వలంటీర్లు లేకుండానే సాధించాం
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

పెనమలూరు, జూలై 1 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరిగిన సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం రికార్డు స్థాయిలో జరిగిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. నిన్న రాత్రి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం పోరంకి వందడుగుల రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 61.7 లక్షల మందికి 4170 కోట్లను రికార్డు స్థాయిలో ఎన్నడూ లేని విధంగా పంపిణీ చేశామని వెల్లడించారు. కేవలం 1.35 లక్షల మంది సచివాలయ ఉద్యోగులతో పన్నెండు గంటల సమయంలో ఇన్ని లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేయడం ఒక రికార్డని తెలిపారు. గత ఏప్రిల్‌లో వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించకుండా వృద్ధులను మండు టెండల్లో నిలబెట్టి సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిప్పి ఎంతోమంది వృద్ధుల మృతికి కారణమయిందని విమర్శించారు. తన తప్పిదాలను టీడీపీపైనా, చంద్రబాబు పైనా నెట్టే ప్రయత్నం చేసిందన్నారు. పెన్షన్ల పంపిణీకి టీడీపీ అడ్డు పడుతోందన్న రాజకీయ దురుద్దేశాన్ని రుద్దే ప్రయత్నం చేసిందన్నారు. తెల్లవారుజామునే ప్రభుత్వ ఉద్యోగులు, కూటమి నాయకులు కార్యకర్తలు పెన్షన్ల పంపిణీకి వెళుతుంటే మేళతాళాలతో ఆహ్వానాలు పలకడంతో పండుగ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. రాత్రి ఎనిమిదింటి వరకు మొత్తం 28 కేటగిరీల్లో 95 శాతంకు పైగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వానికి వెయ్యి పెంచడానికి ఐదేళ్ల పట్టగా కేవలం పదహారు రోజుల చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా వెయ్యి పెంచి గత మూడు నెలల బకాయిలను కూడా ఇవ్వడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన 30 రూపాయల పెన్షనును రెండు వందలకు, రెండు వేలకు, ఇప్పుడు నాలుగు వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఆర్థికంగా పరిస్థితి బాగులేకపోయినా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధిస్తుందని తెలిపారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

సెంట్రల్ తహసీల్దార్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ తనిఖీలు

వన్‌టౌన్, జూలై 1: సెంట్రల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విజయవాడ రెవెన్యూ డివిజన్ సబ్‌కలెక్టర్ భవానీ శంకర్ తన బృందంతో తనిఖీలు చేశారు. కృష్ణలంకకు చెందిన వ్యక్తి 11 రోజుల క్రితం తన కుమారుడిని ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేశారు. ఆయన సర్టిఫికెట్ కోసం ప్రతిరోజూ సెంట్రల్ తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నాడు. ప్రభుత్వ పనులలో బిజీగా ఉన్నామని చెబుతూ వస్తున్నారు. అయితే మరోవైపు కాలేజీలో అడ్మిషన్లకు సమయం ముగియడంతో ఆందోళన చెందుతూ ఆయన కలెక్టర్, డీఆర్వోలకు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వారిద్దరి ఆదేశాల మేరకు సబ్‌కలెక్టర్ సెంట్రల్ తహసీల్దార్ ఠాగూర్‌ను ప్రశ్నించారు. తనిఖీలో పలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు సాయంత్రానికే ఫిర్యాదుదారునికి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు.



52వ డివిజన్‌లో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి, నాగుల్ మీరా, 33, 9, 7, 21 డివిజన్లలో పెన్షన్ల పంపిణీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గద్దె క్రాంతి, వృద్ధురాలి పాదాలకు పాలాభిషేకం చేస్తున్న చిన్న సుబ్బయ్య

కోలాహలంగా పెన్షన్ల పంపిణీ

● చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకాలు ● లబ్ధిదారుల కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందాలు

వన్‌టౌన్, జూలై 1: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.7వేల ఎన్టీఆర్ భరోసా పింఛన్ సోమవారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ ప్రారంభమైంది. టీడీపీ-బీజేపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర అనేక వర్గాల పింఛన్‌దారులకు ఆయా మొత్తాలను నూతనోత్సాహంతో పంపిణీ చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన రూ.3వేల పింఛన్ పంపిణీకి అదనంగా తాము గెలిస్తే మరో రూ.వెయ్యి ఒకేసారిగా పెంచి ఇస్తామని కూటమి నాయకులు ప్రకటించారు. దీంతో పాటుగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి వెయ్యి రూపాయల చొప్పున మొత్తంగా రూ.7వేలు ఒకేసారి అందించారు. ఒకేసారిగా రూ.7వేలు అందుకున్న లబ్ధిదారుల నివాసాలలో నూతనోత్తేజం వెల్లుబుకింది. చాలామంది లబ్ధిదారులు ఒకేసారిగా ఇంతమొత్తాన్ని అందుకోవడం పట్ల జీవితకాల మధురానుభూతి పొందినట్లు చెప్పడం విశేషం.

ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో...

ఎమ్మెల్యే సుజనా చౌదరి సోమవారం ఉదయం తన నియోజకవర్గ పరిధిలోని 22 డివిజన్లలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట నాగుల్‌మీరా తదితర నాయకులు పాల్గొన్నారు. 52వ డివిజన్‌లో ఓ వృద్ధురాలి నివాసానికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తన డివిజన్‌లో పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ల ను పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు ఈగల సాంబ, జనసేన అధ్యక్షుడు నల్లబిల్లి కనకరావు, బీజేపీ అధ్యక్షుడు కోడాల లక్ష్మణరావు, యువనాయకుడు కాండ్రేగుల రవీంద్ర పాల్గొన్నారు.

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ 36వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్‌లో పింఛన్ పంపిణీ ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అబ్దుల్ సత్తార్, సురభి బాబు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

● 40వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ఏ.సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ చుట్టుగుంటలోని తన నివాసం వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు ఓ దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



51వ డివిజన్‌లో, చిట్టినగర్ కొండపైన పెన్షన్ల పంపిణీ, ఊర్మిళానగర్ పార్కు సెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మోరబోయిన రాంబాబు

వృద్ధ మహిళల పాదాలకు పాలాభిషేకం

విద్యాధరపురం: 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వీవీ చినసుబ్బయ్య ఆధ్వర్యంలో డివిజన్‌లోని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి, పింఛన్ లబ్ధిదారులు బ్రాహ్మణ, వైశ్య వృద్ధ మహిళల పాదాలకు స్వచ్ఛమైన ఆవుపాలతో అభిషేకం చేశారు. 120, 121, 122, 123 బూత్ కన్వీనర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు.

సత్యనారాయణపురం: 31వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణలు, 33వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, వేమూరి ఆనందసూర్యలు పింఛన్లు పంపిణీ చేశారు.

పటమట: 14వ డివిజన్ చిన్నవంతెన సెంటర్లో చైత్రి స్కూల్‌రోడ్డు వద్ద యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ స్థానికులతో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు. మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. 9వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్రకార్యదర్శి చెన్నుపాటి గాంధీ, డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి కాంతి శ్రీ గాంధీ, యలమంచిలి దేవేంద్ర, టీడీపీ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు. 12, 13వ డివిజన్లలో పింఛన్లు పంపిణీలో ప్రత్యేకాధికారి వసీంబేగ్, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, సామాజిక కార్యకర్త రెహమాన్ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం

రాణిగారితోట: పెన్షన్ లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం నింపిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటాలకు గద్దె క్రాంతి, రాణిగారితోట 17,18 డివిజన్ల నాయకులు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. డివిజన్‌లో నాయకులతో పాటు ప్రతి కార్యకర్త పెన్షన్ లబ్ధిదారుల వద్దకు వెళ్లి సంతోషంగా వారికి పింఛన్ అందజేశారు. నాయకులు వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, ముని పోలిపల్లి, పీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

● 19వ డివిజన్‌లో కలెక్టర్ సృజనతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. భాగం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: తూర్పు నియోజకవర్గం 2వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గద్దె క్రాంతి సచివాలయ సిబ్బందితో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేశారు.

మొగల్రాజపురం/మధురానగర్: మొగల్రాజపురం 7వ డివిజన్‌లో సచివాలయ సిబ్బంది, డివిజన్ నాయకులతో కలిసి గద్దె క్రాంతికుమార్ పెన్షన్లు పంపిణీ చేశారు. ● మధురానగర్ 29వ డివిజన్‌లో స్పెషలాఫీసర్ రమణారెడ్డి, సచివాలయ అడ్మిన్ సురేష్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో కలిసి డివిజన్ నాయకులు పింఛన్‌లను పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, కార్యదర్శి సూరి, బీసీ నాయకులు రాంబాబు, మసిముక్కు శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో...

కృష్ణలంక: కృష్ణలంక 20, 21 డివిజన్లలో టీడీపీ, జనసేన నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటివద్దకే వెళ్లి పెన్షన్‌ను అందించారు. 20వ డివిజన్ టీడీపీ డివిజన్ అధ్యక్షులు మోటేపల్లి చిన్నా, అడపా శివలు , 21వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేములపల్లి రంగారావు, జనసేన డివిజన్ అధ్యక్షుడు కొవ్వూరి కిరణ్‌కుమార్, పోతిరెడ్డి రమణతో కలిసి పింఛన్ పంపిణీ చేశారు. కృష్ణలంక నెహ్రూనగర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుండు శ్రీనివాసరావు, మేకల విజయలక్ష్మి, శేఖర్ తదితరులు సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ చేశారు.

చిట్టినగర్: 48వ డివిజన్‌లో వార్డు సెక్రటరీలు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. 49వ డివిజన్‌లో కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ వార్డు సెక్రటరీలతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. 46వ డివిజన్‌లో టీడీపీ నాయకులు గుర్రం కొండ, డివిజన్ అధ్యక్షుడు ప్రభుదాస్ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. 51వ డివిజన్‌లో టీడీపీ పశ్చిమ మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

భవానీపురం: 41, 43, 44, 45 డివిజన్లలో టీడీపీ నాయకులు, వార్డు సెక్రటరీలు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. 44వ డివిజన్ బూస్టర్ పాయింట్ వద్ద వార్డు ఎమినిటీస్ సెక్రటరీ హర్షిత పర్యవేక్షణలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి బడుగు గణేష్‌ల ఆధ్వర్యంలో, నాలుగు స్తంభాల సెంటర్‌లో వార్డు సెక్రటరీ వెంకటేష్ ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ జరిగింది. 43వ డివిజన్ పరిధిలో 133, 134, 140 సచివాలయ సిబ్బందితో టీడీపీ అధికార ప్రతినిధి పూజల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు కొండయ్య పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ● 43వ డివిజన్ ఊర్మిళానగర్ పార్కు సెంటర్ వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు మోరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి సోమవారం రాత్రి పాలాభిషేకం చేశారు.

పేదల సంక్షేమానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారు : గద్దె

భారతీనగర్: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని దానికి రూ. 3 వేలు ఉన్న పింఛన్ సొమ్మును ఒక్కసారిగా రూ. 4 వేలకు పెంచి అందించడమే నిదర్శనమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 4వ డివిజన్ వరలక్ష్మీనగర్‌లో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పింఛన్లు అందజేశారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, కోడూరు వాసు, చలసాని రేజా, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఎన్టీఆర్ ఆలోచనే

గుణదల: వృద్ధులకు, వితంతువులకు,వికలాంగులకు పింఛన్ల పంపిణీ ఆలోచన అనేది నందమూరి తారకరామారావుదేనని, నేటికీ ఇదే అంశానికి టీడీపీ ప్రాధాన్యత ఇస్తూ వస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 3వ డివిజన్లోని నాగార్జున నగర్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గద్దె ముఖ్య అతిథిగా హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తాడన్న నమ్మకంతోనే ప్రజలు పట్టం గట్టారన్నారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్ పాల్గొన్నారు. ఐదవ డివిజన్లోనూ గద్దె పింఛన్లు పంపిణీ చేశారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం: రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం చంద్రబాబు వితంతు, వికలాంగులు, వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపారని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అర్హులకు పింఛన్లు అందజేశారు.



మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు, ప్రభుత్వాసుపత్రి డాక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏపీ హంస కమిటీ సభ్యులు

వైద్యులు ప్రత్యక్ష దైవాలు : ఏసీపీ భాస్కరరావు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 1 : వైద్యులు ప్రత్యక్ష దైవాలని ఏసీపీ పి. భాస్కరరావు పేర్కొన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో పింగళి వెంకయ్య రోటరీ క్లబ్ ప్లాటినం జూబ్లీ సెంటర్‌లో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యుల ప్రాముఖ్యతను వివరించారు. క్లబ్ వ్యవస్థాపకుడు జి. సమరం, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, డాక్టర్ జీవీ మోహన్‌ప్రసాద్, క్లబ్ ప్రెసిడెంట్ వి. శ్రీదేవి. ఎస్. రవిప్రకాష్, పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి : నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా ఏపీ హంస సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆసుపత్రి డాక్టర్లు కంచర్ల సుధాకర్, కె. శ్రీనివాసరావు, టీ. వాణి, ఉండవల్లి దేవప్రసాద్‌లకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ సభ్యులు వి. రామకృష్ణ, శ్రీదేవి, జయకుమార్, విమల, కృష్ణకిషోర్, వాసు, నాళం మురళీకృష్ణ, ఎంఎస్ఆర్కే ప్రసాద్, దీక్షితులు, భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి: కమిషనర్

చిట్టినగర్, జూలై 1: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 16 అర్జీలు వచ్చాయి. చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

డెంగీ, మలేరియా నివారణ పోస్టర్ ఆవిష్కరణ

డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా నివారణ పోస్టర్‌ను సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో పలువురు అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ. ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజన, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి పాల్గొన్నారు.

జాతీయ కుస్తీ పోటీలకు రోహిత్‌కుమార్ ఎంపిక



వన్‌టౌన్, జూలై 1: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉదంసింగ్ నగర్‌లో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే సబ్ జూనియర్ జాతీయ రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు వన్‌టౌన్‌లోని హిందూ హైస్కూల్ విద్యార్థి ఎస్.రోహిత్ కుమార్(పదవ తరగతి) ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఇన్‌ఛార్జ్ దాసరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోహిత్ కుమార్ ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. హిందూ హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య, కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, పాఠశాల కార్యదర్శి కేఎల్‌వీ మోహనరావు, ప్రధానోపాధ్యాయులు కే.శ్రీనివాసరావు, పీఈటీ సత్యప్రసాద్‌లు రోహిత్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మాచవరం, జూలై 1 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా మాచవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఊర్మిళానగర్, గాంధీకాలనీ, లెనిన్‌నగర్, షిరిడి సాయి నగర్, ప్రశాంతికాలనీ, ఎస్ఎల్‌వీ ఏరియా, మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ పి. హరిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భారతీనగర్ : రింగ్‌రోడ్డు సెక్షన్‌లో పరిధిలోని టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ 1,2 రోడ్లు, జేడీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ

సత్యనారాయణపురం, జూలై 1: జీవితంలో విద్యార్థిదశ అతి ముఖ్యమని, ఈ దశలో తీసుకోసే నిర్ణయాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. దుర్గాపురం టీ.వెంకటేశ్వరరావు పాఠశాలలో సోమవారం బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు షూస్,స్టేషనరీ అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, నవనీతం సాంబశివరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపారులకు టీడీపీ అండ



వన్‌టౌన్, జూలై 1: వ్యాపారస్తులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని సోమవారం ఉండవల్లిలో తనను కలిసిన టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేష్‌తో మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులను రాకేష్ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే అవకాశముందన్నారు.

అతిసార వ్యాధి నివారణ కార్యక్రమం

భారతీనగర్, జూలై 1: నాల్గవ డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలో సోమవారం అతిసార వ్యాధి నివారణ కార్యక్రమం జిల్లా వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, జిల్లా మలేరియా డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ మోతీబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. లీలాకార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



రామ్‌చరణ్ సొంత చిత్రంలో నిఖిల్

వి మెగా పిక్చర్స్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి హీరో రామ్‌చరణ్ నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. యూవీ క్రియేషన్స్ విక్రమ్‌రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ వీరిద్దరితో చేతులు కలిపారు. నిఖిల్ హీరోగా నిర్మించే తొలి చిత్రం 'ది ఇండియా హౌస్' నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషించనున్నారు. 1905వ సంవత్సరం నేపథ్యంగా ప్రేమ, విప్లవం అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ హంపీలోని విరూపాక్ష దేవాలయంలో ప్రారంభమైంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రానికి కెమరూన్ బ్రైసన్ ఛాయాగ్రాహకుడు.

విక్టరీ వెంకటేశ్ కొత్త చిత్రం



విక్టరీ వెంకటేశ్, వరుణ్‌తేజ్‌తో 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' వంటి వినోదాత్మక చిత్రాలను అందించిన దర్శకుడు అనిల్ రావిపూడి తాజాగా ఇప్పుడు వెంకటేశ్ సోలో హీరోగా ఓ సినిమా చేస్తున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ చిత్రం బుధవారం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఉన్న రివాల్వర్, గులాబీ పువ్వు, ఎక్సలెంట్ వైఫ్, ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ అనే కాప్షన్ అందరినీ ఆకట్టుకున్నాయి. దీనిని బట్టి చూస్తే ఇందులో వెంకటేశ్ మాజీ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషిస్తున్నారనీ, ఆ ఆఫీసర్‌గారి భార్య, మాజీ గర్ల్‌ఫ్రెండ్ మధ్య వచ్చే సన్నివేశాలు అనిల్ రావిపూడి స్కూల్‌లో లా వినోదభరితంగా ఉండవచ్చని అర్థమవుతుంది.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



వైవిధ్యమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకొంటున్న సుధీర్‌బాబు ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించనున్నారు. మన పురాణాలతో అనుసంధానం చేస్తూ ఎన్నో రహస్యాలను వెలికి తీసే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇంతకుముందెన్నడూ రాని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి వెంట్ కల్యాణ్ దర్శకుడు. 'రుస్తమ్', 'టాయ్‌లెట్', 'ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్‌మ్యాన్', 'పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది. ఇందులో సుధీర్ బాబు సరసన బాలీవుడ్ కథానాయిక నటిస్తుంది. ఆమె ఎవరనేది త్వరలో తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. 'కుట్ర, పన్నాగాలతో మంచికి, చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఈ చిత్ర ముఖ్యాంశం. పాన్ ఇండియా సినిమాల్లో ఓ మైల్ స్టోన్‌గా ఉంటుంది' అని చెప్పారు దర్శకుడు కల్యాణ్. ఈ సినిమా గురించి సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ నచ్చి ఏడాది నుంచి ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. ఆగస్టు 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామనీ, సినిమాను శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేస్తామనీ ప్రేరణ అరోరా చెప్పారు.

మాస్ మూమెంట్స్‌తో 'స్టెప్పామార్'



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

హారర్ మిస్టరీ కథాంశంతో...

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఓ హారర్ మిస్టరీ సినిమాలో నటిస్తున్నారు. 'చావు కబురు చల్లగా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. సతీశ్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ అందించారు. జూలై 11 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, ఇప్పటివరకూ ఎవ్వరూ తీయని కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటర్: నిరంజన్ దేవరమానే, డీఓపీ: చిన్మయ్ సలార్కర్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్.



భార్య చెప్పులు మోసిన కొత్త పెళ్లికొడుకు





సీనియర్ నటుడు శత్రుఘ్నసిన్హా కుమార్తె సోనాక్షి వివాహం ఆమె చిరకాల స్నేహితుడు జహీర్ ఇక్బాల్‌తో ఇటీవలే జరిగింది. భార్య సోనాక్షి అంటే ఇక్బాల్‌కు ఎంత ప్రేమ అంటే.. ఆమె చెప్పుల్ని కూడా మోసేంతగా. అవునండీ. నిజం. ఈ మధ్య ఇక్బాల్, సోనాక్షి కలిసి ఓ హోటల్‌కు వెళ్లారు. అప్పుడు సోనాక్షి వేసుకున్న చెప్పులతో ఇబ్బంది పడుతుంటే, 'నువ్వు ఉండు' అని ఆమె చెప్పులు పట్టుకుని ఇక్బాల్ నడుస్తుంటే వెనుక నడుస్తూ వీడియో తీశారు సోనాక్షి. ఆ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసి 'కరెక్ట్ పర్సన్‌ను పెళ్లి చేసుకుంటే ఇలా ఉంటుంది' అని రాసుకొచ్చారు సోనాక్షి.

సునయన పెళ్లి అతనితోనేనా?



'కుమారి వర్సెస్ కుమారి' చిత్రంతో వెండితెర ప్రవేశం చేశారు సునయన. 'రాజరాజచోర' చిత్రంతో హిట్ అందుకుని ఆ తర్వాత కొన్ని సినిమాలు, 'మీట్ క్యూట్', 'ఇన్స్‌పెక్టర్ రిషి' వెబ్ సిరీస్‌లో నటించారు. కొన్ని రోజుల క్రితం తనకు నిశ్చితార్థం అయ్యిందని సోషల్ మీడియాలో ప్రకటించి.. తన కాబోయే భర్త వేలు పట్టుకున్న ఫొటోను షేర్ చేశారు. కానీ తను పెళ్లాడబోయే వ్యక్తి పేరు మాత్రం చెప్పకుండా అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు. తాజాగా, ఆమె పెళ్లి చేసుకోబోయేది దుబాయ్‌కు చెందిన ఖలీద్ అల్ అమేరి అనే యూట్యూబర్‌ను అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం జూన్ 26న ఖలీద్ అల్ అమేరి తన ఇన్‌స్టా ఖాతాలో ఓ అమ్మాయితో ఉంగరాలు మార్చుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీంతో సునయన నిశ్చితార్థం చేసుకున్న వ్యక్తి.. పెళ్లి చేసుకోబేయేది ఖలీల్‌నే అని అందరూ అనుకుంటున్నారు. కాగా, ఖలీల్‌కు ఇప్పటికే సలామా మొహమ్మద్‌తో పెళ్లయిందని, ఫిబ్రవరి 14న వారిద్దరూ విడాకులకు అప్లై చేయగా వెంటనే విడాకులు మంజూరు అయ్యాయట. ఈ విషయాన్ని స్వయంగా ఖలీల్ భార్య సలామానే చెప్పారు.


మిస్ యూనివర్స్‌తో 'క్యాలెండర్' సాంగ్



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోన్న సంగతి తెలిసిందే. టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీ 12న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సోమవారం ఈ సినిమా నుంచి 'క్యాలెండర్' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన మోడల్, 2017 మిస్ యూనివర్స్ డెమి లీ టెబో నటించి.. పాటకే ప్రత్యేకార్షణగా నిలిచారు. అలాగే ఇదివరకటి శంకర్ సినిమాల్లోని పాటల్లాగే ఇందులోనూ గ్రాండ్ స్కేల్‌లో విజువల్స్ ఉన్నాయి. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎ.శ్రీకర ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవివర్మన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుందర్ రాజ్.

ఐదుగురు స్నేహితుల వినోదం

ఎమ్మెస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగే సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విస్కి దర్శకత్వంలో బొమ్మా బొరుసా సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. బాలుకి స్నేహితులు



పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఓపెన్ అయిన టీజర్ ఆ తర్వాత వినోదభరితంగా సాగింది. కొత్తదనం కలిగిన సినిమా అనే భావన టీజర్ చూశాక కలుగుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు విస్కి మాట్లాడుతూ 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యావసానాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ నెల 19న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. ప్రమోదిని, వాకా మణి, రాజా అశోక్, వెంకటేశ్, సాయి అరుణ్, రాహుల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఐ.భరత్.

'కోడి బుర్ర' కథ ఏమిటి?



తమిళ హీరో శ్రీరామ్ కొత్త చిత్రం 'కోడి బుర్ర' షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రుతి మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్నారు. శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసిన అనంతరం నిర్మాత బెక్కం వేణుగోపాల్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీరామ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ శ్రుతి మీనన్ డాక్టర్‌గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో చిత్రం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని శ్రీరామ్ చెప్పారు. నిర్మాత కంచర్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 'నా ఫేవరెట్ హీరో శ్రీరామ్. ఆయన నటించిన 'ఒకరికి ఒకరు', 'పోలీస్ పోలీస్' వంటి సినిమాలు చాలా సార్లు చూశాను. నా మిత్రులు గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్‌తో కలసి ఈ సినిమా తీస్తున్నాను' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సుకుమార్ రాగ, సినిమాటోగ్రఫీ: శ్రీకాంత్ కొడా, ఎడిటర్: శిరీష్ ప్రసాద్. రచన, దర్శకత్వం: చంద్రశేఖర్ కానూరి.

యానిమేషన్ చిత్రానికి డాలర్ల పంట



యానిమేషన్ చిత్రం 'ఇన్‌సైడ్ అవుట్ 2' ప్రపంచవ్యాప్తంగా దుమ్ముదులుపుతోంది. చరిత్రలో ఇప్పటివరకూ ఏ యానిమేషన్ చిత్రం సాధించని అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. కేవలం మూడు వారాల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద వన్ బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8500 కోట్లు) అర్జించింది. ఇటువంటి సంచలన రికార్డు సాధించడమే కాకుండా ఈ ఏడాది ఇప్పటివరకూ రిలీజైన అన్ని సినిమాల కలెక్షన్లను వెనక్కునెట్టి అగ్ర స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తానికి వన్ బిలియన్ డాలర్లు కొల్లగొట్టిన 11వ యానిమేషన్ సినిమాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' చరిత్ర సృష్టించింది. ఇండియాలోనూ రిలీజైన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల పైచిలుకు కలెక్షన్లను సాధించడం విశేషం. 2015లో ఈ సినిమా మొదటి భాగం 'ఇన్‌సైడ్ అవుట్' జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పీట్ డాక్టర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల రిలే అండర్సన్ అనే బాలిక మెదడులోని భావోద్వేగాలైన ఆనందం, కోపం, చిరాకు, బాధ, భయం యానిమేషన్ రూపు సంపాదించుకుని.. ఆమె ఆలోచనల్ని, నిర్ణయాల్ని ఎలా ప్రభావితం చేస్తాయి అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్స్ దాదాపు 900 మిలియన్ డాలర్లు (రూ.7500 కోట్లు). ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కింది 'ఇన్‌సైడ్ అవుట్ 2'. జూన్ 14న విడుదలైన ఈ సీక్వెల్‌కు కెల్సీ మన్ దర్శకత్వం వహించారు. దాదాపు 96 నిమిషాల నిడివి కలిగిన ఈ సినిమాను ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ అనుబంధ సంస్థ పిక్సర్ నిర్మించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తన తోటి మిత్రులతో ఐస్ హాకీ ఆడే సమయంలో 13 ఏళ్ల రిలే అండర్సన్ జీవితంలోకి ఆందోళన, అసంతృప్తి, సిగ్గు, అసూయ ప్రవేశిస్తాయి. ఆ క్షణం నుంచి సినిమా ఎన్ని మలుపులు తీసుకుందనేది దర్శకుడు చాలా వినోదాత్మకంగా చూపించారు. టీనేజర్లను విపరీతంగా ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రస్తుతం కుటుంబ సమేతంగా ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ సినిమా మరిన్ని రికార్డులు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

వర్షాకాలంలో గాల్లో తేమ ప్రభావం చెవుల్లోని గులిమి మీద కూడా పడుతూ ఉంటుంది. అది మరింత మెత్తబడి, ఫంగస్ పెరుగుదలకు అనువుగా మారిపోతుంది. దాంతో చెవిలో దురద, నొప్పి, దిబ్బెడ, బ్లాక్ అయిపోవడం, చెవిలో సమస్య ఉన్న వైపు తలనొప్పి, నోరు తెరవడంలో ఇబ్బంది, చెవిలో గుయ్యిమని శబ్దం రావడం లాంటి లక్షణాలు మొదలవుతాయి.



ఉమెన్స్ హెల్త్

పెరిగే వయసుతో పాటు మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ స్రావం తగ్గుముఖం పడుతుంది. ఎముకల దృఢత్వం మొదలు, మానసిక సంతులనం వరకూ ఎన్నో కోణాల్లో మహిళల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఈ హార్మోన్ లోపాలు, సరిదిద్దే మార్గాల గురించి తెలుసుకుందాం!

ఆ హార్మోన్ తగ్గితే?

ఈ హార్మోన్ అండాశయాల్లో తయారవుతుంది. కాబట్టి అండాశయాల మీద ప్రభావం చూపించే అంశాలన్నీ ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తికి ప్రతిబంధకంగా మారతాయి. అవేంటంటే..

- అవసరానికి మించిన వ్యాయామం
- తీవ్రమైన మూత్రపిండాల వ్యాధి
- టర్నర్ సిండ్రోమ్ (ఒకే ఎక్స్ క్రోమోజోమ్‌తో ఆడపిల్లలు పుట్టడం)
- పిట్యుటరీ గ్రంథి మందకొడిగా పని చేయడం
- అనరెక్సియా (ఈటింగ్ డిజార్డర్)
- ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ లేదా మరేదైనా ఆటోఇమ్యూన్ డిజార్డర్
- అండాశయాలకు రక్తసరఫరాలో అడ్డంకులు ఏర్పడడం
- మెగ్నీషియం లోపం
- కుటుంబ నియంత్రణ మాత్రలతో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ల ఉత్పత్తి తగ్గడం
- హైపోథైరాయిడిజం
- ఈస్ట్ ఓవర్‌గ్రోత్

లోపాన్ని తెలిపే లక్షణాలు

ప్యూబర్టీకి చేరువవుతున్న ఆడపిల్లల్లో, మెనోపాజ్‌కు చేరువవుతున్న మహిళలో ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం తలెత్తుతుంది. అయితే అన్ని వయసుల మహిళల్లో కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అయితే ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గినప్పుడు, మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

- ఒంటి నుంచి వేడి ఆవిర్లు
- భావోద్వేగాలు అదుపు తప్పడం
- మానసిక కుంగుబాటు
- తలనొప్పులు
- అలసట
- ఏకాగ్రతా లోపం
- నెలసరి సమస్యలు
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు
- ఎముకల బలహీనత

ఇలా పెంచుకోవచ్చు

తగ్గిన ఈస్ట్రోజన్ హార్మోన్ మోతాదును పెంచుకునే ప్రత్యామ్నాయాలున్నాయి. ఇందుకోసం వైద్యుల పర్యవేక్షణలో



పిల్స్, జెల్స్ వాడుకోవచ్చు. అయితే సహజసిద్ధంగా శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తయ్యేలా మార్గాలను అనుసరించడం అన్నిటికంటే ఉత్తమం ఇందుకోసం...

- **ఫైటో ఈస్ట్రోజన్స్:** ఈ పోషకాలు ఉండే ఆహారాన్ని తింటూ ఉండాలి. టోఫు, సోయా, బఠాణీలు, ఆప్రికాట్స్ బ్రొకొలి, కాలీఫ్లవర్, ఫ్లాక్స్ సీడ్స్, గుమ్మడి విత్తనాలు, పెసర మొలకల్లో ఫైటో ఈస్ట్రోజన్స్ ఉంటాయి.
- **చక్కెర:** చక్కెర తినే అలవాటు హార్మోన్లలో అవకతవకలకు దారి తీస్తుంది. అలాగే చక్కెర ఈస్ట్ ఓవర్‌గ్రోత్‌ను ప్రేరేపిస్తుంది. ఈ ఈస్ట్‌కు సంబంధించిన టాక్సిన్లు హార్మోన్ ఉత్పత్తికి తోడ్పడే హార్మోన్ రిసెప్టార్ సైట్లను బ్లాక్ చేస్తాయి. కాబట్టి చక్కెర తినడం తగ్గించాలి.
- **మెగ్నీషియం:** ఈ పోషకంతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఈస్ట్రోజన్ ఉత్పత్తి పెరుగుతుంది. అలాగే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు (చిలగడ దుంపలు), సహజసిద్ధ మూలికలు (తులసి, సేజ్, పుదీనా)లను తీసుకుంటే సెల్ రిసెప్టివిటీ పెరిగి ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది.
- **బరువు:** తక్కువ బరువు ఉన్నా శరీరం సరిపడా ఈస్ట్రోజన్ హార్మోన్‌ను తయారు చేసుకోలేదు. హార్మోన్లను తయారు చేసుకోవడం కోసం శరీరంలో సరిపడా కొవ్వు ఉండడం అవసరం.
- **వ్యాయామం:** అవసరానికి మించిన వ్యాయామం ఈస్ట్రోజన్ ఉత్పత్తిని తగ్గిస్తే, క్రమం తప్పకుండా సరిపడా వ్యాయామం చేయడం వల్ల తగినంత ఈస్ట్రోజన్ శరీరంలో ఉత్పత్తి అవుతూ రొమ్ము కేన్సర్ నుంచి రక్షణ దక్కుతుంది. కాబట్టి క్రమం తప్పక పరిమితంగా వ్యాయామం చేయాలి.
- **ద్రవాహారం:** నీళ్లు, పండ్లు, కూరగాయల రసాలు, గ్రీన్ టీ, కొబ్బరినీళ్లు, మజ్జిగ తరచుగా తీసుకోవడం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్లిపోయి, ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గి, హార్మోన్ల ఉత్పత్తి మెరుగవుతుంది.

ఈస్ట్రోజన్ పెరిగితే?

కొందర్లో అవసరానికి మించి ఈస్ట్రోజన్ హార్మోన్ పెరుగుతుంది. ఈ పరిస్థితిని ఈస్ట్రోజన్ డామినెన్స్ అంటారు. దీన్ని కొన్ని లక్షణాల ఆధారంగా గుర్తించే వీలుంది. అవేంటంటే...

- కడుపు ఉబ్బరం
- భావోద్వేగాలు అదుపు తప్పడం
- తలనొప్పులు
- నెలసరి సమస్యలు
- అరిచేతులు, అరికాళ్లు చల్లబడడం
- బరువు పెరగడం
- వెంట్రుకలు రాలిపోవడం
- యాంగ్జయిటీ/ప్యానిక్ ఎటాక్స్
- అలసట
- జ్ఞాపకశక్తి సమస్యలు
- రొమ్ముల సలపరం



ఇయర్ ఇన్‌ఫెక్షన్స్



తాళాలు, పిన్నీసులు, అగ్గి పుల్లలు, ఇయర్ బడ్స్... ఏంటివన్నీ అనుకుంటున్నారా? చెవుల్లో దురదను దూరం చేయడం కోసం... ఎక్కువ మంది ఉపయోగించే సాధనాలివే! వీటితో దురద తగ్గడం మాట అటుంచి, చెవులకు శాశ్వత నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు వైద్యులు

ప్రమాదం పొంచి ఉంది

చెవుల్లో గులిమి సర్వసాధారణం. ఈ సేంద్రీయ పదార్థం దానంతటదే తయారవుతూ, దానంతటదే బయటకు వచ్చేస్తూ ఉంటుంది. జిడ్డు చర్మం వాళ్లకు జిడ్డుగా, పొడి చర్మం వాళ్లకు పొడిగా గులిమి తయారవుతూ ఉంటుంది. కానీ దీని గురించి అవసరానికి మించి బెంగ పడేవాళ్లు ఉంటూ ఉంటారు. దురద పెట్టిందనో, చెవిలో అసౌకర్యంగా ఉందనో, చేతికందిన వస్తువులతో చెవుల్లో తిప్పేసుకుంటూ ఉంటారు. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో గాల్లో తేమ ప్రభావం చెవుల్లోని గులిమి మీద కూడా పడుతూ ఉంటుంది. అది మరింత మెత్తబడి, ఫంగస్ పెరుగుదలకు అనువుగా మారిపోతుంది. దాంతో చెవిలో దురద, నొప్పి, దిబ్బెడ, బ్లాక్ అయిపోవడం, చెవిలో సమస్య ఉన్న వైపు తలనొప్పి, నోరు తెరవడంలో ఇబ్బంది, చెవిలో గుయ్యిమని శబ్దం రావడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. ఇది పెద్దల్లో, పిల్లల్లో ఇద్దర్లో కనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి.



చెవుల్లో పుల్లలు

చెవి నిర్మాణం ఇంగ్లీషు అక్షరం 'ఎస్' ఆకారంలో ఉంటుంది. మనం చెవిలో పిన్నీసులు, అగ్గిపుల్లలు, ఇయర్‌బడ్స్ లాంటివి ఏవి పెట్టినా అవి ఏ డైరెక్షన్‌లో వెళ్తుందో మనకు తెలియదు. వీటితో చెవి లోపల తిప్పుకోవడం వల్ల ఇయర్ కెనాల్, కర్ణభేరి.. రెండూ దెబ్బతింటాయి. మరీ ముఖ్యంగా వినికిడికి పనికొచ్చే చెవిలోని ఎముకలు కూడా దెబ్బతింటాయి. కొంతమందికి చెవిని శుభ్రం చేస్తూ ఉండాలనే నమ్మకం ఉంటుంది. దాంతో ఇయర్ బడ్స్‌తో చెవులను శుభ్రం చేస్తూ ఉంటారు. కానీ ఇలా చేయడం వల్ల గులిమిని మరింత లోపలికి నెట్టినవాళ్లమవుతాం! నిజానికి చెవుల్లోని గులిమి సహజసిద్ధంగా, దానంతట అదే బయటకు వచ్చేస్తుంది. దాన్ని శుభ్రం చేసుకోవడంలో తప్పు లేదు. ఒకవేళ పొడి గులిమి గట్టిపడి అడ్డుపడితే, వైద్యులను కలిసి శుభ్రం చేసుకోవాలి. డాక్టరుని కలిసే ముందు చెవిలో డ్రాప్స్ వేసుకుని వెళ్తే, మెత్తపడిన గులిమిని వైద్యులు తేలికగా తొలగించగలుగుతారు. ఇలా కాకుండా మనంతట మనమే శుభ్రం చేసుకునే ప్రయత్నం చేస్తే, పొడి గులిమి, చెవి లోపలే రాయిలా తయారైపోతుంది.

చెవిలో నూనె?

శరీర చర్మం ఎలా ఉంటుందో, చెవి లోపలి చర్మం కూడా అలాగే ఉంటుంది. మనది పొడి చర్మమైతే, మాయిశ్చరైజర్లు, నూనెలు పూసుకున్నట్టే, చెవి లోపల చర్మాన్ని కూడా నూనెతో మాయిశ్చరైజ్ చేయడం మంచిదే! అయితే అందుకోసం ప్రతి రోజూ, చెవిలో నూనె చుక్కలు వేసుకోవలసిన అవసరం లేదు. నెలలో ఒకట్రెండుసార్లు వేసుకుంటే సరిపోతుంది. అయితే అప్పటికే చెవి ఇన్‌ఫెక్షన్ ఉన్నవాళ్లు నూనె వేసుకోకూడదు. కొందరికి చెవిలో గులిమి పొడిగా ఉంటే, ఇంకొందరికి జిగటగా ఉంటుంది. పొడిగా ఉన్న వాళ్లకు చెవిలో దురద ఉండొచ్చు. ఇలాంటివాళ్లు చెవిలో నూనె వేసుకోవచ్చు.

ఫంగస్‌లు పెరిగితే....

స్నానం చేసినప్పుడు చెవిలోకి వెళ్లిన నీళ్లను శుభ్రం చేసుకోవడం కోసం ఇయర్‌బడ్స్‌ను ఉపయోగిస్తూ ఉంటాం. కానీ నిజానికి ఇలా చేయడం వల్ల ఇన్‌ఫెక్షన్‌ను మరింత ప్రేరేపించిన వాళ్లమవుతాం! అప్పటికే చెవిలో ఫంగస్ పెరుగుతుంటే, నీళ్లు తగలడం వల్ల దాని ఉధృతి పెరిగిపోతుంది. కాబట్టి చెవి ఇన్‌ఫెక్షన్ లక్షణాలు పదే పదే వేధిస్తుంటే వెంటనే వైద్యులను కలవాలి. మరీ ముఖ్యంగా చెవిలో చీము సమస్య కలిగి ఉన్నవాళ్లలో ఇయర్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ. అలాగే మధుమేహులు, కీళ్లవాతం, అవయవ మార్పిడి చేయించుకున్నవాళ్లు, ఇతరత్రా తీవ్ర వ్యాధుల కోసం స్టిరాయిడ్స్ తీసుకునే వాళ్లలో వ్యాధినిరోధకశక్తి స్వతహాగానే తగ్గిపోతుంది. ఇలాంటి వాళ్లలో కూడా చెవి ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ. ఇలాంటి వాళ్లు ఇన్‌ఫెక్షన్ మొదలైన వెంటనే వైద్యులను కలవాలి. వైద్యులు ఎండోస్కోపీతో చెవిలో పెరుగుతున్న ఫంగస్‌ను కనిపెట్టి, నోటి మాత్రలు, ఇయర్ డ్రాప్స్‌తో సమస్యను అరికట్టగలుగుతారు. పుట్టగొడుగుల్లా పెరిగే ఈ ఫంగస్ కొందర్లో నల్లగా, ఇంకొందర్లో తెల్లగా, పసుపుపచ్చగా కనిపిస్తుంది. క్యాండిడా, ఆస్పర్‌జిల్లస్ మొదలైన ఫంగస్‌లను వైద్యులు మొదట సక్షన్‌తో క్లీన్ చేసి, యాంటీ ఫంగల్ ఇయర్‌డ్రాప్స్‌ను సూచిస్తారు. వీటికి తోడు నోటి మాత్రలు కూడా వాడుకుంటే ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోతుంది. కొందరికి చెవి వాపు ఉంటే, వాళ్లకు వైద్యులు ఇయర్ విక్‌ను సూచిస్తారు. దీన్ని చెవికి అమర్చి, ఇయర్ డ్రాప్స్ వేసుకోవచ్చు.

పిల్లల్లో ఇలా...

పిల్లల్లో ఈ సమస్య ఎక్కువ. పదే పదే జలుబు



చేయడం వల్ల ముక్కులో నుంచి చెవి వరకూ దారి తీసే ట్యూబ్ ద్వారా చెవి ఇన్‌ఫెక్షన్ మొదలవుతుంది. ఇలాంటప్పుడు విపరీతమైన నొప్పితో పిల్లలు ఏడుస్తూ ఉంటారు. ముఖ్యంగా రాత్రుళ్లు ఏడుస్తూ నిద్ర లేస్తూ ఉంటారు. తల్లులు పసి పిల్లల నోట్లో సిప్పర్‌ను పెట్టి రాత్రుళ్లు అలాగే పడుకోబెట్టేస్తూ ఉంటారు. ఇలాంటి పిల్లల్లో కూడా మధ్య చెవి ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే పిల్లల్లో అడినాయిడ్స్, టాన్సిల్స్ సమస్యలు కూడా ఎక్కువగా ఉంటాయి. వీళ్లలో జలుబు ఎక్కువ రోజులు తగ్గకపోవడం వల్ల చెవి ఇన్‌ఫెక్షన్లు వస్తూ ఉంటాయి. అలర్జీలు ఉన్న పిల్లల్లో దగ్గు, జలుబుల వల్ల, చెవి ఇన్‌ఫెక్షన్లు పెరిగి, కర్ణభేరికి రంధ్రం పడి, చీము కారే పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. చిన్న పిల్లలను తరచూ చెవి ఇన్‌ఫెక్షన్లు వేధిస్తూ ఉంటే, స్కానింగ్ ద్వారా అడినాయిడ్స్, సైనసైటిస్, టాన్సిళ్లను పరిశీలించాల్సి ఉంటుంది. ముక్కు ఎముకకు ఇన్‌ఫెక్షన్ సోకలేదని కూడా నిర్ధారించుకోవాలి.

ఇయర్ ఫోన్స్ వాడుతున్నారా?

ఇయర్‌ఫోన్స్ వాడే వాళ్లలో చెవి నుంచి బయటకొచ్చే వ్యాక్స్ లోపలికి నెట్టబడుతూ ఉంటుంది. వృత్తిపరంగా ఎక్కువ సమయాల పాటు ఇయర్ ఫోన్స్, బడ్స్ వాడేవాళ్లు ప్రతి రెండు నెలలకోసారి వైద్యులను కలుస్తూ చెవులను పరీక్షించుకుంటూ ఉండాలి. అలాగే ఇయర్ బడ్స్‌ను ఎక్కువగా వాడేటప్పుడు, చెవి లోపల తేమ పెరిగి, ఫంగస్‌కు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. కాబట్టి ఇయర్‌ఫోన్స్, బడ్స్‌ను తరచూ స్టెరిలైజ్ చేసుకుంటూ ఉండాలి. అలాగే హియరింగ్ ఎయిడ్స్ వాడుకునే పెద్దలు, పిల్లల విషయంలో కూడా ఇదే తరహా జాగ్రత్తలు పాటించాలి.



డాక్టర్ పి.వి.ఎల్.ఎన్ మూర్తి
సీనియర్ కన్సల్టెంట్ ఇఎన్‌టి,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.

ఆయుర్వేదం

కీళ్ల నొప్పులా?



కీళ్లు వాచి, కదల్చలేనంతగా నొప్పి పెడుతూ ఉంటే ఆయుర్వేద చికిత్సలను ఆశ్రయించవచ్చు. వాపు తగ్గి, కదలికలు సులువయ్యేలా చేసే ఆయుర్వేద చికిత్సల్లో ఇవి కొన్ని!

- **ఉలవలు:** 100 గ్రాముల అడవి ఉలవలను పొడి చేసి, 50 గ్రాముల నువ్వుల నూనె కలిపి ముద్ద చేయాలి. ఈ ముద్దతో కీళ్ల మీద పట్టు వేసి, పలుచని వస్త్రం చుట్టాలి. ఇలా రాత్రంతా ఉంచితే ఉదయానికి వాపు, నొప్పి తగ్గుతాయి.
- **అందుగ బంక:** అందుగ చెట్టు బంక సేకరించి, 10 గ్రాముల బంకను 100 మిల్లీ లీటర్ల నీళ్లలో కలిపి, సగం అయ్యే వరకూ మరిగించి, చల్లార్చాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ నీళ్లను తాగాలి. ఇలా వారం రోజులు తాగితే కీళ్ల నొప్పులు అదుపులోకి వస్తాయి.
- **ఆముదం వేరడు:** ఆముదం చెట్టు వేరడు 100 గ్రాములు, రేల చెట్టు వేర్లు 100 గ్రాములు తీసుకుని, ఎండబెట్టి, పొడి చేసుకోవాలి. 30 గ్రాముల చూర్ణాన్ని 200 మిల్లీ లీటర్ల నీళ్లలో కలిపి రాత్రంతా కదలకుండా ఉంచాలి. ఉదయాన్నే ఈ నీటిని పావు వంతు అయ్యేవరకూ మరిగించి, వడగట్టి తాగాలి. ఇలా 20 రోజుల పాటు క్రమంతప్పక చేస్తే కీళ్లనొప్పులు తగ్గుముఖం పడతాయి.

హోమియో

రాళ్లు కరుగుతాయి!



మూత్రపిండాల్లో రాళ్లను హోమియో మందులతో కరిగించే వీలుంది. మూత్రాశయం, మూత్రనాళం... ఇలా మూత్ర పిండాల్లో రాళ్లు ఎక్కడ ఏర్పడినా, వాటిని కరిగించడానికి తోడ్పడే సమర్థమైన హోమియో మందులు ఇవే!

- **బెర్బెరిస్ వల్గారిస్:** దీన్ని మదర్ టింక్చర్ రూపంలో వాడి మూత్రపిండాలకు సంబంధించిన ఏ రకానికి చెందిన రాయినైనా కరిగించే వీలుంది.
- **లైకోపోడియం:** కుడి వైపు మూత్రపిండంలో రాళ్లను కరిగించడంలో దిట్ట ఇది. మూత్రవిసర్జన చేస్తున్నప్పుడు నొప్పి తగ్గే లక్షణం ఉన్నవారికి ఈ మందు తోడ్పడతుంది.
- **హైడ్రాంజే ఆర్బొరెసెన్స్:** ఈ మందుకు 'స్టోన్ బ్రేకర్' (రాళ్లను పగలగొట్టేది) అని పేరు. ఈ మందు మూత్రనాళం, మూత్రాశయాల్లో రాళ్లను నలుగగొట్టి, మూత్రం ద్వారా వాటిని బయటకు వెళ్లేలా చేయగలదు.
- **సర్సపరిల్లా:** మూత్రంలో ఇసుకను పోలిన రాళ్లకు ఇది దివ్యమైన ఔషధం.

యోగా




మలబద్ధకం మాయం!

మలబద్ధకం అరుదుగా తలెత్తడం సహజం. అయితే లాక్‌డౌన్ మూలంగా జీవనశైలి క్రమం తప్పి, ఆ కారణంగా మలబద్ధకం తలెత్తడం ఎక్కువమందిని తరచుగా వేధిస్తున్న ప్రస్తుత సమస్య. దీన్నే 'క్వారంటైన్ కాన్‌స్టిపేషన్' అని అంటున్నాం. ఈ ఇబ్బంది తొలగించడానికి ఉపయోగపడే యోగాసనాలు ఉన్నాయి. అవేంటంటే...

- **పవనముక్తాసనం:** విశ్రాంత స్థితిలో వెల్లకిలా పడుకోవాలి. మోకాళ్లను మడిచి, పొత్తికడుపు దగ్గరకు తీసుకురావాలి. రెండు చేతులతో మోకాళ్లను బిగించి, దగ్గరకు లాక్కోవాలి. తలను పైకెత్తి, గడ్డం ఛాతీకి ఆనించాలి. ఈ భంగిమలో 5 సెకండ్ల పాటు ఉండి, తిరిగి యథాస్థితికి రావాలి.
- **మాలాసనం:** కాళ్ల మధ్య ఎడం ఉండేలా నిలబడాలి. మోకాళ్లు వంచి, నేల మీద స్క్వాట్ పొజిషన్‌లో కూర్చోవాలి. చేతులు రెండు జోడించి, మోచేతులు మోకాళ్లకు ఆనేలా శరీరం దగ్గరకు చేతులను తీసుకురావాలి. వెన్ను, మెడ నిటారుగా ఉంచి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. ఈ భంగిమలో ఐదు సార్లు శ్వాస తీసుకునేంత సమయం ఉండి యథాస్థితికి రావాలి.
- **బాలాసనం:** మోకాళ్ల మీద కూర్చుని, ముందుకు వంగాలి. పొత్తికడుపు తొడలకు తగిలేలా, తల నేల మీద ఆనేలా ముందుకు వంగాలి. రెండు చేతులను తల మీదుగా చాపి, నేలను తాకించాలి. ఈ భంగిమలో ఐదు సార్లు శ్వాస తీసుకునేంత సమయం ఉండి యథాస్థితికి రావాలి.

అప్పుడే పుట్టిన పసిపాపలు గాజుబొమ్మల లాంటివారు. వారిని అతి జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది. కొన్ని సార్లు పిల్లలకు కొన్ని రకాల సమస్యలు వస్తూ ఉంటాయి. వాటిలో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎక్కువ! ఈ సమస్యలకు సంబంధించిన విషయాలను మెడికవర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ పిడియాట్రిషియన్ డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగె- 'డాక్టర్'కు వివరించారు.



శిశువులకు కాలుష్యం ప్రమాదమే!

పిల్లలలో ఎక్కువగా వచ్చే శ్వాసకోశ సమస్యలు ఏమిటి?

పిల్లలు శ్వాస పీల్చుకొనే సమయంలో శబ్దం చేస్తున్నా.. శ్వాస పీల్చుకోనే గుండె దగ్గర ఉన్న కండరాలు ఎక్కువగా కదులుతూ ఇబ్బంది పెడుతున్నా.. వారికి సమస్య ఉందని గుర్తించి వెంటనే చికిత్స అందిస్తాం. సాధారణంగా ఒక బేబీ పుటడానికి 40 వారాలు పుడుతుంది. 34 వారాల కన్నా తక్కువ వయస్సు ఉన్న పిల్లలు పుడితే వారికి శ్వాస కోశ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

మన చుట్టూ ప్రపంచంలో కాలుష్యం బాగా పెరిగిపోతుంది.. దీని ప్రభావం నవజాత శిశువులపై ఎలా ఉంటుంది?

బిడ్డ కడుపులో ఉండగా తల్లులు పొగ త్రాగితే శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. ఈ మధ్య జరిగిన అధ్యయనాలలో- తక్కువ బరువున్న పిల్లలు నెలలు నిండకుండా పుట్టడానికీ.. కాలుష్యానికి నేరుగా సంబంధం ఉందని తేలింది. తల్లులు కాలుష్యం బారిన పడినప్పుడు అబార్షన్స్ కూడా జరిగే అవకాశముంది. ప్రపంచంలో పది మంది పిల్లలు పుడితే వారిలో ఒకరు పూర్తిగా ఎదగకుండా పుడతారు. అలాంటి వారికి చికిత్స అవసరమవుతుంది.

తక్కువ బరువు ఉన్నవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువంటున్నారు కదా..వారిని రక్షించటానికి అవసరమైన వైద్య సదుపాయాలు, చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయా?

నవజాత శిశువులను రక్షించటానికి అనేక పరికరాలు, ట్రీట్‌మెంట్స్, ప్రొటోకాల్స్ అభివృద్ధి చెందాయి. ఉదాహరణకు సాధారణంగా ఒక బేబీ పుట్టినప్పుడు 2 నుంచి మూడు కేజీల వరకూ ఉంటుంది. కొన్ని సార్లు పూర్తిగా ఎదగకుండానే పిల్లలు పుడుతూ ఉంటారు. ఉదాహరణకు ఈ మధ్యనే మా దగ్గర 24 వారాలు ఎదిగిన ఒక బేబీ పుట్టింది. ఈ పసికూన బరువు 500 గ్రాములు. ఇలాంటి వారిని జాగ్రత్తగా పెంచటానికి కొన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అంతే కాదు. కొత్త కొత్త మందులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు అప్పుడే పుట్టిన పిల్లల్లో ఊపిరితిత్తులు సరిగ్గా ఎదగవు. అవి సరిగ్గా ఎదగటానికి ఒక ప్రత్యేకమైన ఇంజక్షను ఉంది. దీనిని నేరుగా ఊపిరితిత్తులకే ఇస్తాం. దీని వల్ల పిల్లల ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేస్తాయి.

పూర్తిగా ఎదగని బేబీలను పెంచి వారిని ఆరోగ్యంగా ఇంటికి పంపినప్పుడు ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. సాధారణంగా పుట్టిన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆ తర్వాత వారికి ఎటువంటి సమస్యలు రావు.

తల్లి గర్భంలో ఉన్నప్పుడే పిల్లలకు ఉన్న అన్ని సమస్యలు తెలిసిపోతాయా?

అత్యాధునికమైన అల్ట్రా సౌండ్ పద్ధతిలో పిల్లల్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయం తెలుస్తుంది. ఈ మధ్యకాలంలో ఫీటల్ మెడిసెన్ అనే ప్రత్యేక విభాగం అభివృద్ధి చెందింది. దీని ద్వారా గర్భస్థ శిశువుకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాన్ని పుట్టక ముందే తెలుసుకోగలుగుతాం. ఒక సారి ఏదైనా ఆరోగ్య సమస్య ఉందనే విషయం తెలిస్తే- బిడ్డ పుట్టిన వెంటనే తగిన వైద్యాన్ని అందించటానికి సిద్ధంగా ఉంటాం. ఉదాహరణకు ఒక బిడ్డకు సమస్య ఉందనే విషయాన్ని గైనకాలిజిస్ట్ కనుగొన్నారనుకుందాం. అప్పుడు కడుపులో ఉన్న బిడ్డ లంగ్స్ బలోపేతం అవటానికి వీలుగా తల్లికి కొన్ని స్టిరాయిడ్స్ ఇస్తారు. ఇలాంటి చికిత్సలతో పాటుగా- ఈ మధ్య కాలంలో అత్యాధునికమైన వెంటిలేటర్లు, పిల్లలకు ఏ మాత్రం అసౌకర్యం కల్గించని విధంగా ఉండే పరికరకాలు అందుబాటులోకి వచ్చాయి.

పిల్లలకు ఎలాంటి జన్యుపరమైన సమస్యలు ఏర్పడతాయి?

జన్యుపరమైన సమస్యలు కూడా వస్తూ ఉంటాయి. ఉదాహరణకు ఇది వరకు జన్యువుల వల్ల వచ్చే సిస్టిక్ ఫైబ్రోసిస్ అనే సమస్య విదేశాలలో ఎక్కువగా కనిపించేది. ఈ సమస్య ఉన్న వారిలో ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేయవు. ఈ మధ్యకాలంలో మన దగ్గర కూడా ఇలాంటి కొన్ని కేసులు వస్తున్నాయి.

పుట్టిన బిడ్డలతో పాటుగా వారి తల్లులను కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. సాధారణంగా బిడ్డ పుట్టిన తర్వాత తల్లులు విపరీతమైన ఒత్తిడితో ఉంటారు. బిడ్డకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉందని తెలిస్తే- ఆ ఒత్తిడి మరింతగా పెరుగుతుంది. అందువల్ల వారికి తగిన కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది.



డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగె
హెచ్‌ఓడీ, నియోనెటాలజీ మరియు పీడియాట్రిక్స్,
మెడికవర్ హాస్పిటల్,
హైదరాబాద్

స్పోర్ట్స్

విజయవాడ ● మంగళవారం 2 జూలై 2024



అమ్మాయిలు అదరగొట్టారు

భారత్ ఘన విజయం । 10 వికెట్లతో దక్షిణాఫ్రికా చిత్తు । వోల్వార్ట్ శతకం

2 టెస్ట్‌ల్లో మనోళ్లకిది రెండో పది వికెట్ల విజయం. 2002లో సౌతాఫ్రికాపైనే అన్ని వికెట్లతో నెగ్గింది.

చెన్నై : దక్షిణాఫ్రికా మహిళలతో ఏకైక టెస్ట్‌లో భారత్ 10 వికెట్లతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ 232/2 స్కోరుతో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీలు 373 పరుగులకు ఆలౌటయ్యారు. కెప్టెన్ వోల్వార్ట్ (122), డి క్లెర్క్ (61) పోరాడారు. అనంతరం విజయానికి భారత్ 37 పరుగులు చేయాల్సి ఉండగా..ఓపెనర్లు షఫాలీ వర్మ (24 నాటౌట్), శుభా సతీష్ (14 నాటౌట్) 10 ఓవర్లలోపే లాంఛనాన్ని పూర్తి చేశారు. మొత్తం 10 వికెట్లు తీసిన స్పిన్నర్ స్నేహ్ రాణా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ శుక్రవారం నుంచి ఇక్కడే జరగనుంది.

పోరాడిన సఫారీలు

మ్యాచ్‌ను కనీసం డ్రా చేసేందుకు సౌతాఫ్రికా పోరాడింది. 105 పరుగులు వెనుకంజలో ఉండి, రెండో ఇన్నింగ్స్‌లో ఎనిమిది వికెట్లు చేతిలో ఉన్న దశలో..వోల్వార్ట్, డి క్లెర్క్, కాప్ భారత బౌలర్లను ఒకింత నిలువరించారు. వోల్వార్ట్, కాప్ మూడో వికెట్‌కు 58 రన్స్ జోడించారు. ఈ క్రమంలో వోల్వార్ట్ శతకం పూర్తి చేసింది. అయితే కాప్‌ను దీప్తిశర్మ, టకెర్‌ను స్నేహ్ రాణా అవుట్ చేయడంతో పర్యాటక జట్టు 266/4తో నిలిచింది. ఆపై వోల్వార్ట్ కూడా నిష్క్రమించడంతో భారత్ విజయానికి చేరువైంది. కానీ డిక్లెర్క్..జాఫ్టా ఇతర లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సాయంతో ఇన్నింగ్స్ నడిపించింది. దాంతో టీ విరామానికి దక్షిణాఫ్రికా 336/8 స్కోరు సాధించింది. అప్పటికి డిక్లెర్క్ క్రీజులో ఉండడంతో మరో సెషన్ ఆడి మ్యాచ్‌ను డ్రా చేసుకొనేలా కనిపించింది. కానీ భారత బౌలర్లు విజృంభించి మిగిలి రెండు వికెట్లు పడగొట్టడంతో సౌతాఫ్రికా ఆలౌటై స్వల్ప ఆధిక్యం సాధించింది.

సంక్షిప్తస్కోర్లు : భారత్ 603/6 డిక్లేర్డ్, 37/0 (షఫాలీ 24 నాటౌట్, శుభ 13నాటౌట్); దక్షిణాఫ్రికా 266, 373 (వోల్వార్ట్ 122, లుస్ 109, డిక్లెర్క్ 61, కాప్ 31, సినాలో 15, రాజేశ్వరి 2/55, దీప్తిశర్మ 2/85, స్నేహ్ రాణా 2/111).

'లియాన్' విజేత ఆనంద్



లియోన్ (స్పెయిన్): ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ కెరీర్‌లో పదోసారి లియాన్ మాస్టర్స్ టైటిల్ నెగ్గాడు. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఆనంద్ 3-1తో శాంటోస్ (స్పెయిన్) పై నెగ్గాడు. ఆనంద్ 28 సంవత్సరాల కిందట 1996లో తొలిసారి ఈ టైటిల్ సాధించాడు. ఈ టోర్నీలో ఇరిగేసి అర్జున్, టోపలోవ్ కూడా తలపడ్డారు. అర్జున్ సెమీస్‌లో ఓటమి పాలయ్యాడు.

ఐసీసీ టీమ్‌లో మనోళ్లు ఆరుగురు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లతో ఐసీసీ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'ను ఎంపిక చేసింది. ఇందులో సగం జట్టు భారత ఆటగాళ్లతోనే నిండిపోవడం విశేషం. అయితే స్టార్ బ్యాటర్ విరాట్‌కు మాత్రం ఇందులో చోటు దక్కలేదు.

ఐసీసీ టీ20 జట్టు: రోహిత్, సూర్యకుమార్, హార్దిక్, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్ (భారత్), ఫరూఖీ, గుర్బాజ్, రషీద్ (అఫ్ఘాన్), పూరన్ (విండీస్), స్టొయినిస్ (ఆసీస్). 12వ ఆటగాడు: నోకియా (సౌతాఫ్రికా).

సహజకు ఐటీఎఫ్ టైటిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయి వై.సహజ ఐటీఎఫ్ 15కే ఇంటర్నేషనల్ టెన్నిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన ఫైనల్లో సహజ 6-4, 7-6తో స్థానిక క్రీడాకారిణి జు ఆమీని ఓడించింది. దీంతో సహజ జాతీయ ర్యాంకింగ్స్‌లో నెంబర్ 2 స్థానానికి, వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 300వ స్థానానికి చేరింది.

'యూరో' క్వార్టర్స్‌లో ఫ్రాన్స్

కొలోగ్నె (జర్మనీ): టైటిల్ ఫేవరెట్ ఫ్రాన్స్.. యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్వార్టర్స్‌కు చేరుకొంది. సోమవారం జరిగిన రౌండ్-16లో ఫ్రాన్స్ 1-0తో బెల్జియంపై గెలిచింది. మరో నాకౌట్ మ్యాచ్‌లో స్పెయిన్ 4-1తో జార్జియాను చిత్తు చేసింది.

కోర్టులో కుప్పకూలి చైనా షట్లర్ మృతి

జకార్తా: చైనాకు చెందిన 17 ఏళ్ల షట్లర్ ఝాంగ్ ఝిజీ మ్యాచ్ ఆడుతూ కోర్టులోనే కుప్పకూలి మరణించాడు. ఆసియా జూ. చాంపియన్‌షిప్స్‌లో కజుమా (జపాన్)తో మ్యాచ్ తొలి గేమ్ సందర్భంగా గుండెపోటుతో ఝాంగ్ కోర్టులో కుప్పకూలాడు.

డైమండ్ లీగ్‌కు నీరజ్ దూరం

న్యూఢిల్లీ: జావెలిన్ వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా, పారిస్ డైమండ్ లీగ్ నుంచి వైదొలిగాడు. తొడ కండరాల్లో కొంచెం నొప్పిగా ఉండడంతో ఈ పోటీలను తప్పుకుంటున్నట్టు నీరజ్ వెల్లడించాడు. జావెలిన్ విసిరేప్పుడు కాలిపై పడుతున్న ఒత్తిడిని తగ్గించు కునేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నానని నీరజ్ చెప్పాడు. బల్లెం విసురుతున్న సమయంలో తొడ కండరాలు, గజ్జల్లో ఒత్తిడి ఏర్పడి, కొంచెం అసౌకర్యంగా ఉంటోందని తెలిపాడు.

చిక్కుకుపోయిన టీమిండియా

బార్బడోస్‌కు హరికేన్ ముప్పు । ఎయిర్‌పోర్టు మూసివేత

బార్బడోస్ : టీ20 వరల్డ్ కప్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న భారత జట్టుకు ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితి ఎదురైంది. బార్బడోస్ అత్యంత ప్రమాదకర హరికేన్ ముప్పును ఎదుర్కోవడంతో ఆ నగరంలో కర్ఫ్యూ విధించారు. విమానాశ్రయాన్ని మూసి వేయడంతో టీమిండియా సహా భారత మీడియా ప్రతినిధులంతా అక్కడే చిక్కుకుపోయారు. బెరిల్ హరికేన్ ధాటికి బలమైన గాలులతో కూడిన భారీ వర్షం నగరాన్ని ముంచెత్తుతోంది. దాంతో విమానాల రాకపోకలను రద్దు చేశారు. వరల్డ్ కప్ ఫైనల్ శనివారమే ముగిసినా..ఆదివారం రిజర్వ్ డే కావడంతో ప్రయాణానికి వీలుకాలేదు. ఇక..సోమవారంనాడు జట్టు స్వదేశానికి బయలుదేరాల్సి ఉన్నా..హరికేన్ కారణంగా ప్రయాణం రద్దయింది. భారత జట్టు సభ్యులు, సహాయ సిబ్బంది బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా తదితరులంతా హోటల్లోనే ఉండిపోయారు. భారత జట్టును చార్టర్డ్ విమానంలో బార్బడోస్ నుంచి నేరుగా ఢిల్లీ తీసుకొచ్చేందుకు బీసీసీఐ ప్రయత్నాలు చేపట్టింది. అయితే ఇక్కడి పరిస్థితులు కుదుటపడి, విమానాశ్రయం తెరిచాకనే అది సాధ్యమవుతుంది.

శ్రీలంక టూర్‌కు కొత్త కోచ్

» బోర్డు కార్యదర్శి జైషా



న్యూఢిల్లీ: భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లేముందే కొత్త కోచ్‌ను ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి జైషా తెలిపాడు. టీమిండియా ఈనెల 27 నుంచి లంకతో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. అయితే రాహుల్ ద్రవిడ్ స్థానంలో బాధ్యతలు తీసుకునేదెవరనేది మాత్రం తేల్చలేదు. ఇప్పటికే క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ముందు గంభీర్, డబ్ల్యూవీ రామన్ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కోచ్, సెలెక్టర్ల ఎంపిక త్వరలోనే జరుగుతుంది. సీఏసీ ఆ పదవికి రెండు పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది. ప్రస్తుతానికి లక్ష్మణ్ జింబాబ్వేకు వెళతాడు. శ్రీలంక టూర్ మాత్రం కొత్త కోచ్ ఆధ్వర్యంలోనే జరుగుతుంది' అని కరీబియన్ దీవుల్లో రోహిత్ బృందంతో పాటే ఉన్న జైషా పేర్కొన్నాడు.

సీడెడ్ల శుభారంభం

వింబుల్డన్

లండన్ : వింబుల్డన్‌లో పురుషులు, మహిళల విభాగంలో సీడెడ్‌లు శుభారంభం అందుకున్నారు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మూడో సీడ్ అల్కారజ్ 7-6 (3), 7-5, 6-2తో మార్క్ లజాల్‌పై, ఐదో సీడ్ మెద్వెదెవ్ 6-4, 6-4, 6-2తో కొవసెవిక్‌పై, ఎనిమిదో సీడ్ కాస్పెర్ రూడ్ 7-6 (2), 6-4, 6-5తో బోల్ట్‌పై, 10వ సీడ్ దిమిత్రోవ్ 6-3, 6-4, 7-5తో లజోవిక్‌పై నెగ్గి ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ పోలిని 7-5, 6-3తో టోర్మోపై, 9వ సీడ్ సకారి 6-3, 6-1తో కెస్లర్‌పై, 14వ సీడ్ కసాట్కినా 6-3, 6-0తో జాంగ్ షూయ్‌పై, 18వ సీడ్ కోస్త్యుక్ 6-3, 6-2తో గ్రమ్‌కోవాపై నెగ్గి రెండో రౌండ్‌లో ప్రవేశించారు.

చలో జింబాబ్వే..

» 6 నుంచి 5 టీ20ల సిరీస్

» గిల్ కెప్టెన్సీలో బరిలోకి..



న్యూఢిల్లీ: టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత విజయం తర్వాత టీమిండియా మరో ధనాధన్ సిరీస్‌కు సిద్ధం కాబోతోంది. ఇందుకోసం జట్టు జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడి హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఈనెల 6 నుంచి ఇరు జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. ఈ జట్టులో సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి ఐపీఎల్‌లో రాణించిన ప్లేయర్లకు చోటిచ్చారు. ఇక శుభ్‌మన్ గిల్‌కు జట్టు పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే. టీ20 వరల్డ్ కప్‌లో జట్టుతో ప్రస్తుతం బార్బడోస్‌లో ఉన్న యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శివమ్ దూబే, రింకూ సింగ్ ఈ టూర్‌కు ఎంపికయ్యారు. ఏకంగా మూడు స్థానాలు ఖాళీ కావడంతో వాటిని భర్తీ చేస్తూ, టీ20 టీమ్‌లో నిలకడైన స్థానం కోసం యువ ఆటగాళ్లు పోటీపడనున్నారు. ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్‌కు తొలిసారిగా జాతీయ జట్టులో చోటు దక్కినా గాయంతో దూరం కావాల్సివచ్చింది. అతడి స్థానంలోనే దూబే ఎంపిక జరిగింది. మరోవైపు ఈ సిరీస్‌కు వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించనున్నాడు. మరోవైపు సికిందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే జట్టును సోమవారం ప్రకటించారు. ఇక ఐదు మ్యాచ్‌లు ఈనెల 6,7,10,13,14 తేదీల్లో జరగనున్నాయి. మ్యాచ్‌లన్నీ సాయంత్రం 4.30 నుంచి హరారే వేదికగా జరుగుతాయి.

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, అభిషేక్, రింకూ, శాంసన్, ధ్రువ్ జురెల్, దూబే, పరాగ్, వాషింగ్టన్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్.

విరాట్‌కు ద్రవిడ్ టార్గెట్





న్యూఢిల్లీ: కోచ్‌గా చివరి రోజు రాహుల్ ద్రవిడ్.. కోహ్లీకి అంతిమ లక్ష్యాన్ని నిర్దేశించాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ నెగ్గాలని సూచించాడు. కోహ్లీ కెరీర్‌లో వైట్ బాల్ చాంపియన్‌షిప్‌లు వన్డే, టీ20 వరల్డ్‌కప్‌లతోపాటు చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ గెలిచిన రికార్డుంది. ఇక, మిగిలింది రెడ్ బాల్ టెస్ట్ చాంపియన్‌షిప్ మాత్రమే. ఈ ఉద్దేశంతోనే ద్రవిడ్ అలా టార్గెట్ సెట్ చేసి ఉంటాడు.

కప్పు ఎగురుకుంటూ వెళ్తుంటే.. చటుక్కున అందుకొన్నా..!

మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో సౌతాఫ్రికా విజయానికి 16 పరుగులు కావాల్సిన సమయంలో.. మిల్లర్ కొట్టిన బంతిని బౌండ్రీలైన్ వద్ద సూర్యకుమార్ అద్భుత రీతిలో అందుకోవడం తెలిసిందే. ఈ క్యాచ్‌ను 1983 వరల్డ్ కప్‌లో రిచర్డ్స్‌ను కపిల్‌దేవ్ అవుట్ చేసిన క్యాచ్‌తో పోల్చుతున్నారు. సూర్య సమయస్ఫూర్తికి జేజేలు పలుకుతున్నారు. అయితే, మ్యాచ్ అనంతరం ఆ క్యాచ్ గురించి సూర్యను మీడియా ప్రశ్నించగా.. 'ఆ క్షణంలో ఏమీ ఆలోచించలేదు. నాకు కనిపించింది ఒక్కటే..! వరల్డ్‌కప్ ఎగురుకుంటూ దూరంగా వెళ్తోంది. ఎలాగైనా ఒడిసిపట్టాలనుకొన్నా. అయినా నేను నిమిత్త మాత్రుణ్ణి. అదంతా దేవుడి ప్రణాళిక' అని చెప్పాడు.

పక్కనే సోదరుడు!

టీ20 వరల్డ్‌కప్ గెలిచిన అనంతరం కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరూ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. వీరిద్దరిని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. అయితే, రోహిత్ తల్లి పూర్ణిమ చేసిన పోస్టు మరింత వైరల్‌గా మారింది. విరాట్‌ను రోహిత్ సోదరుడిగా సంబోధించడం ఫ్యాన్స్ హృదయాలను తాకింది. 'టీ20 క్రికెట్‌లో ఆల్ టైమ్ గ్రేట్‌లు' అని రోహిత్, కోహ్లీ కలసి ఉన్న ఫొటోకు పూర్ణిమ క్యాప్షన్ పెట్టారు. 'భుజాలపై కూతురు. యావద్దేశం అతడి వెంటే. పక్కనే సోదరుడు' అనే సందేశాన్ని ఫొటో కింద రాసి షేర్ చేశారు.



బార్బడోస్ బీచ్‌లో..

టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన అనంతరం మెగా ట్రోఫీతో రోహిత్ శర్మ బార్బడోస్ బీచ్‌లో అఫీషియల్ ఫొటో షూట్‌లో పాల్గొన్నాడు. వీటిని ఎక్స్‌లో షేర్ చేసిన బీసీసీఐ.. 'మిషన్ విజయవంతమైంది. మనం ప్రపంచ చాంపియన్లం. కెప్టెన్.. నువ్వు సాధించావ్' అని క్యాప్షన్ పెట్టింది.

బిజినెస్

జూన్ నెల జీఎస్‌టీ వసూళ్లు 1.74 లక్షల కోట్లు

ఇక నుంచి అధికారికంగా వసూళ్ల వివరాల వెల్లడి బంద్

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లలో వృద్ధి రేటు కొనసాగుతోంది. జూన్ నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లుగా నమోదైనట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 7.7 శాతం ఎక్కువ. అయితే మే నెల వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం గత నెల వసూళ్లలో పెద్ద పెరుగుదల లేదు. ఈ నెల నుంచి ఇక అధికారికంగా ప్రతి నెలా 1వ తేదీన అంతకు ముందు నెల జీఎస్‌టీ వసూళ్ల సమగ్ర వివరాల విడుదలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఫుల్‌స్టాప్ పెడుతోందని ఆ వర్గాలు తెలిపాయి. వివిధ సోషల్ మీడియా చానల్స్ ద్వారా టూకీగా మాత్రమే ఇక ఈ వివరాలు విడుదలవుతాయి. ఇందుకు కారణం మాత్రం కేంద్ర ప్రభుత్వం చెప్పడం లేదు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లోనే జీఎస్‌టీ వసూళ్లు రూ.5.57 లక్షల కోట్లకు చేరాయి. జూన్‌లో వసూలైన రూ.1.74 లక్షల కోట్ల జీఎస్‌టీలో సీజీఎస్‌టీ ద్వారా రూ.39,586 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ద్వారా రూ.33,548 కోట్లు వసూలయ్యాయి.

జీఎస్‌టీకి ఏడేళ్లు

జీఎస్‌టీ అమల్లోకి వచ్చి సోమవారంతో ఏడేళ్లు పూర్తయ్యాయి. దీంతో మొబైల్ ఫోన్లతో పాటు ఆహార పదార్థాలు, విరివిగా ఉపయోగించే అనేక గృహోపయోగ వస్తువులపై పన్ను పోటు తగ్గిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 17 పరోక్ష పన్నులు, 13 సెస్సులను కలిపి 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీని అమల్లోకి తీసుకువచ్చారు.



అన్‌స్టాప బుల్



సరికొత్త శిఖరాలకు సూచీలు.. 80,000 మైలురాయి దిశగా సెన్సెక్స్

» మరో 443 పాయింట్లు పెరిగిన సూచీ

» ఆల్‌టైం రికార్డు స్థాయికి బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు

» రాణించిన ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లు

» రూ.443 లక్షల కోట్లకు మార్కెట్ సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో బుల్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆసియా, ఐరోపా మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు పుంజుకోవడంతో భారత ఈక్విటీ సూచీలు సోమవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 528.27 పాయింట్లు ఎగబాకి 79,561 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 443.46 పాయింట్ల లాభంతో 79,476.19 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం 131.35 పాయింట్ల వృద్ధితో సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 24,141.95 వద్ద ముగిసింది. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఈ సెప్టెంబరులోనే ప్రామాణిక వడ్డీ రేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చన్న ఆశలు ప్రపంచ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3.9 లక్షల కోట్లు పెరిగి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.443.05 లక్షల కోట్లకు (5.31 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 20 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా షేరు 2.98 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ కూడా రెండు శాతానికి పైగా పెరిగాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఒక శాతానికి పైగా రాణించాయి. ఎన్‌టీపీసీ షేరు అత్యధికంగా 2.23 శాతం క్షీణించింది.
- బ్లూచి‌ప్‌లతో పోలిస్తే, చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు సరికొత్త రికార్డు గరిష్ఠాలను తాకాయి. స్మాల్‌క్యాప్ సూచీ 1.58 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.11 శాతం వృద్ధిని నమోదు చేశాయి.
- రంగాలవారీ సూచీల్లో ఐటీ అత్యధికంగా 1.84 శాతం వృద్ధి చెందగా.. టెక్నాలజీ, కమోడిటీస్, టెలికాం కూడా ఒక శాతానికి పైగా పెరిగాయి.
- ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు క్షీణించి 83.44 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 0.51% పెరిగి 85.43 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఐపీఓకు నివ బుపా హెల్త్ ఇన్సూరెన్స్

నివ బుపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో మ్యాక్స్ బుపా హెల్త్ ఇన్సూరెన్స్) పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన రూ.2,200 కోట్ల షేర్లను ఆఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. తద్వారా కంపెనీ మొత్తం రూ.3,000 కోట్లు సమీకరించనుంది.

- పిల్లల వస్త్రాలను విక్రయించే ఆన్‌లైన్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,816 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 5.44 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.
- ప్రెసిషన్ ఇంజనీరింగ్ సేవల కంపెనీ శివాలిక్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ ఐపీఓకు వచ్చేందుకు సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.335 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 41.3 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది.
- టెక్నాలజీ ఆధారిత సేవలందించే సజిలిటీ ఇండియా లిమిటెడ్ సైతం సెబీకి ఐపీఓ పత్రాలు సమర్పించింది. బెంగళూరుకు చెందిన ఈ కంపెనీ ఐపీఓ ద్వారా ప్రమోటర్‌కు చెందిన 98.44 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలని భావిస్తోంది.
- మురుగు శుద్ధి ప్లాంట్లు, ప్రాజెక్టులను టర్న్‌కీ పద్ధతిన అభివృద్ధి చేసే ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజనీర్స్ కూడా సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ ఫైల్ చేసింది. ఐపీఓ ద్వారా సంస్థ 4.42 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్‌కు చెందిన 52.68 లక్షల షేర్లను కూడా అమ్మకానికి పెట్టనుంది.
- ఆగ్రోకెమికల్స్ తయారీదారు అంబే ల్యాబ్స్ ఐపీఓ ఈ నెల 4న ప్రారంభమై 8న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.65-68గా నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.44.68 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ చేయనుంది.

ఆటో అమ్మకాల్లో వృద్ధి అంతంతే...

ముంబై: ఆటోమొబైల్ అమ్మకాల్లో వృద్ధి జూన్ నెలలో నామమాత్రంగానే ఉంది. దేశంలోని పలు ప్రాంతాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు బేస్ ఎఫెక్ట్ (గత ఏడాది జూన్‌లో అమ్మకాల భారీ వృద్ధి) కూడా ఈ నామమాత్రమైన వృద్ధికి కారణమని అంటున్నారు. జూన్ నెలలో మొత్తం 3,40,784 కార్లు అమ్ముడుపోయాయి. గత ఏడాది జూన్ అమ్మకాలు 3,28,710 యూనిట్లతో పోల్చితే ఇది 3.67 శాతం అధికం.

మారుతి 3 శాతం వృద్ధి: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ కార్ల అమ్మకాల్లో 3% వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది జూన్‌తో పోల్చితే అమ్మకాలు 1,33,027 యూనిట్ల నుంచి 1,37,160 యూనిట్లకు పెరిగాయి.

- హ్యుండయ్ మోటార్స్ అమ్మకాలు 50,001 యూనిట్ల నుంచి 50,103 యూనిట్లకు పెరిగాయి.
- టాటా మోటార్స్ కార్ల అమ్మకాలు 8% క్షీణించి 47,359 యూనిట్ల నుంచి 43,624 యూనిట్లకు పెరిగాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా కార్ల అమ్మకాలు 23% పెరిగి 32,588 నుంచి 40,022కి చేరాయి.
- టయోటా కిర్లోస్కర్ అత్యుత్తమ నెలవారీ అమ్మకాలను ప్రకటించింది. ఆ కంపెనీ 27,474 యూనిట్లు విక్రయించింది. గత ఏడాది జూన్‌లో విక్రయించిన 19,608 యూనిట్లతో పోల్చితే ఇది 40% అధికం.
- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా అమ్మకాలు 9% పడిపోయాయి. గత జూన్‌తో పోల్చితే అమ్మకాలు 5,125 నుంచి 4,644 యూనిట్లకి తగ్గాయి.

టూ వీలర్ అమ్మకాలు

- బజాజ్ ఆటో అమ్మకాలు 8% పెరిగి 1,99,983 యూనిట్ల నుంచి 2,16,451 యూనిట్లకు చేరాయి.
- టీవీఎస్ మోటార్ కూడా 8% వృద్ధితో 2,55,734 యూనిట్లు విక్రయించింది. సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా అమ్మకాల్లో 13% వృద్ధిని ప్రకటించింది.

పతంజలి ఫుడ్స్ చేతికి మరో బిజినెస్

న్యూఢిల్లీ: పతంజలి ఫుడ్స్ తన బిజినెస్‌ను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా పతంజలి ఆయుర్వేద్ కంపెనీకి చెందిన హోమ్, పర్సనల్ కేర్ బిజినెస్‌ను రూ.1,100 కోట్లకు కొనుగోలు చేసింది. పతంజలి ఫుడ్స్ ప్రధాన ప్రమోటర్లలో బాబా రాందేవ్ నాయకత్వంలోని పతంజలి ఆయుర్వేద్ ఒకటి. దీంతో పతంజలి ఆయుర్వేద్‌కి చెందిన ఆహారేతర ఉత్పత్తుల బిజినెస్ మొత్తం పతంజలి ఫుడ్స్ చేతికి వస్తుంది.

యాక్సిస్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఎన్ఎస్ఈలోని టాప్ 500 కంపెనీల వృద్ధి అవకాశాలను నిశితంగా పరిశీలించి ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 9. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. రిస్క్‌ను సర్దుబాటు చేసుకుంటూ దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది.

ఐసీఐసీఐ ప్రు ఎనర్జీ ఆపర్చునిటీస్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. ప్రత్యేకంగా ఇంధన రంగంపై దృష్టి సారించే విధంగా కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎనర్జీ ఆపర్చునిటీస్ ఫండ్ పేరుతో తీసుకువచ్చిన ఈ ఫండ్ ఈ నెల 2న ప్రారంభమై 16న ముగియనుంది. ఇంధన రంగంలో కీలకంగా ఉన్న ఆయిల్ అండ్ గ్యాస్, బయో ఎనర్జీ, లూబ్రికెంట్స్ కంపెనీలు సహా మరికొన్ని కంపెనీల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేయనుంది. మదుపరుల పెట్టుబడులకు దీర్ఘకాలంలో అత్యుత్తమ లాభాలు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దినట్లు ఐసీఐసీఐ ప్రు ఎంఎఫ్ సీఐఓ శంకరన్ నరేన్ తెలిపారు. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఎనర్జీ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000.

వైఫై-6 రౌటర్ల తయారీలోకి సెల్‌కాన్

» జెడ్‌టీఈ టెలికాంతో జట్టు

» ఆగస్టు నుంచి తిరుపతి ప్లాంటులో ఉత్పత్తి

» 1,000 మందికి ఉపాధి అవకాశాలు



అమరావతి (ఆంధ్రజ్యోతి): సెల్‌కాన్ గ్రూప్ కొత్తగా వైఫై-6 రౌటర్ల తయారీలోకి ప్రవేశిస్తోంది. సెల్‌కాన్ అనుబంధ సంస్థ సెల్‌కాన్ రిసొల్యూట్ ఇందుకోసం టెలికమ్యూనికేషన్స్ పరికరాల తయారీలోని చైనా దిగ్గజ సంస్థ జెడ్‌టీఈ టెలికాంతో చేతులు కలిపింది. గత నెల 29న ఉండవల్లిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో జెడ్‌టీఈ సీఈఓ లేవో చావ్, సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ వై గురు, రిసొల్యూట్ గ్రూప్ ఫౌండర్, సీఎండీ రమీందర్ సోయిన్ ఈ వివరాలు వెల్లడించారు.

తిరుపతిలో ప్లాంటు: తిరుపతిలో ఉన్న ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ-1)లో సెల్‌కాన్ రిసొల్యూట్ ఇందుకోసం ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేయనుందని సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ గురు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టుకల్లా ఈ ప్లాంటులో వైఫై-6 రౌటర్ల ఉత్పత్తిని చేపట్టనున్నారు. తొలుత నెలకు 2 లక్షల యూనిట్లతో ఉత్పత్తిని ప్రారంభించి ఏడాది చివరి నాటికి దీన్ని 5 లక్షల యూనిట్లకు పెంచనున్నారు. విదేశాలకు ఈ రౌటర్లను ఎగుమతి చేయాలని కంపెనీ భావిస్తోంది. కాగా ఈ ప్లాంట్ ద్వారా తొలిదశలో 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని గురు తెలిపారు.

రాష్ట్రానికి శుభసూచకం: మంత్రి లోకేష్

చైనా దిగ్గజ సంస్థ జెడ్‌టీఈ ఏపీకి రావడం శుభసూచకమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. రానున్న రోజుల్లో జెడ్‌టీఈ గ్రూప్‌నకు చెందిన ఇతర విభాగాలు కూడా రాష్ట్రంలో తమ ఉత్పత్తుల తయారీని ప్రారంభించాలని ఆయన కోరారు. ఎలక్ట్రానిక్స్ ఐఓటీ రంగంలో కీలకంగా ఉన్న జెడ్‌టీఈతో జట్టు కట్టడం సంతోషాన్నిస్తోందని సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ గురు తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,300 ▲	66,300 ▲	94,700 ▲
ముంబై	71,874 ▲	65,837 ▲	87,802 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	545
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	118
కర్నూలు	112	నెల్లూరు	118
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		





పెనుమాకలో నిర్వహించిన రచ్చబండలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, కలెక్టర్ తదితరులు

పేదింటికి పండగొచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

తొలి అడుగులోనే సూపర్ హిట్ కొట్టింది. పింఛను డబ్బులు తీసుకున్న లబ్ధిదారుల మోముల్లో ఇంద్రధనస్సులోని సప్తవర్ణాలూ కళగట్టాయి. మరోవైపు పెన్షన్ల పంపిణీ అనేది సచివాలయ ఉద్యోగులతో వీలు కాదు.. వలంటీర్లతోనే అది సాధ్యమవుతుందంటూ ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం చేసిన వాదనలను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పటాపంచలు చేశారు. 'బ్యాంకులకు వెళ్లి పింఛను డబ్బులు డ్రా చేసుకుని వచ్చేది మేం.. మాకు వాటిని పంపిణీ చేయడం చేత కాదా' అని అప్పట్లో తేల్చిచెప్పిన ఈ ఉద్యోగులు, అన్నట్టుగానే ఒక్కరోజులోనే పింఛన్ల పంపిణీని దాదాపు పూర్తి చేశారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం ఉదయం 5.30 గంటలనుంచే ప్రారంభమైంది. రాత్రి 8 గంటల సమయానికి 94.75 శాతం పంపిణీ పూర్తి అయింది. ఇందులో అత్యధికంగా విజయనగరం జిల్లాలో 96.93 శాతంమందికి, అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 91.27 శాతం మందికి పింఛన్ సొమ్ములు అందాయి. రాష్ట్రంలో పింఛన్లు అందుకుంటున్న వారు 64 లక్షలమంది ఉండగా, వారిలో 61 లక్షలమంది చేతికి సొమ్ము చేరిపోయింది. రాజధానిలోని పెనుమాకలో జరిగిన పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పాల్గొంటే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పింఛను సొమ్ము పేదల చేతికి అందించారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు తమ నియోజకవర్గాల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

పరుగు వేగంతో పూర్తి...

రాష్ట్రంలో 1.2 లక్షలమంది సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు. ఉన్నత విద్యావంతులు కావడం, సాంకేతిక నైపుణ్యం తెలిసినవారు కావడంతో వీరు పెన్షన్ల పంపిణీలో తమకిచ్చిన టార్గెట్‌ను అందుకోగలిగారు. బయోమెట్రిక్ మెషిన్ల ద్వారా వేగంగా ప్రక్రియను ముగించారు. నిజానికి, గతంలో కూడా వలంటీర్లు...సచివాలయ ఉద్యోగుల సహకారం లేకుండా పెన్షన్లు పంపిణీ చేయలేదు. డబ్బులు బ్యాంకుల నుంచి డ్రా చేసి వలంటీర్లకు అందించడంతోపాటు సాంకేతిక సహకారం అందించేవారు. ఇప్పుడు వారే రంగంలోకి దిగడంతో పంపిణీ తేలికైంది. విధి నిర్వహణలో వీరి పట్టుదలను ముఖ్యమంత్రి అభినందించారు.

పండగలా పంపిణీ

పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గం పిఠాపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రవాణా శాఖ మంత్రి రాంప్రసాదరెడ్డి విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పుఘర్ వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, తదితరులు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు పంపిణీ చేశారు. పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు సిటీలో, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గాల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పింఛన్లు అందజేశారు. అన్ని నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు ఉదయం ఆరు గంటలకే తొలి పింఛన్‌ను లబ్ధిదారులకు అందించారు. రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలో తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నంద్యాల పట్టణంతో పాటు, మండలంలో లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి పింఛన్లను అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు పట్టణంతోపాటు పలుగ్రామాల్లో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి .. అనకాపల్లి జిల్లాలో హోం మంత్రి వంగలపూడి అనిత, అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, కూటమి నేతలు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో టూరిజం మంత్రి కందుల దుర్గేశ్, టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉత్సాహంగా పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ బాపట్ల జిల్లా రేపల్లెరూరల్ మండలం పేటేరులో పింఛన్లను లబ్ధిదారులకు అందించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విశాఖ జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని వడ్లపూడిలో.. సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లిలో.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం తర్లిపేటలో మంత్రి అచ్చెన్నాయుడు.. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో మంత్రి పయ్యావుల కేశవ్, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, పెనుకొండలో మంత్రి సవిత.. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో సమాచారశాఖ మంత్రి పార్థసారథి పింఛను పంపిణీ నిర్వహించారు. పెంచిన పింఛన్‌పై అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాలలో ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



విజయవాడ అయ్యప్పనగర్‌లో చిరునవ్వుల్లో లబ్ధిదారు

ఇప్పుడేమంటారో..?

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు వలంటీర్లు పెన్షన్ల పంపిణీ చేయరాదని ఈసీ ఆదేశాలిచ్చింది. సచివాలయ ఉద్యోగులతో పెన్షన్లను పంపిణీ చేయాలని సూచించింది. అయితే అది సాధ్యం కాదని జగన్ ప్రభుత్వం లేఖ రాసింది. అప్పటి సీఎస్ జవహర్‌రెడ్డి కోర్టుకు సైతం ఇదే చెప్పారు. ప్రభుత్వం కోర్టును తప్పుదోవ పట్టించి.... పెన్షన్లను సచివాలయాల వద్దకు వచ్చి తీసుకోవాలని మార్గదర్శకాలిచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేసవి ఎండలో సచివాలయాలకు వచ్చిన పండుటాకులు వేడిమి తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. సుమారు 33 మంది మృత్యువాత పడ్డారు. ఎన్నికల కోడ్ సమయంలో కూడా అధికారులు అలానే వ్యవహరించారు. ఈసారి పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామని చెప్పారు. బ్యాంకు అకౌంట్లు లేకపోవడం, ఉన్న అకౌంట్లు ఆధార్‌తో లింక్ కాకపోవడం, కొందరికి పనిచేయని బ్యాంక్ ఖాతాల్లో జమ కావడంతో పింఛనుదారులు నరకం చూశారు. ఇలా ఎన్నికల సమయంలో వైసీపీ సర్కారు... పెన్షన్‌దారులతో ఆటాడుకుంది. వలంటీర్లతోనే సంక్షేమ కార్యక్రమాల అమలు సాధ్యమని గట్టిగా ప్రచారం చేసుకున్నారు. పైగా టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగిస్తారని, పెన్షన్లు తమలా ప్రతి నెలా ఇంటింటికీ అందించబోరని ప్రచారం చేశారు.



మచిలీపట్నంలో దివ్యాంగురాలు సీమా పర్వీన్‌కు పింఛను అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

జగన్ ఆపేసిన పింఛన్ మళ్లీ మంజూరు

» మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

కృష్ణా జిల్లా మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్ నూరుద్దీన్‌పేటకు చెందిన 21 సంవత్సరాల సీమాపర్వీన్ మంచానికే పరిమితమైంది. గతంలో ఆమెకు దివ్యాంగుల కోటాలో పింఛను అందించేవారు. ఆమె తండ్రి హిదయతుల్లాఖాన్ టీడీపీకి అనుకూలంగా ఉంటున్నారనే కారణంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆమెకు పింఛను నిలిపివేశారు. ఆమె కుటుంబానికి విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని సాకు చూపారు. 2023 ఏప్రిల్ నెలలో ఇదేం ఖర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రతిపక్ష నేత హోదాలో మచిలీపట్నంకు చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా సీమాపర్వీన్ పరిస్థితిని టీడీపీ నాయకులు కొల్లు రవీంద్ర, తదితరులు చంద్రబాబుకు వివరించారు. బాలిక దుస్థితి చూసిన చంద్రబాబు ఆమెతో సెల్ఫీ తీసుకుని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను అందజేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు టీడీపీ తరఫున పింఛను ఇస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు సీమాపర్వీన్‌కు రూ.15 వేల పింఛనును మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ ఆమె ఇంటి వద్దకు వెళ్లి అందించారు.

చంద్రబాబు చిత్రపటానికి ఎంపీల క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఢిల్లీలో టీడీపీ ఎంపీలు క్షీరాభిషేకం చేశారు. టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో పార్టీ ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వృద్ధుల కాళ్లు కడిగి..

(మొదటి పేజీ తరువాయి)

పెంచిన పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ... దివ్యాంగులు, వృద్ధులకు ఎంతచేసినా రుణం తీర్చుకోలేమని అన్నారు. చెప్పిన మాట ప్రకారం విడతల వారీగా కాకుండా ఒకేసారి పెన్షన్ పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మానవత్వం చాటుకున్నారన్నారు. కోటి రూపాయలు విలువ చేసే రెండు ఎకరాల సాగులో శ్రమించి, ప్రకృతి కరుణిస్తే ఏడాదికి 40 వేలు ఆదాయం మాత్రమే వస్తుందని, తమ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులకు ఏడాదికి రూ.48 వేలు పెన్షన్‌గా ఇస్తున్నారని అన్నారు. చంద్రబాబు ద్వారా రెండు ఎకరాల ఆస్తి అందుకున్నట్లేనని వాఖ్యానించారు. తొలుత ఆయా గ్రామాలకు చేరుకున్న మంత్రి నిమ్మలకు మహిళలు హారతులు పట్టారు.



ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన నాయకుడు రెడ్డి అప్పల నాయుడుకు హారతులు పడుతున్న పింఛన్ లబ్ధిదారులు

ఇద్దరం కలిసి మాట్లాడుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

దృక్పథంతో ఉండటంతో... విభజన అంశాల పరిష్కారంలో ముందడుగు పడే అవకాశముందని అంటున్నారు.

ఇదే తొలిసారి...

చంద్రబాబు, రేవంత్ ముఖ్యమంత్రుల హోదాలో సమావేశం కావడం ఇదే మొదటిసారి. రేవంత్ గతంలో చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలో పనిచేశారు. ఆ తర్వాత ఆ పార్టీని వీడి కాంగ్రె్‌సలో చేరారు. ఆ పార్టీ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు రాజకీయ శిబిరాల్లో ఉండటంతో వీరిద్దరూ కలుసుకోవడం ఇటీవలి కాలంలో సాధ్యపడలేదు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రేవంత్‌కు ఆహ్వానం అందినా... ఆ కార్యక్రమాన్ని ఎన్డీయే కూటమి కార్యక్రమంగా నిర్వహించడంతో ఆయన రాలేదు. అధికారికంగా రెండు రాష్ట్రాల మధ్య ఒక సమావేశాన్ని నిర్వహించాలన్న ఆలోచన ఇటీవల ఇరువైపులా వచ్చింది. దాని ఫలితమే ఈ సమావేశమని చెబుతున్నారు. దీనికి ప్రాతిపదికగా చంద్రబాబు అధికారికంగా తెలంగాణ ముఖ్యమంత్రికి ఒక లేఖ రాసి దానిని సోమవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

ఇదీ రేవంత్‌కు చంద్రబాబు లేఖ

"తెలంగాణ ముఖ్యమంత్రిగా మీరు చేపట్టిన ప్రగతిశీల కార్యక్రమాలకు నా హృదయపూర్వక అభినందనలు. మీ అంకిత భావం, నాయకత్వ పటిమ తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఉన్న మనం ఒక చక్కటి అనుబంధంతో పనిచేయగలిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండింటి అభివృద్ధికి, పురోగతికి ఉపయోగపడుతుంది. మన ఉమ్మడి ఆలోచనలు, సహకార కృషి మన ఉమ్మడి లక్ష్యాల సాధనకు దోహదం చేసి ప్రజల జీవితాలు మెరుగు పడటానికి ఒక మార్గం ఏర్పరుస్తుంది. ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగి ఇప్పటికి పదేళ్లయింది. విభజన చట్టానికి సంబంధించిన అనేక అంశాలపై ఇంకా పలు రకాలైన చర్చలు జరుగుతున్నాయి. అత్యంత జాగురూకతతో ఉభయులకూ ఆమోద యోగ్యంగా వీటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. దీని కోసం ఈ నెల ఆరో తేదీ శనివారం మధ్యాహ్నం, మీ ప్రదేశంలో మనం కలుద్దాం. మనం ముఖాముఖీ కూర్చుని మాట్లాడుకోవడం వల్ల సున్నితమైన అంశాలకు పరిష్కారం కనుగొనడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ సమావేశంలో జరిగే చర్చల వల్ల ఉపయుక్తమైన పరిష్కారాలు వస్తాయని నేను విశ్వసిస్తున్నాను."



గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో మంత్రి లోకేశ్‌కు తేనీరు ఇచ్చి సంతోషం వ్యక్తం చేస్తున్న పింఛన్ లబ్ధిదారు



విశాఖ, మద్దిలపాలెం డిపోలో కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి

ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం

» విద్యార్థుల కోసం 320 సర్వీసులు

» త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మద్దిలపాలెం(విశాఖపట్నం), టెక్కలి, జూలై 1: 'నూతన సంస్కరణలు అమలుచేసి ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం' అని మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.12 కోట్లతో కొనుగోలు చేసిన మూడు నూతన సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను ఆయన సోమవారం నగరంలోని మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో ప్రారంభించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పై రెండు సందర్భాల్లో మంత్రి మాట్లాడారు. 'కార్మికులకు వైద్య బీమా, ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం. ఆర్టీసీ లాభాల బాట పట్టేలా కార్గో, కొరియర్ సేవలను విస్తృతం చేస్తాం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 1,400 నూతన బస్సులను అందుబాటులోకి తీసుకువస్తాం. కాలుష్యాన్ని తగ్గించేలా ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నాం. విద్యార్థుల కోసం 320 బస్సు సర్వీసులను ఏర్పాటు చేశాం' అని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీలో ఉత్తమ సేవలందించిన 20 మందికి అవార్డులు ప్రదానం చేశారు. 'సంస్థలో 3,670 డ్రైవర్ పోస్టులు, 1,820 కండక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని త్వరలో భర్తీ చేస్తాం. నేను కూడా ఆర్టీసీ కుటుంబానికి చెందినవాడినే. ఇక్కడి సమస్యలు క్షుణ్ణంగా తెలుసు. అందరికీ అందుబాటులో ఉంటా. ఏ సమస్య ఎదురైనా ఒక్క ఫోన్‌తో నా దృష్టికి తీసుకురండి. రెండు నెలలకొకసారి ప్రతి జిల్లాలో పర్యటిస్తా' అని మంత్రి చెప్పారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి..



కర్నూలు జిల్లా ఎడవలిలో పింఛన్ అందుకున్న రంగప్ప కుటుంబీకులు

కర్నూలు జిల్లా మద్దికెర మండలం ఎడవలి గ్రామానికి చెందిన ఆకుల రంగప్ప కుటుంబానికి మూడు రకాల పింఛన్లు అందాయి. రంగప్పకు వృద్ధాప్య పింఛన్ రూ.7 వేలు, దివ్యాంగులైన ఆయన కుమారుడు చెంగలరాయుడు, కుమార్తె లక్ష్మికి చెరో ఆరువేల చొప్పున పింఛన్ అందజేశారు. ఆ కుటుంబానికి మొత్తం రూ.19 వేలు అందింది. తమకు జీవనాధారం లేదని, ఈ పింఛన్‌తోనే కుటుంబం గడుస్తోందని రంగప్ప అన్నారు. తమ కుటుంబానికి చంద్రబాబు పెద్దకొడుకుగా మారారని భావోద్వేగానికి లోనయ్యారు.


9సార్లు చార్జీలు పెంచినా నష్టాలా?

» రాష్ట్రం మిగులు నుంచి లోటుకు ఎలా వెళ్లింది?

» 'కృష్ణపట్నం', వీటీపీఎస్ కేంద్రాల్లో వాణిజ్య ఉత్పత్తి ఎందుకు ఆలస్యమయింది?

» విద్యుత్ రంగం శ్వేతపత్రంపై సమీక్షలో సీఎం

» 8న శ్వేతపత్రం విడుదల చేయాలని నిర్ణయం



అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్ రంగంపై రాష్ట్ర ప్రజల ముందు ఉంచే శ్వేతపత్రం క్లుప్తంగా ఉండాలి. ప్రజలందరికీ అర్థమయ్యే పద్ధతిలో ఉండాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. '2014-19 మధ్య కాలంలో విద్యుత్ చార్జీలు పెంచకపోయినా ఆ రంగం సుస్థిరంగా ఉంది. 2019-24 మధ్య భారీగా చార్జీలు పెంచినా నష్టాల్లోకి వెళ్లింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉంది. ఇప్పుడు లోటులోకి వెళ్లింది. ఈ దుస్థితి ఎందుకు ఏర్పడింది? దానికి కారణం ఎవరు? అన్న విషయాలను సుస్పష్టంగా, సరళంగా వివరించాలి' అని ఇంధన సంస్థల ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. విద్యుత్ రంగంపై శ్వేతపత్రాన్ని ముందుగా 5న విడుదల చేయాలని అనుకున్నారు. ఆ తేదీల్లో సీఎం ఢిల్లీ వెళ్తున్నందున 8న విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆ రంగంపై సీఎం సమీక్షను నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ నీరబ్‌కుమార్, సీఎం కార్యాలయ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, సీఎం కార్యాలయ అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జెన్కో ఎండీ చక్రధర బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వితేజ్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీఎల్ సీఎండీ సంతోశ్ రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. విద్యుత్తు రంగం ప్రస్తుత పరిస్థితిని పీపీటీ ద్వారా చంద్రబాబుకు విజయానంద్ వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. '2019లో జగన్ అధికారాన్ని చేపట్టాక 2014-19 మధ్యకాలంలోని విద్యుత్ వాడకానికి కూడా ట్రూ అప్ చార్జీల పేరుతో భారీగా వసూలు చేశారు. మొత్తంగా 9 దఫాలు కరెంటు చార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేశారు. అయినా విద్యుత్ రంగం భారీ నష్టాల్లోకి వెళ్లింది. దానికి కారణాలు ప్రజలకు తెలియాలి. 2017 నాటికే కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రం దాదాపు సిద్ధమైంది. అయినా కమర్షియల్ డేట్‌లోకి వచ్చేందుకు తీవ్ర జాప్యం అయింది. అది ఎందుకు జరిగింది? దానివల్ల కృష్ణపట్నం విద్యుత్ కేంద్రానికి కలిగిన నష్టం ఎంత? 800 మెగావాట్ల విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రం వాణిజ్యపరంగా అందుబాటులోకి రావడానికి ఎందుకు ఆలస్యమయింది? దానివల్ల జరిగిన నష్టం ఎంత? జగన్ అధికారంలోకి రాగానే సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి యాజమాన్యాలతో, డిస్కమ్‌లు చేసుకున్న పీపీఏలు రద్దు చేయడంతో పారిశ్రామికవేత్తల్లో రాష్ట్రంపట్ల వ్యతిరేకత ఏర్పడింది. దీంతో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఈ దీర్ఘకాలిక నష్టాన్ని కూడా విపులీకరించాలి. ఇబ్బడి ముబ్బడిగా ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు కొనుగోలు చేసి డిస్కమ్‌లను అప్పుల ఊబిలోకి నెట్టేశారు. ఆ నష్టాలన్నింటినీ చార్జీల రూపంలో ప్రజలపై వేశారు. వివరాలన్నీ సమగ్రంగా, ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండాలి. స్థూలంగా... 2014-19 మధ్య కాలంలో విద్యుత్తు రంగం స్థితి, 2019-24 మధ్య కాలంలో ఇంధన రంగం దుస్థితిని గురించి ప్రజలకు వివరించేలా శ్వేతపత్రాన్ని తయారు చేయాలి' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చంద్రబాబు సోలార్ విద్యుత్‌పై అడిగిన ఓ ప్రశ్నకు విజయానంద్ స్పందిస్తూ... 2019-24 మధ్యకాలంలో కొత్తగా ఒక్క యూనిట్ కూడా ఉత్పత్తి కాలేదని తెలిపారు.

నాలుగున్నరేళ్ల తర్వాత ఒకటినే జీతాలు

» 90% పైగా ఉద్యోగులకు జమ.. నేడు పెన్షన్లు కూడా 100% పూర్తి

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఒకటో తేదీనే వారి ఖాతాల్లో జమయ్యాయి. ఉద్యోగులకు సోమవారం దాదాపు 90 శాతంపైగా జీతాలు పడిపోగా.. పెన్షనర్లకు పింఛన్లు కూడా 50 శాతం అందాయి. మిగతావారికి కూడా మంగళవారం నాటికి జీతాలు, పెన్షన్లు పూర్తిస్థాయిలో అందుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. పోలీస్, రెవెన్యూ, హెల్త్, పంచాయతీ రాజ్ ఉద్యోగులకు జీతాలందాయి. కొన్ని జిల్లాల్లో దాదాపు వంద శాతం జీతాలు జమయ్యాయి. టీచర్ల బిల్లులు చివర్లో పెట్టడం వలన వారిలో ఎక్కువ మందికి జీతాలు పడలేదు. మంగళవారం నాటికల్లా అందరికీ వంద శాతం అందుతాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని బిల్లులూ పూర్తిగా క్లియర్ అయినట్టు తెలిసింది. నాలుగున్నరేళ్లుగా జగన్ సర్కారు ఒకటో తేదీనే జీతాలిచ్చిన చరిత్ర లేదు. జీతాలు, పెన్షన్లు పూర్తిస్థాయిలో పడాలంటే నెలలో మూడోవారం వచ్చేది. ఈఎంఐలు, బిల్లులు చెల్లించాల్సిన ఉద్యోగులు అప్పులు తెచ్చి తిప్పలు పడేవారు. పెన్షనర్లు కూడా ఆస్పత్రి ఖర్చులు, మందులు, ఇతర ఖర్చులకు సకాలంలో డబ్బులందక ఇబ్బందులు పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి నెలలోనే ఉద్యోగులకు జీతాలు దాదాపు పూర్తిస్థాయిలో, పెన్షన్లు సగానికి పైగా అందాయి. ప్రభుత్వోద్యోగులకు జీతాలు, పెన్షన్లు కలిపి నెలకు రూ.5,500 కోట్లు అవసరమవుతాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖజానాకు నెలకు రూ.13,000 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. అవిగాక వారం వారం అందినకాడికి అప్పులు తెచ్చేవారు. అయినప్పటికీ ఒక్క నెలలో కూడా సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించలేదు. అలాగే.. పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, జీపీఎఫ్, అడ్వాన్సుల దరఖాస్తులు, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, సరెండర్ లీవుల బిల్లులు కూడా భారీగా పెండింగ్‌లో ఉంచారు. జగన్ ఇచ్చిన 11వ పీఆర్సీతో ఉద్యోగులకు జీతాలు పెరగకపోగా కొంత మేర తగ్గాయి. అధికారంలోకొచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దుచేస్తానని హామీ ఇచ్చిన జగన్ ఐదేళ్లు పూర్తయినా ఆ పని చేయలేదు. పైగా జీపీఎస్‌ను తీసుకొచ్చి ఉద్యోగులను నట్టేట్లో ముంచారు. ఇన్ని సమస్యలతో పాటు ఉద్యోగులకు తమకు ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు అందించాలని కూడా వైసీపీ ప్రభుత్వంతో పోరాడారు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే అటు సామాజిక పెన్షన్లు, ఇటు ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఏకకాలంలో ఇచ్చేసి సామర్థ్యాన్ని నిరూపించుకుంది.

ఎమ్మెల్సీలుగా సి.రామచంద్రయ్య, హరిప్రసాద్

» పవన్ రాజకీయ కార్యదర్శికి అవకాశం

» నేడు నామినేషన్ల దాఖలు



అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ కూటమి అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యకు, జనసేన నుంచి పిడుగు హరిప్రసాద్‌కు అవకాశం కల్పించారు. హరిప్రసాద్ జనసేనాని పవన్ కల్యాణ్‌కు రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ నుంచి ఎమ్మెల్సీలుగా గెలుపొందిన సి.రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ టీడీపీలో చేరడంతో ఈ రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే కోటా స్థానాలు కావడంతో ఈ రెండు సీట్లు కూటమి గెలుచుకోవడం ఖాయమే. ఇందులో ఒకటి జనసేనకు ఇవ్వడంతో ఇక్బాల్‌కు అవకాశం దక్కలేదు. ఆయనకు భవిష్యత్తులో మరో అవకాశం ఇస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు మంగళవారం ఆఖరి రోజు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. వీరిలో సి.రామచంద్రయ్య గతంలో మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. ఆయన స్వస్థలం కడప జిల్లా మైదుకూరు. ఇక, ఏలూరుకు చెందిన హరి ప్రసాద్ లా చదివి పాతికేళ్లపాటు మీడియా రంగంలో పనిచేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం తర్వాత పార్టీ మీడియా విభాగం అధిపతిగా, పార్టీ అధ్యక్షునికి రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.



వైసీపీ నేతల దాడిలో ధ్వంసం అయిన మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం(ఫైల్)

చేసిందెవరు? చేయించిందెవరు?

» టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసు దర్యాప్తు షురూ

» రాష్ట్రాన్ని వదిలివెళ్లిపోయిన కొందరు అనుమానితులు..!

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ కార్యకర్తలు, రౌడీ షీటర్లు జరిపిన దాడిపై రెండున్నర సంవత్సరాల తర్వాత దర్యాప్తు మొదలైంది. ప్రభుత్వం మారి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంఘటనపై పోలీస్ శాఖలో కదలిక రావడం విశేషం. గత రెండు రోజులుగా పోలీస్ అధికారులు టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చి దాడికి ప్రత్యక్ష సాక్షులు, ఆ దాడిలో గాయపడిన కార్యాలయ సిబ్బంది, పార్టీ నేతల స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకొంటున్నారు. 2021 సంవత్సరం అక్టోబరు 19న ఇక్కడి మంగళగిరి సమీపంలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై ఈ దాడి జరిగింది. ఒక రాజకీయ పార్టీ ప్రధాన కార్యాలయంపై మరో పార్టీ దాడికి దిగడం ఇదే ప్రథమం కావడంతో ఈ సంఘటన పెద్ద సంచలనం కలిగించింది. వాహనాల్లో రాడ్లు, కర్రలు, రాళ్ల పట్టుకొని వచ్చిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యాలయ గేట్లు విరగొట్టుకొంటూ లోపలికి వచ్చి కుర్చీలు, బల్లలు, అద్దాలు విరగగొట్టి విధ్వంసం సృష్టించారు. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన టీడీపీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బందిని తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో ఇద్దరికి తలలు పగిలాయి. రాష్ట్రంలో గంజాయి వాడకం విపరీతంగా పెరిగిపోయిందని టీడీపీ చేసిన విమర్శపై వైసీపీ అగ్ర నేతలు ఆగ్రహించారు. వారు పురికొల్పడంతో వైసీపీ కార్యకర్తలు, కొందరు రౌడీ షీటర్లు కలిసి వచ్చి ఈ దాడికి పాల్పడ్డారని అప్పట్లో తెలుగుదేశం నేతలు ఆరోపించారు. ఈ సంఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం కలిగించినా వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులు అప్పట్లో దీనిని పట్టించుకోలేదు. టీడీపీ నేతలు ఫిర్యాదు చేసినా దర్యాప్తు మొదలు పెట్టలేదు. నాటి ఫిర్యాదుపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసులు ఇప్పుడు దర్యాప్తు ప్రారంభించారు. దాడిలో పాల్గొన్నవారెవరు? వారిని ప్రేరేపించిన వారెవరు? అన్న అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. నాటి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు వైసీపీ కన్వీనర్ దేవినేని అవినాశ్ అనుచరగణం ఈ దాడిలో పాల్గొన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. దాడిలో పాల్గొన్నవారిని గుర్తించడం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీ కోసం పోలీసులు అధికారికంగా దరఖాస్తు చేశారు. దాడి జరిగిన రోజే టీడీపీ నేతలు ఆ ఫుటేజిని తీసి భద్రపర్చారు. అప్పట్లోనే పోలీసులకు దానిని అందచేసినా వారు పట్టించుకోలేదు. వైసీపీ అగ్ర నేతల ఆదేశం లేకుండా టీడీపీ కార్యాలయంపై దాడికి సాహసించరని, ఆ అగ్ర నేతలు ఎవరో గుర్తించాలని పోలీస్ శాఖ భావిస్తోంది. దాడి చేసిన వారు, వారి నేతలు, ఇతర వైసీపీ నేతలకు వచ్చిన ఫోన్లు... తదితర సమాచారాన్ని కూడా సేకరిస్తున్నట్లు వినికిడి. ఈ సంఘటనపై దర్యాప్తు ముమ్మరం కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విషయం తెలియగానే అనుమానితుల్లో కొందరు రాష్ట్రం వదిలిపోయారని ప్రచారం జరుగుతోంది.

నాయకర్, శ్రీధర్‌కు విప్ ఇవ్వండి

» సీఎం చంద్రబాబుకు ఉపముఖ్యమంత్రి పవన్ లేఖ

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఎమ్మెల్యేలు ఇద్దరిని విప్‌గా ప్రకటించమని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, ఆ పార్టీ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. సోమవారం సీఎం చంద్రబాబుకు పంపిన ఆ లేఖలో... నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లను విప్‌లుగా నియమించాలని కోరారు. ఇప్పటికే జనసేన నుంచి పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ ఇద్దరూ ఓసీలు అయ్యారు. దీంతో ఒక బీసీ, ఒక ఎస్సీకి కూడా గుర్తింపు ఇవ్వాలని జనసేనాని భావించారు. దీంతో బీసీ కోటాలో నాయకర్, ఎస్సీ కోటాలో శ్రీధర్‌కు అవకాశం దక్కింది.

వృద్ధురాలి పాదాలకు బుద్ధా పాలాభిషేకం..



పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఓ వృద్ధురాలి పాదాలకు పాలాభిషేకం చేశారు.

ఒకే ఇంట్లో నలుగురికి...



అనంతపురం జిల్లా బోరంపల్లిలో ఒకే ఇంట్లో రూ.43 వేలు పింఛన్ అందుకున్న తండ్రీకూతుళ్లు. తండ్రికి వృద్ధాప్య పింఛన్ రూ.7 వేలు, దివ్యాంగుల కోటాలో ఆయన కూతుళ్లు అనంతలక్ష్మి, నిర్మలమ్మకు చెరో రూ.15 వేలు, అంజలికి రూ.6 వేలు పింఛన్‌ను సచివాలయ సిబ్బంది అందజేశారు.



విశాఖలో వృద్ధురాలికిపింఛను పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈ ఒక్క నెలలోనే 4,408 కోట్లు

కర్నూలులో కుటుంబమంతా హ్యాపీ





రాములు నాయక్ ఇంట్లో టీ తాగుతున్న సీఎం చంద్రబాబు

అనుకోని అతిథి..!



రాములు నాయక్ ఇంటికి వెళ్లిన చంద్రబాబు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న దృశ్యం

3 నెలల బకాయిలతో కలిపి పెన్షన్ ఇస్తున్నాం: చంద్రబాబు

- ఒక హామీ ఇస్తే అమలు చేయాలంటే సుమారు ఐదారు నెలలు పడుతుంది. కానీ మా ప్రభుత్వం ఏర్పడిన 26 రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసి బకాయిలతో సహా అందించాం.
- సంక్షేమ పథకాలు అందించామని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలి. వారి జీవన ప్రమాణాలు పెంచడానికి మొదటి అడుగు వేశాం.
- రాష్ట్రంలో రివర్స్ గేర్ ఇక లేనేలేదు. ఇక అంతా ఫ్రంట్ గేరే! పాజిటివ్‌గా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే ప్రక్రియ ఆరంభమైంది. కొత్త శకానికి, కొత్త సంస్కృతికి అందరూ అలవాటు కావలసిందే.

- చంద్రబాబు

- రాష్ట్రంలో 65.31 లక్షల మందికి సామాజిక పింఛను
- ప్రతి ఇంటికీ పెద్దకొడుకుగా ఉంటా
- ప్రజలు మాకిచ్చింది అధికారం కాదు.. బాధ్యత: సీఎం
- పెనుమాకలో స్వయంగా పెన్షన్ల పంపిణీ

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఒక్క నెలలోనే పేదలకు పెన్షన్ల కింద ఇస్తున్నది రూ.4,408 కోట్లని.. ఇంతకంటే శుభదినం మరొకటి లేదని సీఎం చంద్రబాబు అన్నారు. పెన్షనర్లకు ఇదివరకు నెలకు రూ.1,938 కోట్లు ఖర్చు చేస్తే ఇప్పుడు దానికి అదనంగా రూ.819 కోట్లు ఖర్చు పెడుతున్నామని.. ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలు కలిపి రూ.1,650 కోట్లు అదనంగా చెల్లించామని చెప్పారు. సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు ఇకపై ఏడాదికి రూ.33,100 కోట్లు ఖర్చు చేయబోతున్నామని ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో రూ.1,65,500 కోట్లు వ్యయం చేస్తామన్నారు. సోమవారం ఉదయం మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో పెన్షన్లు పంపిణీ చేసిన అనంతరం మసీదు సెంటర్‌లో ఏర్పాటుచేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరి దయ, ఆశీస్సులతో నాలుగోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశానని తెలిపారు. టీడీపీని ఆదరించిన గ్రామంలో పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. మంగళగిరిలో గత ఎన్నికల్లో లోకేశ్ ఓడిపోయారని.. అయినా పట్టు వదలకుండా మళ్లీ ఇదే నియోజకవర్గంలో పట్టు సాధించి మీ అభిమానంతో ఎమ్మెల్యేగా 91 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారని.. గాజువాక, భీమిలి తర్వాత భారీ మెజారిటీ వచ్చిన నియోజకవర్గం మంగళగిరేనని.. ఈ నియోజకవర్గ ప్రజలను గౌరవించే బాధ్యత తమపై ఉందని వివరించారు. ఎప్పుడూ జరగని అభివృద్ధిని నియోజకవర్గంలో చేసి చూపిస్తామన్నారు. 'గత ఐదేళ్లలో ఇలా సంతోషంగా కూర్చొని మాట్లాడుకుంది ఒక్క రోజు కూడా లేదు. నిద్ర లేస్తే టెన్షన్.. మనింటికి ఎప్పుడు ఎవడొస్తాడో తెలియదు. మా ఇంటికి కూడా ఎప్పుడొస్తారో తెలీదు. ఒక్కరనే కాదు. అధికారులు, ప్రజలు, రాజకీయ నేతలు అందరూ అలానే బతికారు. ఇకపై అందరం గౌరవంగా బతకాలి' అని తెలిపారు. 'ప్రజలకు మాపై చాలా ఆశలున్నాయి. కానీ అన్నీ రాత్రికి రాత్రే జరిగిపోవు. రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో అర్థం కావడం లేదు. తవ్వుతున్న కొద్దీ తప్పులు, అప్పులే కనబడుతున్నాయి' అని అన్నారు. ఐదేళ్ల రాష్ట్ర బ్రాండ్ దెబ్బతీశారని జగన్‌పై ధ్వజమెత్తారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలంటే భయపడుతున్నారని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

ఇంటింటికీ వెళ్లి ఇవ్వండంటే..

ఎన్నికల సమయంలో వలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేయొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంచాలని చెబితే నాటి ప్రభుత్వం కుదరదని చెప్పింది. వృద్ధులను సచివాలయాల చుట్టూ తిప్పి 33 మంది ప్రాణాలు తీశారు. అందుకే ఇప్పుడు 1.20 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పెన్షన్లు అందిస్తున్నాం. పెనుమాకలో 2,595 మంది వివిధ రకాల పెన్షన్లు తీసుకుంటున్నారు. గుంటూరు జిల్లా మొత్తం 2,61,588 మందికి, రాష్ట్రంలో 65.31 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నాం. ఎంత కష్టపడైనా సరే సంపద సృష్టించి ఆదాయం పెంచుతాం. పేదలకు ఖర్చు చేస్తాం. దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాం. పూర్తిగా నడవలేని స్థితిలో ఉండే వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచాం. కిడ్నీ, గుండె సమస్య, తలసేమియాతో బాధపడేవారికి రూ.10 వేలు అందిస్తున్నాం. ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా ఉంటా.

ఎండల్లో తిప్పి 33 మందిని చంపేశారు!

మే నెల ఎండల్లో ముసలివాళ్లను కార్యాలయాల చుట్టూ తిప్పి 33 మందిని జగన్ ప్రభుత్వం చంపేసింది. గ్రామ సచివాలయాల్లో లక్షా 20వేల మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరు 40-50 మందికి పెన్షన్లు ఇస్తే అయిపోతుంది. ఈరోజు ఆ పట్టుదలతోనే గ్రామ సచివాలయ సిబ్బందితో ఒకే రోజు రాష్ట్రమంతటా పెన్షన్ల పంపిణీని పూర్తి చేస్తున్నాం. మాది ప్రజల ప్రభుత్వం. మేమెప్పటికీ మీకు సేవకులుగానే ఉంటాం తప్ప.. ఎన్నటికీ పెత్తందార్లుగా వ్యవహరించం.

పరదాలు కడితే షాక్ ట్రీట్‌మెంటే

- 1995 నాటి సీఎంను చూస్తారు.. సీఎం హెచ్చరిక

ప్రజావేదిక కార్యక్రమంలో చంద్రబాబు, లోకేశ్ నడుమ సరదా సంభాషణ సాగింది. అధికారులు కుదురుకునేందుకు ఇంకా టైమ్ పడుతుందనుకుంటా సర్.. ఇంకా పరదాలు కడుతున్నారని.. బతిమిలాడి తీయిస్తున్నామని లోకేశ్ చెప్పారు. అలాంటివి పునరావృతమైతే పరదాలు కట్టిన వారిని సస్పెండ్ చేయడం తప్ప వేరే మార్గం ఉండదని చంద్రబాబు హెచ్చరించారు. పరదాలు కట్టాలన్న ఆలోచన వస్తే షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అధికారులు చెప్పిన ప్రకారం నడచుకోకపోతే మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారని స్పష్టం చేశారు. తప్పు చేస్తే మాత్రం ఎవరినీ వదిలిపెట్టను. లోకేశ్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులందరూ దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి' అన్నారు. ప్రజావేదికలో నెమలికంటి పద్మ అనే స్థానిక మహిళ మాట్లాడుతూ.. జగన్ రాజధాని విశాఖకు తరలిపోతుందన్నప్పుడల్లా ఏడ్చుకునే వాళ్లమన్నారు. సీఎం బదులిస్తూ.. 'రాజధాని తరలిపోతుందని గతంలో అమరావతి ప్రజలు బాధపడ్డారు. రాజధాని వస్తుందేమోనని విశాఖవాసులు భయపడ్డారు' అన్నారు.

ఏపీలో చంద్రోదయం మొదలైంది: లోహిత్

ఏపీ ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగి, చంద్రోదయం మొదలైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిష్టా లోహిత్ పేర్కొన్నారు. ప్రభుత్వం మారితే ప్రజల తలరాతలు మారతాయని ఏపీలో రుజువవుతోంది. 'మీ భద్రతే మా బాధ్యత' అన్న సీఎం చంద్రబాబు ఆ దిశగా ఇంటింటికీ తిరిగి పెన్షన్లు పంపిణీ చేస్తూ ఆత్మబంధువుగా నిరూపించుకున్నారు' అని ఎక్స్‌లో అన్నారు.

నిరుపేద ఇంటికి నడిచొచ్చిన నాయకుడు

- పెనుమాకలో గిరిజనుడి గుడిసెకు చంద్రబాబు
- ఉబ్బితబ్బిబ్బయిన రాములు నాయక్ కుటుంబం

మంగళగిరి, జూలై 1: అదో గుర్రపు పాక వంటి పూరి గుడిసె. మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో ఉంది. పేదరికాన్ని చాటుతూ దయనీయ స్థితిలో ఉంది. ఆ కాలనీలో మిగతా నివాసితులందరూ పక్కా గృహాల్లో నివసిస్తున్నప్పటికీ... ఈ పూరి గుడిసె మాత్రమే వెక్కిరిస్తున్నట్లుగా కనిపిస్తుంది. దాని యజమాని బాణావత్ పాములు అలియాస్ రాములు నాయక్. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ ఆ కాలనీలో ఆగింది. ఆయన తన వాహనం దిగి నేరుగా ఆ గుడిసె వైపు కదిలారు. జీవితంలో ఎన్నడూ నమ్మలేని రీతిలో ఓ సీఎం అనుకోని అతిథిగా రావడంతో నాయక్ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. నాయక్, భార్య సీత, కుమార్తె ఇస్లావత్ సాయి ఆయనకు పాదాభివందనం చేశారు. చంద్రబాబు వారిని వారిస్తూ లోపలకు దారితీశారు. ఆ గుడిసెకు చుట్టూ గోడలు లేవు. కానీ ఇంటిని వరండా, లోపలి గదిగా విభజిస్తూ మధ్యలో చిన్న గుమ్మంతో కూడిన మట్టి గోడ ఉంది. చంద్రబాబు గుమ్మంలో వంగి లోనికి వెళ్లారు. లోపల చూస్తే మట్టి నేల, రెండు కుక్కి మంచాలు కనిపించాయి. ఆయన మరేమీ ఆలోచించకుండా ఓ కుక్కి మంచంలో కూర్చున్నారు. తనకో వైపు సాయి, ఇంకోవైపు ఆమె కుమారుడు కల్యాణ్‌ను కూర్చోబెట్టుకున్నారు. మరో మంచంలో నాయక్, సీత, ఇంకో మనవడు పవన్ కూర్చున్నారు. చంద్రబాబు ముందుగా వారిని పరిచయం చేసుకుంటూ సచివాలయ ఉద్యోగితో పింఛన్ పంపిణీకి సంబంధించి వారి నుంచి వేలిముద్రలను తీయించారు. అనంతరం నాయక్‌కు వృద్ధాప్య పెన్షన్ కింద రూ.7 వేలు, సీతకు రాజధాని ప్రాంతంలో భూమిలేని పేదలకు సీఆర్‌డీఏ ఇచ్చే వ్యవసాయ కూలీ పెన్షన్ రూ.5 వేలు, వారి కుమార్తె ఇస్లావత్ సాయికి వితంతు పెన్షన్ కింద రూ.4 వేలను స్వయంగా అందజేశారు. అనంతరం నాయక్ భార్య టీ కాచి చిన్న స్టీలు గ్లాసులో పోసి ఇవ్వగా ఆయన తాగారు. వారి స్థితిగతులను విచారించారు. చుట్టుపక్కల వారంతా పక్కా ఇళ్లలో ఉంటే మీరు పూరి గుడిసెలో ఉండిపోయారేమిటని నాయక్‌ను ప్రశ్నించారు. అతడు సమాధానమిస్తూ.. తాను గతంలో కౌలు చేస్తూ రూ.8 లక్షలు నష్టపోయానని. దీంతో ఆర్థిక పరిస్థితి తల్లకిందులైందని చెప్పాడు. తాను పొలాల్లో మందులు కొడుతూ ఆ వచ్చే కొద్దిపాటి డబ్బులతో కుటుంబాన్ని ఈదుకొస్తున్నట్లు తెలిపాడు. తనకు ఇల్లు కట్టించి సాయం చేయాలని అభ్యర్థించగా.. సీఎం తక్షణమే స్పందించారు. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద రూ.లక్షా 80 వేలు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

పింఛనుదారుల పెద్దమనసు!



రాజధాని కోసం పింఛన్ సొమ్ము 7వేలును మంత్రి సత్యకుమార్‌కు విరాళంగా..



మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు రూ.3 వేలు విరాళం అందిస్తున్న దివ్యాంగురాలు

రాజధానికి పింఛన్ మొత్తం

- ఉదారత చాటుకున్న వృద్ధులు

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం శివానగర్‌కు చెందిన నారాయణమ్మ తన పింఛన్ సొమ్మును వృద్ధురాలు నారాయణమ్మ రాజధాని అమరావతి నిర్మాణానికి విరాళంగా అందజేసి ఉదారత చాటుకున్నారు. ఆ మొత్తం మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేశారు.

అమరావతికి సగం పింఛన్

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని కొత్తూరుకు చెందిన దివ్యాంగురాలు పలివెల ఉమాదేవి తనకు వచ్చిన పెన్షన్‌లో రూ.3 వేలను రాజధాని అమరావతి అభివృద్ధి నిధికి విరాళంగా ఇచ్చారు. మంత్రి సుభాష్‌కు దానిని ఆమె అందజేశారు. చంద్రబాబు ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలకు పెంచడంతో ఉమాదేవి భావోద్వేగానికి గురయ్యారు.



అమరావతికి 3 వేలు విరాళం

తూర్పుగోదావరి జిల్లా తీపర్రు కు చెందిన రజక వృత్తిదారు నందమూరి విశ్వనాథం పెన్షన్‌లో రూ.3 వేలను అమరావతికి ఇచ్చారు. మంత్రి దుర్గేశ్‌కు ఆ నగదు అందజేశారు.

వలంటీర్లు లేకుండానే పింఛన్లు..

బాబు అనుభవంతోనే ఇది సాధ్యం!

- గత ప్రభుత్వ అరాచకాలు సరిదిద్ది రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లగలిగేది ఆయనే: పవన్
- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ



పిఠాపురంలోని గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ సభలో పవన్ కల్యాణ్

కాకినాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ జరగదని గత వైసీపీ ప్రభుత్వం దుష్ప్రచారం చేసిందని.. కానీ దానిని పటాపంచలు చేస్తూ వారు లేకుండానే పింఛన్లు పంపిణీ చేశామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు అపార అనుభవం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వ అరాచకాలను సరిదిద్ది రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లగలిగేది ఆయనేనని తేల్చిచెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని మండిపడ్డారు. అధికార వ్యవస్థ మొత్తాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి వ్యవస్థలను బాగుచేసే పనిలో ఉన్నామని, తమది కరెక్షన్ ప్రభుత్వమని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత, డిప్యూటీ సీఎం హోదాలో ఆయన తొలిసారి సోమవారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ సభలో ప్రసంగించారు. తెలిపారు. పిఠాపురంలో స్థలం కోసం చూస్తున్నానని, ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ఒక్కొక్కరి నుంచి రూ.300 లంచం!

చంద్రబాబు అపార అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన అనుభవం వల్లే ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వగలుగుతున్నాం. గత ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ ద్వారా పంపిణీ చేసింది. వీరేమో ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.300 వరకు లంచంగా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే పెన్షన్లు రద్దు చేస్తారని వైసీపీ ప్రచారం చేసింది. కానీ ఏమైంది..? ప్రతి ఒక్కరికీ రెట్టింపు డబ్బులు వచ్చాయి. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగికి బాధ్యత ఉంటుంది. కానీ ప్రైవేటు ఉద్యోగికి బాధ్యత ఉండదు. వలంటీర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి ఎలాగా అని ఆలోచిస్తున్నాం.

ఎన్ని తిట్టినా పట్టించుకోం..

పౌరసరఫరాల శాఖలో ఎంత అవినీతి జరిగిందో చూడండి. ప్రజల బియ్యాన్ని గోడౌన్‌లో ఎలా దాచారో అంతా చూడాలి. ఇది పేదల డబ్బు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలను చంపేసి వ్యక్తులు పెరిగిపోయారు. అడ్డగోలుగా అవినీతి జరిగింది. కడపలో బైరైటీస్ గనులను ఖాళీ చేసేశారు. ఇసుకతోపాటు అనేక వాటిలో గత ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మాది కరెక్షన్ ప్రభుత్వం. మేం ఎవరిపైనా కక్ష సాధించడానికి లేం. వైసీపీ వాళ్లు ఎన్ని తిట్టినా పట్టించుకోం. కాకపోతే వారి తప్పులను బయటకు తీస్తాం. నా జీవితంలో వందల కోట్లు సంపాదించాను. ఆడిటర్ లెక్కలు చూపిస్తే తలనొప్పి వచ్చేది. పన్ను ఎంత కట్టాలని మాత్రమే అడిగేవాడిని. గంట లేదా రెండు గంటలు మాత్రమే నా లెక్కలు చూసేవాడిని. కానీ ప్రజల డబ్బుకు వచ్చేసరికి.. పంచాయతీరాజ్‌శాఖలో లెక్కలు చూస్తూ జనం కోసం ఆడిటర్‌గా మారాను. ఈ శాఖ మంత్రిగా అవగాహన చేసుకోవడానికి చాలా సమయం పడుతోంది. ఎక్కువ మాటలు చెప్పి తక్కువ పని చేయదలచుకోలేదు. పంచాయతీరాజ్‌శాఖలో తవ్వేకొద్దీ గత ప్రభుత్వ బాగోతాలు చాలా బయట పడుతున్నాయి. అడ్డగోలుగా నిధులు దారిమళ్లించేశారు. అసలు ఎటు వెళ్లాయో తెలియదు.

జీతం వద్దన్నాను..

మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక నా క్యాంప్ ఆఫీసుకు మరమ్మతులు చేయించాలని అధికారులు చెప్పారు. వద్దన్నాను. నా కొత్త ఫర్నిచర్ నేనే తెచ్చుకుంటానన్నాను. ఇటీవల అసెంబ్లీకి వెళ్లినందుకు జీతం వస్తుందని అధికారులు చెబితే.. ఇన్ని అప్పులు కనిపిస్తుంటే...తీసుకోవడానికి మనసు అంగీకరించలేదు. వదిలేసుకుంటున్నానని చెప్పాను.

వైసీపీ అవినీతి నేపాల్లో తేలింది!

వైసీపీ పాలనలో అవినీతి నేపాల్‌దాకా విస్తరించిందని పవన్ కల్యాణ్ అన్నారు. అటవీశాఖ మంత్రిగా ఇటీవల తాను సమీక్ష నిర్వహించినప్పుడు ఈ విషయం బయటపడిందని చెప్పారు. శేషాచలం అడవుల్లో లభించే ఎర్రచందనం దుంగలను దేశం దాటించగా.. అవి నేపాల్లో దొరికాయన్నారు. వాటిని వెనక్కి తీసుకురావడానికి సంబంధించిన ఫైలు తన వద్దకు వచ్చిందని చెప్పారు. వైసీపీ పాలనలో ఎర్రచందనం అడ్డగోలుగా దేశాలు దాటిపోయిందని.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడు మిథున్‌రెడ్డి అమ్మేసుకున్నారన్నారు. వీటిని మన చెక్‌పోస్టులు వదిలేస్తే నేపాల్ పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. కాగా, పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల డీఎస్సీ పోస్టులను ప్రభుత్వం ప్రకటిస్తే ఇంతేనా అంటున్నారని, ఒక్క అటవీ శాఖలోనే లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని.. అయితే భర్తీ చేయడానికి ఖజానాలో డబ్బులు లేవన్నారు. త్వరలో ప్రారంభించే అన్న క్యాంటీన్లలో కొన్ని డొక్కా సీతమ్మ క్యాంటీన్లు కూడా ఉంటాయన్నారు.

పూల కార్పెట్‌పై నడిచేందుకు నిరాకరణ

అంతకుముందు పవన్ రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులోని తన నివాసానికి చేరుకున్నారు. నివాసంలోకి వెళ్లే దారిలో గులాబీ పూలతో కార్పెట్‌లా పరచగా.. దానిపై నడిచేందుకు పవన్ సున్నితంగా తిరస్కరించారు.

కనిపించే దేవుడు చంద్రబాబు..



చంద్రబాబు మా గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారు. మాకు పింఛన్ రూ.6వేలు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. నా భర్య, నేను ఇద్దరం వికలాంగులమే. ఒక్కొక్కరికీ రూ.6వేల చొప్పున రూ.12వేలు ఇస్తున్నారు. దీంతో మా సంసార కష్టాలు తగ్గిపోతాయి.

- వడ్డె చెన్నప్ప, దివ్యాంగుడు, బోడబండ గ్రామం, ఎమ్మిగనూరు మండలం, కర్నూలు జిల్లా

బాబు, పవన్ ఫొటోలు పెట్టుకుంటాం



వారాహి యాత్ర సమయంలో జనవాణిలో మా సమస్యలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చాం. సీఎం చంద్రబాబుకు వివిధ సందర్భాల్లో వివరించాం. మంచానికి పరిమితమైన దివ్యాంగులకు రూ.10వేలు అడిగితే రూ.15వేలు చేశారు. మా ఇళ్లల్లో చంద్రబాబు, పవన్ ఫొటోలు పెట్టుకుంటాం.

- మేడిశెట్టి నాగమణి, దివ్యాంగురాలు, గొల్లప్రోలు, కాకినాడ జిల్లా

నా పెద్దకొడుకు చంద్రబాబు



ఉన్న ఒక్క కొడుకు చూసుకోవడం లేదు. పూరి గుడిసెలో ఉంటున్నా. ఎవరో ఇంత కూడు పెడితే తిని కాలం చేస్తున్నా. చంద్రబాబే నా పెద్దకొడుకు. ఇచ్చిన మాట ప్రకారం ఒక్కసారే పింఛన్ రూ.వెయ్యి పెంచాడు. ఈదినం రూ.7వేలు ఇచ్చినారు. నేను చంద్రబాబు వద్దకు పోలేను. నాకు బాబు ఫొటో ఇవ్వండి.. ఒక్కసారి నా పెద్దకొడుకు కు ముద్దు పెడతా.

- మంగమ్మ, సాదాపురం, ఆదోని మండలం, కర్నూలు జిల్లా

చాలా ఆనందంగా ఉంది



మంచం దిగలేను. ఎలాంటి ఆదాయంలేని నేను కుటుంబానికి భారం కాకుండా ఏదోలా చేదోడు అందించేందుకు చంద్రబాబు అందించిన పింఛను దోహదపడుతోంది. ఇది ఇంటిలో నాకు గౌరవాన్ని మరింత పెంచింది. రూ.7వేలు పింఛన్ అందుకున్నాను. చాలా ఆనందంగా ఉంది.

- ఆర్.లక్ష్మీనరసింహమ్మ, విజయనగరం

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


గన్నవరం విమానాశ్రయంలో జవాన్లకు నివాళులర్పిస్తున్న గవర్నర్ ఏడీసీ మేజర్ దీపక్ శర్మ

అమర జవాన్లకు నివాళులు

- గన్నవరం ఎయిర్‌పోర్టులో నివాళులర్పించిన గవర్నర్ ఏడీసీ
- ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలింపు

అమరావతి(ఆంధ్రజ్యోతి), గన్నవరం, రేపల్లె, గిద్దలూరు, జూలై 1: జమ్మూకశ్మీర్‌లో లద్దాక్ వద్ద ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు సైనికుల్లో ముగ్గురు ఏపీకి చెందిన వారు. వారి పార్థివ దేహాలను ప్రత్యేక విమానంలో సోమవారం గన్నవరం విమానాశ్రయానికి తీసుకొచ్చారు. జూనియర్ కమిషనర్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి, సైనికుడు సాదరబోయిన నాగరాజు, హవల్దార్ సుభాన్ ఖాన్‌ల మృతదేహాలకు విమానాశ్రయంలో ఆర్మీ లాంఛనాలు నిర్వహించారు. గవర్నర్ ఏడీసీ మేజర్ దీపక్ శర్మ, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, డీఎస్పీలు వెంకటరత్నం, జయసూర్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబులెన్స్, ఇతర వాహనాల్లో మృత దేహాలను స్వగ్రామాలకు తరలించారు. అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణా జిల్లా పెడన మండలం చేవేంద్ర గ్రామానికి చెందిన సాదరబోయిన నాగరాజుకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది పాప ఉంది. సోమవారం సాయంత్రానికి నాగరాజు మృతదేహం గ్రామానికి చేరింది. ఆయన కుటుంబ సభ్యులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఓదార్చారు. కలెక్టర్ బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఆర్డీవో వాణి అంత్యక్రియల ఏర్పాట్లు చేశారు. బాపట్ల జిల్లా రేపల్లె మండలం కైతేపల్లి పంచాయతీ ఇస్లాంపూర్‌కు చెందిన సుభాన్‌ఖాన్ 17 ఏళ్ల క్రితం సైనికుడిగా చేరి అంచెలంచెలుగా హవల్దార్ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం ఈఎంఈ మెకానికల్ విభాగంలో పని చేస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుభాన్‌ఖాన్‌కు భార్య మాయా మున్నీసా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, సుభాన్‌ఖాన్‌కు నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాలువపల్లి గ్రామానికి ముత్తుముల రామకృష్ణారెడ్డి మృతదేహం సోమవారం రాత్రి గ్రామానికి చేరుకుంది. మంగళవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపేందుకు మిలటరీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

కలిచివేసింది: చంద్రబాబు

రాష్ట్రానికి చెందిన ముగ్గురు సైనికులు చనిపోవడం తననెంతో కలిచివేసిందని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. నివాళులర్పించారు.

కోటి పరిహారం ఇవ్వండి: జగన్

మృతి చెందిన జవాన్ల ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందించాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021లో అమరులైన జవాన్లు జశ్వంత్‌రెడ్డి, సాయితేజ కుటుంబాలకు నాడు జగన్ రూ.50 లక్షల చొప్పున చెల్లించారు.

రాష్ట్రస్థాయి చెస్ సెలక్షన్స్ విజేతలు వీరే

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో స్పార్క్ చెస్ అకాడమీ, స్ప్రింగ్‌బోర్డు ప్లేస్కూల్ సంయుక్త నిర్వహణలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి చెస్ ఎంపిక పోటీల్లో విజేతలను నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. వీరు త్వరలో జరిగే అంతర్జాతీయ ఫిడేరేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని టోర్నీ డైరెక్టర్ తాళ్ల నరేష్ తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మందుల రాజీవ్, సీనియర్ ప్లేయర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

టాప్-10 ప్లేయర్స్ వీరే: 10 మందిని ఓపెన్ టాప్ టెన్ విజేతలుగా ప్రకటించారు. రవికుమార్, అబ్రహం, నాగ ఉదయ్, సత్యసాయి, వెంకట సుబ్బారావు, నిరంజన్, శివదత్త, మనోజ్, సుశాంత్ శర్మ, వేదాంత్ ప్రైజ్‌మనీ అందుకున్నారు. అండర్-7 బాలబాలికల్లో జె.మంగూస్, గిరిజన్, ఏపీఎస్ కావ్య, పి.జోషిక, అండర్-9లో పి.జశ్వంత్, కె.శౌర్య, హెరిజైన్, పి.లాలిత్య, అండర్-11లో ఏ శశాంక్, తేజ వజ్రాక్ష్, లక్ష్మి వినూత్న, నారాయణ రిషిత, అండర్-13లో వి.హేమంత్, కె.చిరాగ్, శ్రీలాస్య, తేజ, అనూష, అండర్-15లో ప్రీతమ్ దర్శన్, ఎ.చరణ్, సాయి దివ్య, ఎ.మోక్షశ్రీ విజేతలుగా నిలిచారు.

గాంధీ బ్యాంకుకు కౌంట్‌డౌన్ స్టార్ట్

పాలకవర్గం అక్రమాలపై మొదలైన సహకార శాఖ విచారణ

- సోమవారం రోజంతా బ్యాంకులోనే..
- నష్టాల్లో జంక్షన్, నూజివీడు బ్రాంచీలు
- ఎన్నికల్లో వైసీపీకి ప్రచారం చేసిన చైర్మన్
- టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన డైరెక్టర్

విజయవాడ-ఆంధ్రజ్యోతి: నగరంలోని గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు అక్రమాలపై ఎట్టకేలకు సహకార శాఖ దృష్టి సారించింది. వైసీపీతో అంటకాగిన బ్యాంకు పాలకవర్గం వైసీపీ హయాంలో తమకు ఎదురే లేదన్నట్టు చెలరేగింది. గత ఎన్నికల్లో బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావుతోపాటు పలువురు డైరెక్టర్లు వైసీపీ తరపున ప్రచారం చేశారు. బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న జోగరాజు ఏకంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడిలో కీలకపాత్రధారి. ఉమ్మడి కృష్ణాలో వైసీపీ అభ్యర్థులకు డబ్బులు పంపిణీలోనూ బ్యాంకు బ్రాంచీలను అడ్డాలుగా వాడుకున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్నేళ్లుగా బ్యాంకు పనితీరుపై ఆరోపణలు వస్తున్నా వైసీపీ నేతల అండతో అధికారులు పట్టించుకునేవారు కాదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు అధికారుల్లో కదలిక వచ్చింది. సోమవారం బ్యాంకు అక్రమాలపై విచారణకు సిద్ధమయ్యారు. రోజంతా బ్యాంకులోనే ఉండి రికార్డులు పరిశీలించారు. హనుమాన్ జంక్షన్, నూజివీడులోని బ్రాంచీలు నష్టాల్లో నడుస్తున్నాయి. ఈపరిస్థితుల్లో పొదుపు చర్యలు పాటించి, లాభాల బాట పట్టించాల్సిన పాలకవర్గం సొంత భవనాల నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చించి స్థలాలు కొన్నారు. ఈ కొనుగోలులో పెద్ద ఎత్తున డబ్బులు స్వాహా జరిగాయన్న ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు ఆరాతీశారు. ఆర్‌బీఐ ముందస్తు అనుమతి లేకుండానే గాజువాకలో బ్రాంచి ఏర్పాటుకు రూ.37 లక్షలు ఎందుకు ఖర్చు చేయాల్సి వచ్చిందన్న అంశంపై అధికారులు విచారణ జరిపినట్టు సమాచారం. ఇక్కడ బ్రాంచీ ప్రారంభం కాకుండానే నెలకు రూ.లక్ష అద్దెరూపంలో చెల్లిస్తుండటం గమనార్హం.


ఎన్నికల్లో వైసీపీ తూర్పు అభ్యర్థి అవినాశ్ సతీమణితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న బ్యాంకు చైర్మన్ (ఫైల్ ఫొటో)

జోగరాజు ఎక్కడ?

ఆదివారం జరిగిన బ్యాంకు మహాజన సభకు చైర్మన్ సహా డైరెక్టర్లందరూ హాజరైనా జోగరాజు మాత్రం రాలేదు. ఆయనతో రాజీనామా చేయించి పాలకవర్గంపై పడిన వైసీపీ ముద్రను చెరిపేందుకు ఆయన్ను భయపెట్టి సమావేశానికి దూరంగా ఉంచారని సమాచారం. బ్యాంకు సీఈవోగా నియమితులైన అధికారిణికి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఉండాల్సిన విద్యార్హతలు లేవని సభ్యులు ఆరోపిస్తున్నారు. సీఈవో భర్తకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఉండగా ఆదివారం సమావేశం బాధ్యతలు ఈ కంపెనీకే కట్టబెట్టారు. ఈ ఖర్చు చూస్తే కళ్లు తిరిగిపోతాయి. ఒక్క టిఫిన్ కోసమే ప్లేటుకు రూ.450 చెల్లించడం గమనార్హం. మొత్తం సమావేశ నిర్వహణ ఖర్చు లక్షల్లోనే చూపించనున్నట్టు సమాచారం.



వైసీపీ నేతల కాసుల ఆశ!

- ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు

విజయవాడ-ఆంధ్రజ్యోతి: వైసీపీ హయాంలో జరిగిన అడ్డగోలు అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కాసుల కక్కుర్తితో ప్రజల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైసీపీ నేతలు వ్యవహరించిన తీరుపై స్థానికులు భగ్గుమంటున్నారు. వన్‌టౌన్‌లో చిన్నస్థలం కూడా బంగారంతో సమానం. దీంతో ఇక్కడ అనధికార నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తుంటాయి. వైసీపీ హయాంలో స్థానిక ఎమ్మెల్యే కానీ కార్పొరేటర్లు కానీ ఈ అనధికార భవనాలతోనే పబ్బం గడుపుకుంటూ కోట్లాది రూపాయలు ఆర్జించారు. కాసులకు ప్రాధాన్యమిచ్చిన వీరు ప్రజల ప్రాణాలను లెక్క చేయలేదు. అందుకు నిలువెత్తు నిదర్శనమే వన్‌టౌన్ 38వ డివిజన్ అర్జునవీధిలో కేవలం 100 గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఐదంతస్తుల భవనం. భవన యజమాని నుంచి అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అనుచరులు సుమారు రూ.20 లక్షలు, స్థానిక కార్పొరేటర్ రూ.5 లక్షలు వరకు వసూలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణానికి సహకరించారు. ప్రస్తుతం ఆ భవనంలో నూనెలు, ప్లాస్టిక్ వస్తువుల గోదాములు వెలియడంతో చుట్టుపక్కలున్నవారు బెంబేలెత్తుతున్నారు. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు తీసుకోకుండానే మండే గుణమున్న వస్తువుల గోదాం ఏర్పాటు చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్పందనలో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌కు ఈ అనధికార భవన నిర్మాణంపై ఫిర్యాదు చేశారు.

కొత్తయుగం సాంకేతికతలతో చికిత్స విధానాలు

- అంతర్జాతీయ సదస్సులో వక్తలు

మొగల్రాజపురం, జూలై 1: పీబీ సిద్ధార్థ కళాశాలలో సోమవారం రసాయన శాస్త్ర విభాగం, ఏపీ అకాడమీ సైన్స్ సంయుక్తంగా కొత్తయుగం సాంకేతికతలతో చికిత్స విధానాలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ నవతరం మాలిక్యూల్ థెరప్యూటిక్స్ రూపకల్పన, అభివృద్ధి, సెలీనీయం, టార్గెటెడ్ చిన్న అణువులను యాంటీ కాన్సర్ రూపొందించడం, పర్యావరణ సాంకేతిక పరిజ్ఞానాలను పనితీరు మెరుగు పరచే నానో టెక్నాలజీ ప్రభావం, ఆక్సీకరణ ప్రక్రియలో సెమీ కండక్టర్ మెటల్ ఆక్సైడ్ సూక్ష్మపదార్థాలు, రాతియుగం నుంచి నానో యుగం వరకు శాస్త్రీయ పురోగతి గురించి మాట్లాడారు. సదస్సులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు, అమెరికా సైంటిస్ట్ అరుణ్‌కుమార్ శర్మ, దీపక్ సింహ, ఉపాసన బోర, నాగాలాండ్ విశ్వ విద్యాలయం, ప్రభాకర్‌రావు విజ్ఞాన్ వర్సిటీ, సీహెచ్ సుబ్రహ్మణ్యం ఐఐటీ హైదరాబాద్, ప్రొఫెసర్ బసవేశ్వరరావు, పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మనోరంజని, అధ్యాపకులు డాక్టర్ టీఎన్‌వీఎస్ఎస్ సత్యదేవ్, డాక్టర్ ఎం.డేవిడ్ రాజు, పీటీఎస్ఆర్‌కే ప్రసాద్, నాగార్జున బాబు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ఏడాదిగా ఆగని వరకట్న వేధింపులు

- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



జవహర్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లై ఏడాది గడిచినా అదనపు కట్నం కావాలని భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన వివాహిత ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ చిట్టినగర్‌కు చెందిన వేముల శ్రావణి (23) కి నాగులపంచ హేమసుందర్‌తో 2023లో వివాహమైంది. వృత్తిరీత్యా ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండటంతో దమ్మాయిగూడాలోని ఎంఎల్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. పెళ్లి సమయంలో కట్నకానుకలతో పాటు కొంత నగదు హేమసుందర్‌కు అందజేశారు. అయినా అదనపుకట్నం కావాలంటూ వేధించడం ప్రారంభించాడు. అంతేకాక పెళ్లై ఏడాదైనా పిల్లలు పుట్టలేదన్న నెపంతో అత్తమామలు వేధిస్తుండటంతో మనస్తాపం చెంది గతనెల 30న ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు ధ్రువీకరించారు. మృతురాలి భర్త, అత్తమామల వేధింపులే తన కుమార్తె మృతికి కారణమంటూ తండ్రి ఏడుకొండలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భక్తుల సదుపాయాలపై ఈవో సమీక్ష



వన్‌టౌన్, జూలై 1: దుర్గగుడిలో భక్తులకు కల్పించే సదుపాయాలను మరింతగా మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఈవో రామారావు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు శీఘ్రంగా దుర్గమ్మ దర్శనం కల్పించడంతో పాటు శానిటేషన్‌ను మెరుగు పరచడం, వసతి సౌకర్యం, పార్కింగ్ అంశాలపై చర్చించారు. ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఐటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ అలంకరణకు బంగారు గాజులు

కనకదుర్గమ్మ అలంకరణకు చెన్నైలోని పాదూరు ఓఎంఆర్‌కు చెందిన ఎన్ఎస్ గీతాకృష్ణ 15 గ్రాముల బరువున్న 2 బంగారు గాజులను కానుకగా అందజేశారు. సోమవారం ఆలయానికి వచ్చిన ఆమె డిప్యూటీ ఈవో లీలాకుమార్‌ను కలిసి ఆయన ద్వారా దేవస్థానానికి కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం దాతకు అందజేశారు.

కోలాహలంగా కోలాట ప్రదర్శన



దుర్గగుడి ధర్మపథం వేదికపై సోమవారం ఏలూరుకు చెందిన చినవెంకన్న ఆధ్వర్యంలోని కోలాట బృందం కోలాహల వాతావరణంలో కోలాట ప్రదర్శనలు చేశారు. అమ్మవారి సన్నిధిలో చేసిన ఈ నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. వివిధ సంప్రదాయ కీర్తనలను జోడించి కోలాటం వేశారు. మహిళలు చక్కని నృత్య భంగిమలతో కోలాటం వేశారు. నెత్తిన కలశాలను పెట్టుకుని చేసిన కోలాట నృత్యం ఆకట్టుకుంది. ఈవో రామారావు బృందాన్ని అభినందించి జ్ఞాపికను అందచేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

ఐఏఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ

ధర్నాచౌక్, జూలై 1: విద్యాదర్శిని ఐఏఎస్ అకాడెమీ ఆధ్వర్యంలో ఐఏఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నిర్వహించనున్న ఉచిత శిక్షణా తరగతుల పోస్టర్‌ను మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులను అభినందించారు. అకాడెమీ చైర్మన్ జి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తాము నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఈ తరగతుల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా బెంజ్‌సర్కిల్‌లోని తమ అకాడెమీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 93461 96829 నంబర్లో సంప్రదించాలన్నారు.


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ పుష్పవల్లి

విద్యార్థుల్లో ఉపగ్రహాల సాంకేతికతపై అవగాహన పెరగాలి: డాక్టర్ జల్లూరి

వన్‌టౌన్, జూలై 1: విద్యార్థుల్లో ఉపగ్రహాల సాంకేతికతపై అవగాహన పెరగాలని ఇస్రోశాస్త్రవేత్త డాక్టర్ జల్లూరి పుష్పవల్లి తాయారమ్మ అన్నారు. కేబీఎన్ కళాశాలలో సోమవారం కళాశాల ఫిజిక్స్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఉపగ్రహాల సాంకేతికత-అనువర్తనాలు- సమగ్ర పరిశీలన అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సామాజిక వికాసానికి ఉపగ్రహాలు అండగా ఉండడం శాస్త్రీయ పరిశోధనలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థిని తాయారమ్మ ఇస్రో శాస్త్రవేత్త కావడం గర్వకారణమన్నారు. విభాగాధిపతి ఆర్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు బి శ్రుతి, పీహెచ్‌డీ ప్రకాష్ పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఏటీఎం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీజీఎం

బ్యాంక్ సేవలు మరింత చేరువకే మొబైల్ ఏటీఎం: డీజీఎం

లబ్బీపేట, జూలై 1: వినియోగదారులకు బ్యాంక్ సేవలు మరింత చేరువ చేసేందుకు మొబైల్ ఏటీఎం సేవలను ప్రారంభిస్తున్నట్టు స్టేట్ బ్యాంక్ డీజీఎం మనీష్ కుమార్ సింగ్ తెలిపారు. స్టేట్ బ్యాంక్ 69వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను స్టేట్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు మెడికల్ క్యాంప్‌తో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం మొబైల్ ఏటీఎం సేవల నూతన వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ అందిస్తున్న సేవలతో వినియోగదారులు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వారికి మరింతగా చేరువయ్యేందుకు మొబైల్ ఏటీఎం వాహనాన్ని ప్రారంభించామని, నగరంలోని పలు ప్రాంతాలలో సేవలందిస్తుందన్నారు. బ్యాంక్ ఉద్యోగులు వి.విజయ శేఖర్, ఎ.వి.వి.రాజశేఖర్, వి.ఎస్.ఆర్.శేఖర్, కె.సతీష్, ఎమ్.విజయ మాధవి, కె.ఎస్.రామచంద్రరావు, పి.నాగేశ్వరరావు, కె.డి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జన్యు సవరణలో భారత శాస్త్రవేత్తల పురోగతి

- ఎల్వీప్రసాద్ ఆసుపత్రి వైద్యుల వెల్లడి

పెనమలూరు: భారత జన్యుశాస్త్రవేత్తలు జన్యు సవరణలో చేసిన ఒక ముఖ్యమైన పురోగతి జన్యువ్యాధులకు చెక్‌పెట్టేలా ఉందని, జన్యువ్యాధులకు కొత్త చికిత్సలను అందించే మార్గాన్ని సమకూరుస్తుందని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి పరిశోధక బృంద అధిపతి డాక్టర్ ఇందుమతి మారియప్పన్ తెలిపారు. ఈ మేరకు తమ ఆసుపత్రి పరిశోధక బృందం సహకారంతో చేసిన ఫలితాలను వెల్లడించారు. సీఆర్ ఐఎస్‌పీఆర్ జన్యు పరిష్కరణ వ్యవస్థలో ఉపయోగించే సీఏఎస్9 ప్రోటీన్‌ను మెరుగుపరచడంపై దృష్టి సారించామన్నారు. ఈ కొత్త సాంకేతికత చిన్న వయస్సులోనే తీవ్రమైన దృష్టి లోపానికి దారితీసే ఒక అరుదైన, జన్యుపర కంటి వ్యాధి ఉన్న రోగి నుంచి తీసుకొన్న కణాల్లో పరిశీలించామన్నారు.

పేదలకు ఉచిత నాణ్యమైన వైద్యసేవలకు కృషి: ఎమ్మెల్యే గద్దె

ధర్నాచౌక్: పేదలకు నాణ్యమైన ఉచిత, వైద్యసేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత ఆధ్వర్యంలో స్థానిక వరుణ్ హెల్త్ సెంటర్ ఆవరణలో డాక్టర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న గద్దె రామ్మోహన్ వైద్యులను ఘనంగా సత్కరించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధానకార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ, లయన్స్ క్లబ్ రీజీయన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఏ శరాబందిరావు, జోన్ చైర్మన్ తోట పద్మనాభరావు, జూబ్లీ హరిత అధ్యక్ష, కార్యదర్శులు బెల్లంకొండ శ్రీనివాస ప్రసాద్, కోటా ఫణి, కోశాధికారి జే.శ్రీధర్, సభ్యులు అంకాల సత్యనారాయణ, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రామయ్య, వరుణ్ గ్రూప్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాస ఘటం ప్రధానం

గుణదల: బాలబాలికలకు అక్షరాభ్యాసం ప్రధానమైన ఘట్టమని రవీంద్రభారతి స్కూల్ జీఎం శివారెడ్డి అన్నారు. రామవరప్పాడులోని రవీంద్రభారతి పాఠశాలలో బాలబాలికలకు సాముహిక అక్షరాభ్యాసం సోమవారం నిర్వహించారు. చిన్నారులు తమ తల్లిదండ్రులతో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీంతో పాఠశాలలో వసంతి పంచమిని పురస్కరించుకుని నిర్వహించే సరస్వతి పూజతరహాలో అక్షరాభ్యాసం నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులకు గణపతిపూజ తర్వాత సరస్వతి పూజతో అక్షరాభ్యాసం చేయడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని పాఠశాల జీఎం శివారెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో తమ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. రవీంద్రభారతి పాఠశాల డీన్ శైలజ, ఏజీఎం కేశవరాజు, ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కొత్త సీసాలో పాత సారా..!

- నూతన క్రిమినల్ చట్టాల్లోని మార్పులు ప్రజావ్యతిరేకం
- రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్

విజయవాడ లీగల్, జూలై 1: కొత్తసీసాలో పాత సారా పోసినట్టుగా నూతన క్రిమినల్ చట్టాల తీరు ఉందని రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలో బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్ (రాజా)తో కలిసి ఆయన ప్రజావ్యతిరేక నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని న్యాయవాదులు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయన్నారు. కేంద్రప్రభుత్వం వలస పాలకులు చేసిన చట్టాలను రద్దు చేసి మన చట్టాలను మనమే చేసుకొందామని ప్రగల్భాలు పలుకుతోందని, పేర్లుమార్చి అవే చట్టాలను కొద్ది మార్పులతో కొనసాగిస్తే అవి మన చట్టాలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. 'ఉపా' (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) సెక్షన్ 15ను ఈ నూతన చట్టాల్లోకి తీసుకొచ్చారని, అది దుర్మార్గమైన చర్యని సుంకర, బార్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, రాజా పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులంతా ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ సృజనకు వినతిపత్రం అందచేశారు. జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతి కుమార్, న్యాయవాదులు బొమ్మసాని రవి, సప్పా రమేష్, ఆలూరి సుధాకరరావు, సంపర శ్రీనివాస్, నరహరిశెట్టి నర్సింహారావు పాల్గొన్నారు.



నూతన క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలంటూ న్యాయవాదుల నిరసన

నిందితులకు కఠిన శిక్షలే కొత్తచట్టాల ముఖ్యోద్దేశం: బైరా

బాధితులకు న్యాయం చేసి, నిందితులకు కఠిన శిక్షలు వేయడమే కొత్త చట్టాల ముఖ్యోద్దేశమని అదనపు డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు అన్నారు. ప్రథమ సమాచార నివేదికని ఏ పోలీసు స్టేషన్‌లో ఇచ్చినా తప్పనిసరిగా రిజిస్టర్ చేసి సంబంధిత పోలీసు స్టేషన్‌కు పంపాలన్నారు. ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. మహిళలపై నేరాలను పోలీసు అధికారులు తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ కట్టిన వెంటనే బాధితుడికి ఉచిత కాపీని అందచేయాలన్నారు. మహిళలపై జరిగిన నేరాలకు ప్రైవేటు, ప్రభుత్వాసుపత్రులు ఉచిత వైద్యం అందించాలని లేకుంటే క్రిమినల్‌చర్యలు తీసుకుంటారన్నారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి: దుర్గారావు

ధర్నాచౌక్: మోటార్‌రంగ కార్మికులకు ఉరితాడుగా మారిన భారత న్యాయసంహిత చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఈచట్టాన్ని అమలు చేయాలని ప్రయత్నిస్తే దేశవ్యాప్తంగా ఆటో, మోటారు రంగ కార్మికులు పెద్దఎత్తున నిరసనలు తెలపడంతో వెనక్కు తగ్గి మళ్లీ ఈ చట్టం అమలుకు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ చట్టం అమలైతే ఆటో, మోటార్ రంగ కార్మికుల జీవనోపాధి పూర్తిగా దెబ్బతిని నిరుద్యోగులుగా మారుతారన్నారు. తూర్పు సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి బి.రూబెన్‌కుమార్ అధ్యక్షతన జి.వెంకట్రావ్, ఈవీ నారాయణ, ఎం.హనుమంతరావు, కార్మికులు పాల్గొన్నారు.

లైసెన్స్ సర్వేయర్ల ఉపాధికి కృషి

ధర్నాచౌక్: లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా జి.మనోహర్ కిషోర్, అజయ్‌బాబు, ఉపాధ్యక్షులుగా కేవీ మూర్తి, బి.రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.సాయి, సూరపనాయుడు, ముని ప్రసాద్, ఎస్.రవికుమార్, కోశాధికారిగా ఎస్.రాంబాబు ఎన్నికయ్యారు. లైసెన్స్ సర్వేయర్ల ఉపాధి కోసం ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని జి.మనోహర్ కిషోర్ తెలిపారు. మాజీ అధ్యక్షుడు పి.సంతోష్, లీలా కృష్ణ, పోతురాజు, సీహెచ్.శ్రీనివాసరావు, ఏవీఎన్ కిరణ్ పాల్గొన్నారు.

పింఛను పెంపుతో కొండంత ధైర్యం: పావని



పటమట, జూలై 1: స్థానిక హైస్కూల్ రోడ్డు నారాయణ టీస్టాల్ పక్కనందు రామినేని వారి వీధిలో నల్లూరు మురళీకృష్ణ, పావని దంపతులు నివాసముంటున్నారు. వీరిది మధ్యతరగతి కుటుంబం. మురళీకృష్ణ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు సంతానం, పాప నేహశ్రీ శ్రీ హైపర్ యాక్టివిటీతో బాధపడుతోంది. పుడుతూనే 100 శాతం మానసిక వికలాంగురాలుగా జన్మించింది. బాబు పార్థు జన్యుపరమైన లోపాలతో జన్మించాడు. పిల్లలిద్దరూ మానసిక వికలాంగులు కావడంతో తల్లి పావని అన్ని తానై అయి సాకుతోంది. వీరిద్దరూ పటమట ఆర్మ్ మానసిక పాఠశాలలో చదువుతున్నారని, బాబు మందులకు నెలకు రూ.3 వేలకు పైనే ఖర్చవుతుందని, స్కూల్ ఫీజులు కట్టలేని పరిస్థితి అని పేర్కొంది. ఈ నెల్లో పిల్లలిద్దరికీ హైస్కూల్ రోడ్డు సచివాలయ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావు పింఛను అందించారని పావని ఆనందాన్ని వ్యక్తం చేశారు. 100 శాతం వైకల్యంతో ఉన్నవారికి రూ.10వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందనీ, ఆ సదుపాయాన్ని తమ పిల్లలిద్దరికి కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సాంకేతికత తోడ్పాటుతోనే సురక్షిత ప్రయాణం

- ఎమ్మెల్యే యార్లగడ్డ
- శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు కిట్లు, సర్టిఫికెట్ల పంపిణీ


డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యార్లగడ్డ

హనుమాన్ జంక్షన్ రూరల్, జూలై 1: రహదారి భద్రతకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో తోడ్పతాయని, సాంకేతికతతో కూడిన శిక్షణతోనే సురక్షితంగా గమ్యం చేరుకునేలా ప్రయాణం చేయవచ్చని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు డ్రైవర్లకు సూచించారు. అంపాపురంలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ వారి మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటరులో అధ్యక్షుడు నాగమోతు రాజా అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెవీ వెహికిల్ డ్రైవింగ్ పూర్తి చేసుకున్న ట్రైనీలకు సర్టిఫికెట్లను అందజేశారు. 1071బ్యాచ్‌కు చెందిన 26మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని అధ్యక్షుడు నాగమోతు రాజా వివరించారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డను ఘనంగా సత్కరించారు. ఏపీ లారీ ఓనర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, స్టోర్స్ అధ్యక్షుడు కోనేరు వెంకటరమేష్, ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీ రామారావు, రోడ్ సేఫ్టీ ఎన్జీవో.వీడు.ఫౌండర్ డైరెక్టర్ ఎం.వాసు, డి.బి.స్కిల్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జిల్లా లారీ ఓనర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యన్నారాయణ, స్టీరింగ్ కమిటీ సభ్యుడు చెన్నుపాటి వజీర్ పాల్గొన్నారు.

టోకెన్లు ఇవ్వకుండా ప్రసాదం.. భక్తులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వాగ్వాదం

వన్‌టౌన్: దుర్గగుడి మహామండపం దిగువనున్న లడ్డూ ప్రసాదాల కౌంటర్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రామయ్య ఆదివారం టోకెన్‌లు ఇవ్వకుండా భక్తుల నుంచి డబ్బులు తీసుకున్నాడు. దీనిపై భక్తులు ప్రశ్నించగా కంప్యూటర్ పనిచేయడం లేదని సమాధానం ఇచ్చాడు. దీంతో వారు రామయ్యతో వాదనకు దిగారు. కంప్యూటర్ పనిచేయకపోతే తానేం చేస్తానని, తీసుకుంటే తీసుకోండి లేకుంటే లేదని భక్తులకు మరింత ఆగ్రహం తెప్పించాడు. రామయ్య తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో రామారావును వివరణ కోరగా ఆదివారం కంప్యూటర్లు పనిచేయలేదన్నారు.

అవినీతిపరులకు వ్యూహాత్మకంగా ఉచ్చు బిగించాలి



- సిబ్బందితో ఏసీబీ డీజీ అతుల్ సింగ్

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వ్యూహాత్మకంగా అవినీతి పరులకు ఉచ్చు బిగించాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వివిధ రూపాల్లో సమాజాన్ని ఆవహిస్తున్న అవినీతి మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి అధికారి అప్రమత్తంగా, బాధ్యతగా ఉండాలని అన్నారు. విజయవాడ ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న ఏసీబీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన ఏసీబీ డీజీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవినీతిని అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నిజాయితీగా ఉంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకలింపు చేసుకుని అవినీతి పరులకు శిక్షలు పడేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రాయలసీమ, కోస్తా ప్రాంతాల నుంచి ఏసీబీ జిల్లాల అధికారులతో రెండు రోజుల పాటు సమీక్షించి అవినీతి కట్టడికి ప్రణాళికతో కూడిన ఆదేశాలు ఇవ్వబోతున్న అతుల్ సింగ్.. ఎవరికైనా ఇబ్బంది ఉంటే ఏసీబీ నుంచి వెళ్లిపోవచ్చని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది.

ముక్కలైన శాఖను ఒక్కటి చేయండి

- సెబ్ వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు
- ఎక్సైజ్ మంత్రికి జేఏసీ విజ్ఞప్తి

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రెండు ముక్కలైన ఎక్సైజ్ శాఖను తిరిగి ఒక్కటిగా చేయాలని ఎక్సైజ్ ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. కొత్తగా ఏర్పడిన సెబ్‌ను రద్దు చేయాలని, మద్యంతో పాటు అదనంగా అప్పగించిన బాధ్యతలను తొలగించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ నాయకులు బాబ్జీరావు, బి.నర్సింహులు, మార్పు కోటయ్య, రత్నకుమార్ తదితరులు సోమవారం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సెబ్ ఏర్పాటు వల్ల జరిగిన నష్టం, శాఖ ఎలా నిర్వీర్యమైపోయిందనే అంశాలను సవివరంగా మంత్రికి వివరించారు. కేవలం గణాంకాల కోసమే సెబ్‌లో కేసుల నమోదు జరుగుతోందని, ఫలితంగా నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ భారీగా పెరిగిందని తెలిపారు. 2016, 2017 సంవత్సరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నవోదయం కార్యక్రమం చేపట్టి నాటుసారాను పూర్తిగా తుడిచిపెట్టగా, ఈ ప్రభుత్వంలో నిఘా లోపంతో మళ్లీ సారా ప్రవేశించిందన్నారు. సెబ్‌ను పోలీసుల పరిధిలోకి తీసుకెళ్లడం వల్ల వేధింపులు పెరిగాయని, కనీసం క్షేత్రస్థాయి అధికారుల అభిప్రాయాలను కూడా వారు పరిగణలోకి తీసుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెబ్‌ను సృష్టించిన ప్రభుత్వం చివరికి మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయిందని, అసలు ఎందుకు ఈ వ్యవస్థ ఉందో కూడా అర్థంకాని స్థితికి తీసుకెళ్లారని వివరించారు.

పీయుష్‌కుమార్‌కు ప్లానింగ్ అదనపు బాధ్యతలు

- సీఎఫ్ఎస్ఎస్ సీఈవోగా వినయ్‌చంద్

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పీయుష్‌కుమార్‌కు ప్రభుత్వం ప్లానింగ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.గిరిజా శంకర్‌ను రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలానే ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్ అండ్ సర్వీస్ సీఈవోగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి బి.సునీల్‌కుమార్ రెడ్డిని కూడా ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయనను అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

జీఏడీలో రిపోర్టు చేసిన నీలకంఠా రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి

కాగా, గత ప్రభుత్వం కీలకంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారులు నీలకంఠా రెడ్డి, అనిల్ రెడ్డి సోమవారం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేశారు. ప్రస్తుతం నీలకంఠా రెడ్డి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. కడప జిల్లాలోని పులివెందులు ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఓఎస్డీగా అనిల్‌కుమార్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా ఉన్న వీరిద్దరికీ ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించి కీలకమైన స్థానాలను కట్టబెట్టింది. ప్రస్తుత కొత్త ప్రభుత్వం ఆదేశాలతో ఆయా పోస్టుల నుంచి తప్పుకొని జీఏడీఓ రిపోర్టు చేశారు.

మహారాష్ట్ర జలపాతం విషాదంలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యం

పుణే, జూలై 1: మహారాష్ట్రలోని లోనావాల ప్రాంతంలో జలపాతంలో పడి ఓ కుటుంబం కొట్టుకుపోయిన ఘటనలో మరో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వారిని మరియా అన్సారీ(9), అద్నాన్ అన్సారీ(4)గా సహాయక బృందాలు గుర్తించాయి. జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లి... ఆదివారం ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. ఓ మహిళ(36), మరో ఇద్దరు మైనర్ బాలికల మృతదేహాలు కొద్ది గంటల్లోనే వెలికితీశారు. ఇద్దరు చిన్నారుల కోసం సోమవారం గాలింపు చర్యలు చేపట్టిన సహాయక బృందాలకు ఉదయం మరియా, సాయంత్రం అద్నాన్ మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. కాగా, విహార యాత్రకు వెళ్లి కుటుంబం మొత్తం జలసమాధి కావడం అందరిని కలిచివేస్తోంది.

‘మల్లవల్లి’పై మళ్లీ ఆశలు!

- సర్కారు మార్పుతో ముందుకొస్తున్న పారిశ్రామికవేత్తలు
- గత ఐదేళ్లూ చెడుగుడాడిన జగన్ సర్కారు
- కొత్త ప్రభుత్వంపై నమ్మకంతో వారంతా మళ్లీ రాక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్ర విభజన తర్వాత 2014లో నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు పిలుపు మేరకు అనేక మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలోనే కృష్ణా జిల్లా మల్లవల్లిలో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు (మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)ను ప్రారంభించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2015 నుంచి రెండేళ్లపాటు కసరత్తు చేసి 2017లో దాదాపు 1,350 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. దాంతో ఇక్కడ భారీ పరిశ్రమలతోపాటు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను కూడా నెలకొల్పేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఏపీఐఐసీ ద్వారా వందలమంది పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించారు. అశోక్ లేలాండ్, పార్లే వంటి పెద్ద పరిశ్రమలకు రోడ్డు పక్కనే స్థలాలు కేటాయించగా.. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రోడ్డుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో పెద్ద పెద్ద గుంతలతో కూడిన భూములను ప్లాట్లుగా కేటాయించారు. తర్వాత 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. మల్లవల్లి పార్కులో భూములు పొందిన పారిశ్రామికవేత్తలపై రకరకాలుగా వేధింపులకు పాల్పడింది. పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ.. మల్లవల్లి పార్కులోని ప్లాట్లలోకి వెళ్లేందుకు గత ఐదేళ్లలో కనీసం రోడ్డు కూడా నిర్మించలేదు. దాంతో అక్కడ పరిశ్రమలు నెలకొల్పాలనుకున్న చిన్న, మధ్యతరగతి పారిశ్రామికవేత్తలు తమ యూనిట్లను పెట్టలేకపోయారు. అప్పట్లో ఉన్న భూమి విలువ, మౌలిక సదుపాయాల కల్పన రెండింటికీ కలిపి ఎకరానికి రూ.16.5 లక్షలు చొప్పున ఆ రోజుల్లో ఏపీఐఐసీ తీసుకుంది. అయితే ఆ భూముల్లో కొన్నింటిపై హైకోర్టులో కేసులున్నాయి. మరికొన్ని లిటిగేషన్ భూములున్నాయి. ఈ వివాదాలపై పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా.. సేల్ అగ్రిమెంటు రిజిస్ట్రేషన్‌కు రావాలని చెప్పారు. వివాదాస్పద భూములు తమకు వద్దని, ఎలాంటి వివాదాలూ లేని భూములు ఇవ్వాలని పారిశ్రామికవేత్తలు కోరారు. తమ సమస్యను పరిష్కరిస్తేనే అగ్రిమెంట్‌కు వస్తామని పారిశ్రామికవేత్తలు స్పష్టం చేశారు. దాంతో జగన్ సర్కారు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మల్లవల్లిలో భూములు కేటాయించిన పారిశ్రామికవేత్తలంతా తెలుగుదేశం సానుభూతి పరులనే ముద్ర వేసి వారికి కేటాయించిన భూముల రద్దుకు ఏపీఐఐసీ ద్వారా నోటీసులు ఇప్పించింది. ఈ నోటీసులపై దాదాపు 150 మంది వరకు పారిశ్రామికవేత్తలు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈ గొడవలన్నీ పడలేక 78 మంది తాము కట్టిన డబ్బు వెనక్కు తీసేసుకున్నారు. మిగిలిన పారిశ్రామికవేత్తలు కట్టిన డబ్బుంతా ఇన్నేళ్లుగా ఏపీఐఐసీ దగ్గరే ఉండిపోయింది. అంటే అప్పట్లో ఎకరం 16.50 లక్షల చొప్పున 150 ఎకరాలకు చెల్లించిన దాదాపు రూ. 25 కోట్ల సొమ్ము జగన్ ప్రభుత్వం దగ్గరే ఉండిపోయింది. ఎలాగైనా మిగిలిన పారిశ్రామికవేత్తలను కూడా తరిమేయాలని ఎత్తుగడ వేసిన జగన్ సర్కారు వారికి కేటాయించిన స్థలాల రేటును అమాంతంగా పెంచేసింది. గతంలో ఎకరాకు రూ.16.5 లక్షల చొప్పున స్థలం కేటాయించగా.. మౌలిక సదుపాయాల కల్పన కోసం ఖర్చయిందంటూ ఏకంగా ఎకరాకు రూ.65 లక్షలు చొప్పున కొత్త ధరలు చెల్లిస్తేనే ఆ భూములు కేటాయిస్తామంటూ ఏపీఐఐసీ నోటీసులు పంపింది. దాంతో పారిశ్రామికవేత్తలంతా మళ్లీ ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.

మళ్లీ అడుగులు...

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయి.. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్లవల్లి పారిశ్రామికవాడలో ప్లాట్లు ఉన్న పారిశ్రామికవేత్తలంతా ఇప్పుడు మళ్లీ ముందుకు వస్తున్నారు. ఏడేళ్ల క్రితం మల్లవల్లి పార్కులో తమకు కేటాయించిన ప్లాట్ల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇటీవలే రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై పరిశీలన చేసి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇవ్వడంతో పారిశ్రామికవేత్తల్లో మళ్లీ నమ్మకం కలుగుతోంది. ఇందులో హైదరాబాద్‌లోని జీడిమెట్ల, పటాన్‌చెరువు, చెర్లపల్లి, బాలానగర్, నాచారం తదితర ప్రాంతాల్లో గత మూడు దశాబ్దాలుగా పరిశ్రమలు నడుపుతున్న అనుభవజ్ఞులైన ప్రముఖ పారిశ్రామికవేత్తలు అనేకమంది ఉన్నారు. మల్లవల్లి పార్కులో పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పడం కోసం తమకు కేటాయించిన స్థలాల వద్దకు వెళ్లేందుకు గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రోడ్డు కూడా వేయకపోగా, కనీసం సైకిల్‌పై వెళ్లేందుకు కూడా వీల్లేకుండా ఉన్న ఆ భూములను సోమవారం నాటి పరిశీలనలో చూసి వారంతా ఆవేదన చెందారు. ప్రభుత్వ సహకారంతో సాధ్యమైనంత త్వరగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయించుకుని.. వీలైనంత వేగంగా తమకు కేటాయించిన స్థలాల్లో పారిశ్రామిక యూనిట్లు ప్రారంభించుకోవాలని ఆసక్తిగా ఉన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఏపీఐఐసీ అధికారులు స్పందించారు. అప్పటికప్పుడు సర్వేయర్లను పంపించడంతో పారిశ్రామికవేత్తల సమక్షంలోనే వారికి కేటాయించిన స్థలాలను సర్వే చేసి దాదాపు 70 ప్లాట్లకు మార్కింగ్ ఇచ్చారు. గుంటలు, పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిన మిగిలిన ప్లాట్లలోని వెళ్లడానికి దారి లేకపోవడంతో వెనుదిరిగారు. ప్రస్తుత ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని పారిశ్రామికవేత్తలు ఆశిస్తున్నారు. అంతా అనుకున్నట్లుగా జరిగితే.. గత ఐదేళ్లుగా ‘ఎక్కడి వేసిన గొంగళి అక్కడే’ అన్న చందంగా ఉండిపోయిన మల్లవల్లిలోని బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కులోకి రూ.వేల కోట్ల పెట్టుబడులు, చిన్నా పెద్దా కలిపి వందల సంఖ్యలో పరిశ్రమలు వస్తాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

> టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ పారిశ్రామికవాడపై కత్తిగట్టిన జగన్ సర్కారు గత ఐదేళ్లూ రకరకాల వేధింపులతో చెడుగుడాడుకోగా అటువైపు పారిశ్రామికవేత్తలు కన్నెత్తి చూడలేకపోయారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారంతా కొత్త సర్కారుపై నమ్మకంతో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నారు. మల్లవల్లి ఇండస్ట్రీస్, ఎస్ఏపీ ఇండస్ట్రియల్, నవ్యాంధ్ర ఇండస్ట్రీస్, మల్లవల్లి స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ల ప్రతినిధులు సోమవారం కృష్ణా జిల్లా మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో కేటాయించిన భూములను పరిశీలించారు. ప్రభుత్వం సహకరిస్తే వందలాది పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములమవుతామన్న ఆకాంక్ష వెలిబుచ్చారు!

పరిశ్రమలు పెట్టేందుకు సిద్ధం

మల్లవల్లి ఇండిస్ట్రియన్ పార్కులో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన వివాదాస్పద భూములు కాకుండా.. అనువైన స్థలాలు కేటాయిస్తే వెంటనే పరిశ్రమలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో ముఖ్యమంత్రి, మంత్రి చొరవ తీసుకోవాలి. 2019లో ప్రభుత్వం మారగానే.. ఏపీఐఐసీ అధికారులు పారిశ్రామికవేత్తలకు రాజకీయాలు అంటగట్టి నానా రకాలుగా వేధింపులకు గురిచేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడను నిర్వీర్యం చేశారు. ఆ అధికారులకు కఠినంగా శిక్షించాలి. టీడీపీ ప్రభుత్వం రావడంతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం పెరిగింది. అందుకే మల్లవల్లి పార్కులో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– జీఎన్‌బీ చౌదరి, ప్రధాన కార్యదర్శి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్

పవర్‌గ్రిడ్ దక్షిణ ప్రాంత సీజీఎంగా అఖిలేష్ పాఠక్



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ దక్షిణ ప్రాంత(సదరన్ రీజియన్) ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా అఖిలేష్ పాఠక్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పవర్‌గ్రిడ్ కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగుళూర్ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన అఖిలేష్ పాఠక్‌కు పవర్ ట్రాన్స్‌మిషన్, పవర్ ప్రాజెక్టుల రంగంలో 31 ఏళ్ల అనుభవం ఉంది.

మహిళ అని సానుభూతి చూపలేం!

- కవితకు వ్యతిరేకంగా ఈడీ వద్ద బలమైన సాక్ష్యాలు
- మద్యం విధానం కుంభకోణంలో కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి చుక్కెదురైంది. ఈడీ, సీబీఐ కేసులకు సంబంధించి ఆమె పెట్టుకున్న బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. మహిళ అనే కారణంతో కవితపై సానుభూతి చూపలేమని కోర్టు స్పష్టం చేసింది. ఒక విద్యావంతురాలిగా పలుకుబడి కలిగిన మహిళగా ఆమె చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ రీత్యా కేసులో ఆమె పాత్ర, ఆమెకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాల ఆధారంగానే బెయిల్ ఇవ్వాలో లేదో నిర్ణయించాలే తప్ప మహిళ అన్న విషయానికి అంత ప్రాధాన్యం ఉండకూడదని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీలో కొత్త మద్యం విధానం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కవిత కూడా ఒకరని ఈడీ సేకరించిన సాక్ష్యాలను బట్టి తేలిందని, ఈ కేసులో మరికొందరు నిందితులు కూడా ఆమె తరఫునే పనిచేశారని, ఫలితంగా ఆమెను ఓ నిస్సహాయ మహిళగా భావించలేమని కోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు సంబంధించి ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా బలమైన ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఈ దశలో ఆమెకు బెయిల్ మంజూరు చేయలేమని తీర్పులో స్పష్టం చేసింది. తొలుత.. తన కుమారుడికి పరీక్షలున్నాయని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరగా ట్రయల్ కోర్టు తిరస్కరించింది. తర్వాత ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు సాధారణ బెయిల్ మంజూరు చేయాలని కవిత పిటిషన్లు దాఖలు చేయగా ట్రయల్ కోర్టు మరోసారి తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ కోసం ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయగా 2 పిటిషన్లు కలిపి ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలో ఒకేసారి విచారించింది. సోమవారం తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్ పిటిషన్లు తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు.

‘ఆయుష్’ తీసిన జగన్ సర్కారు!

- నాడు ఆగమేఘాలపై 28 వైద్య పోస్టుల సరెండర్
- మార్చి 14న కేబినెట్‌లో ఆమోదం.. 16న జీవో విడుదల
- పోస్టుల రద్దుతో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు తూట్లు
- జీవో రద్దుకు కొత్త ప్రభుత్వానికి వైద్యుల వినతి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఆయుష్ విభాగంలో ఇప్పటికే డాక్టర్ల కొరత పీడిస్తుండగా గత వైసీపీ ప్రభుత్వం, ఉన్న వాటిలో కొన్ని కీలకమైన పోస్టులను రద్దు చేసి ఆ విభాగాన్ని క్షీణదశకు తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 74 డిస్పెన్సరీలు ఉంటే కేవలం 30 మంది వైద్యులు మాత్రమే సేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వం ఆయుష్ వైద్యుల నియామకాలు చేపట్టలేదు. దీంతో వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఆ విభాగంలోకి కొన్ని కీలకమైన పోస్టులను చేసేసింది. ప్రధానంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఎల్ఆర్ మెడికల్ ఆఫీసర్, పీజీ స్కాలర్స్ తదితర మొత్తం 28 పోస్టులను ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సరెండర్ చేసేశారు. ఆయుష్, యునాని విభాగంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టులను సరెండర్ చేసేసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులుగా వాటిని మార్చేశారు. ఇలా 28 పోస్టులను సరెండర్ చేసేసి కేవలం ఏడు పోస్టులను మాత్రమే తీసుకున్నారు. దీనిపై ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. ముఖ్యంగా ఆయుష్ విభాగంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టు కీలకమైనది. ఈ కేడర్‌కు చెందినవి దాదాపు ఆరు పోస్టులున్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఒకే కేడర్‌కు చెందినవి ఐదు పోస్టులుపైన ఉంటనే రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలులోకి వస్తుంది. ఆయా పోస్టుల నియామకాలు, పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తారు. అధికారులు ఈ విషయాన్ని విస్మరించి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కేడర్‌లో ఉన్న ఆరు పోస్టుల్లో ఒక పోస్టును ప్రభుత్వానికి సరెండర్ చేసేశారు. దీంతో ఆ కేడర్ పోస్టుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండాపోయింది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పోస్టులు సరెండర్ చేయడం సాధ్యం కాదని గత ప్రభుత్వం ఆగమేఘాలపై మార్చి 14వ తేదీన ఆన్‌లైన్ కేబినెట్‌లో పెట్టి మరీ ఈ ఫైల్‌కు అనుమతిచ్చింది. కేబినెట్ ఆమోదించిన వెంటనే మార్చి 16వ తేదీన ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఆయుష్ విభాగంలో ఉన్న ఒక ఉన్నతాధికారికి, సీఎంవోలో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారికి పూర్తిగా అండదండలు అందించడంతో ఆయుష్‌లో ఏం జరిగినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వెంటనే ఎన్నికల కోడ్‌కు ముందు ఇచ్చిన జీవోలను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వానికి వైద్యులు విన్నవిస్తున్నారు.

రషీద్ ప్రమాణ స్వీకారానికి ఎన్ఐఏ ఓకే

న్యూఢిల్లీ, జూలై 1: జమ్మూ-కశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయిన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజనీర్ రషీద్) ప్రమాణ స్వీకారానికి అభ్యంతరం లేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టుకు తెలిపింది. ఉగ్రవాదులకు నిధులు అందజేశారన్న ఆరోపణలపై ‘ఊపా’ చట్టం కింద అరెస్టయిన ఇంజనీర్ రషీద్ 2019 నుంచి తిహాడ్ జైలులో ఉన్నారు. జైలులో ఉంటూనే ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండడంతో మధ్యంతర బెయిల్ గానీ, కస్టడీ పెరోల్‌గానీ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది ప్రత్యేక కోర్టును కోరారు. వాదనలు విన్న ప్రత్యేక కోర్టు అదనపు సెషన్స్ జడ్జి చందర్‌జిత్ సింగ్ మంగళవారం నిర్ణయాన్ని వెలువరించనున్నారు. దాంతో రషీద్ ఈ నెల అయిదో తేదీన ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది.

ఎలాంటి సవాళ్లైనా ఎదుర్కొంటాం

- ఆర్మీ కొత్త చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 1: వర్తమాన, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోగల పూర్తి సన్నద్ధత, సమర్థత భారత సైన్యానికి ఉన్నదని ఆర్మీ కొత్త చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ అన్నారు. చైనాతో తూర్పు లద్దాఖ్‌లో నెలకొన్న సరిహద్దు వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాయు, నావికా దళాలతో కలిసి ఆర్మీలో రెండింతల ఉత్సాహం (సినర్జీ) నింపడానికి తొలి ప్రాధాన్యత ఇస్తానని ద్వివేదీ తెలిపారు. వికసిత్ భారత్ - 2047 లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న రెండోరోజు, సోమవారం ఆయన రైసినా హిల్స్‌లోని సౌత్ బ్లాక్‌లో సైనిక గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) స్వీకరించారు. ప్రత్యేక ఆపరేషనల్ సవాళ్లను సైన్యం ఎదుర్కొంటోందని, ఆధునిక ఆయుధాలతో వారిని సుశిక్షితులను చేయడం చాలా ముఖ్యమన్నారు.

‘ఖాళీ’లతో జలాలు పారేదెలా?

- రిటైరైన ఇంజనీర్ ఇన్ చీఫ్
- జూలైలో మరొకరు.. సెప్టెంబరులో ఇంకొకరు
- మొత్తం మూడు ఈఎన్‌సీ పోస్టులూ ఖాళీ!
- సీఈ పోస్టులు 19 ఉంటే 16 ఖాళీ
- ఉన్న సీఈల్లో ఒక్కో పోస్టుకు ఇద్దరు.. ముగ్గురు ఇన్‌చార్జిలు
- వచ్చే నెలలో మరో ఆరుగురు సీఈల పదవీ విరమణ
- జలవనరుల శాఖలో పేరుకుపోతున్న ఖాళీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జల వనరుల శాఖలో ఇంజనీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీ అవుతున్న తరుణంలో జలాలు పారేదెలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అడ్మినిస్ట్రేషన్, గోదావరి డెల్టా పర్యవేక్షణ ఇంజనీరు ఇన్ చీఫ్ సతీష్‌కుమార్ శుక్రవారం రిటైర్ అయ్యారు. కృష్ణా డెల్టా సిస్టమ్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చూస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి వచ్చే నెలాఖరుకు రిటైర్ అవుతున్నారు. కమిషనర్ ఆఫ్ టెండర్స్ కూడా నారాయణరెడ్డి చూస్తున్నారు. కొంత కాలం కిందట సీఓటీగా ఇంజనీరు ఇన్ చీఫ్ హోదాలో బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం చీఫ్ ఇంజనీరుగా ఉన్న కె.శ్రీనివాస్ సెప్టెంబరులో రిటైర్ అవుతున్నారు. జల వనరుల శాఖలో కీలకమైన ఇంజనీర్ ఇన్ చీఫ్ పోస్టులను నిర్వహిస్తున్న వారంతా ఒక్కసారిగా పదవీ విరమణ చేస్తుండగా, కింది స్థాయిలో చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు కూడా పదవీ విరమణ చేస్తుండటంతో సాగునీటి శాఖలో రైతాంగానికి సక్రమంగా సాగునీరందించేందుకు పర్యవేక్షణ లేకుండాపోయింది. 2018లో ఇంజనీరింగ్ అధికారుల పదోన్నతులపై చంద్రబాబు ప్రభుత్వం క్లారిటీనిచ్చింది. దీనితో జల వనరుల శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా స్పష్టమైంది. 2019లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చాక ప్రతి యేటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్‌ను వేస్తామన్నారు. దీంతో జల వనరుల శాఖలోని ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అవుతుందని నిరుద్యోగ గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు ఆశించారు. కానీ ఐదేళ్ల కాలంలో ఏనాడూ జల వనరుల శాఖలో ఖాళీలను భర్తీ దిశగా జగన్ అడుగులు వేయలేదు. దీంతో జల వనరుల శాఖలో ఖాళీలు పేరుకుపోయాయి. పులిమీద పుట్రలా వచ్చే నెలలో ఆరుగురు చీఫ్ ఇంజనీర్లు పదవీ విరమణ చేస్తున్నారు. తెలుగు గంగ సీఈ ఎంవీ రమణ. హెచ్ఆర్‌డీ సీఈ వరద రాజు, రాజోలిబండ, హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ ఎం.శ్రీనివాస రెడ్డి, డిజైన్స్ సీఈ శ్రీనివాసయాదవ్, రాయలసీమ క్వాలిటీ కంట్రోల్ సీఈ జీవీ తిరుమలరావు, టెక్నికల్ సీఈ ఎస్.రాంబాబు వచ్చేనెలలో రిటైర్ అవుతున్నారు. వీరితోపాటు మరో ఏడుగురు ఎస్ఈలు కూడా వచ్చేనెలలో రిటైర్ అవుతున్నారు. వాస్తవానికి ఈఎన్‌సీ పోస్టులు మూడు ఉంటే ఈ మూడింటిని సీఈలే ఇన్‌చార్జి ఈఎన్‌సీలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అధికారికంగా ఈ మూడు ఈఎన్‌సీ పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. సీఈలు 19 శాంక్షన్డ్ పోస్టులు ఉంటే అందులో 16ఖాళీగా ఉన్నాయి. సీఈలుగా ఇన్‌చార్జీలే ఉన్నారు. సూపరింటెండింగ్ ఇంజనీరు పోస్టులు 51 ఉంటే .. అందులో 33 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ శాంక్షన్డ్ స్ట్రెంగ్త్ 267 పోస్టులకు గాను 109 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శాంక్షన్డ్ పోస్టులు 943 ఉంటే అందులో 130 ఖాళీగా ఉన్నాయి. ఈఎన్‌సీ పోస్టులు మూడు, సీఈ పోస్టులు పది, ఎస్ఈ పోస్టులు 52, ఈఈ పోస్టులు 161, డీఈఈ పోస్టులు 291 పదోన్నతులు కల్పించాల్సి ఉంది.

ప్రభుత్వం దృష్టిసారించేనా?!

గత ప్రభుత్వ హయాంలో ఒకే ఇంజనీరింగ్ అధికారికి మూడు పోస్టులు చొప్పున అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనికి లక్షల్లో వసూలు చేశారు. ఇప్పుడు భారీగా పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ ఇంజనీరింగ్ అధికారులు రిటైర్ అవుతుండటంతో వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. వాస్తవానికి శనివారం నాటికే ఇంజనీరింగ్ అధికారుల పోస్టులను నియమించాల్సి ఉన్నా ఆ దిశగా దృష్టి సారించలేదు. ఈ దశలో ఈఎన్‌సీ పోస్టు కోసం ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

గనుల్లో గజదొంగలు

- జగన్ ఏలుబడిలో అడ్డగోలు దోపిడీ
- ప్రభుత్వ ప్రయోజనాలకు భారీ గండి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ఏలుబడిలో గనుల శాఖలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు అన్నీ ఇన్నీ కావు. ఇసుక తవ్వకాలతో పాటు సీనరేజీ వసూళ్ల విషయంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. సీనరేజీ వసూళ్ల ఒప్పందాల్లో అప్పటి ముఖ్యమంత్రి జగన్, నాటి గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి అస్మదీయుల కంపెనీలకు ‘మేళ్లు’ చేయడానికి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. సెక్యూరిటీ డిపాజిట్‌ను 34 శాతం నుంచి ఏకంగా 10 శాతానికి తగ్గించారు. అడ్డగోలుగా కాంట్రాక్టులు అప్పగించి, ఒప్పందాలు అయిన ఆరు నెలల తర్వాత రూల్స్ సవరించారు. సాధారణంగా అత్యంత ఖరీదైన సహజ వనరులు, ఖనిజాలు ప్రభుత్వ నియంత్రణలో ఉంటే ప్రభుత్వానికే లాభం. అదే ప్రైవేటుకు ఇస్తే ప్రభుత్వానికి రవ్వంత ఫీజుల రూపంలో పడేసి మిగతాదంతా ప్రైవేటు వ్యక్తులు దోచుకుంటారు. ప్రైవేటు పెత్తనం పేరిట గత ప్రభుత్వ పెద్దలు, నేతలు, బడా అధికారులు చీకటి దందాలు చేసుకున్నారు. వనరులను దోచుకుని అడ్డగోలుగా సంపాదించుకున్నారు. ఇసుక తవ్వకాల్లో జగన్ సర్కారు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శల పాలైన సంగతి తెలిసిందే. ఖనిజ వనరుల సీనరేజీ వసూళ్లను కూడా జగన్ అదే బాట పట్టించారు. గనుల శాఖ అధికారులను పావులుగా వాడుకున్నారు. జగన్ మంత్రాంగానికి నాడు గనుల శాఖ డైరెక్టర్ హోదాలో వెంకటరెడ్డి అడ్డూ అదుపూ లేకుండా రూల్స్, మార్గదర్శకాలను మార్చేశారు. అంతా కలసి వందల కోట్ల దోపిడీకి కుట్ర పన్నారు. జగన్ సర్కారు పోయి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చినా గనుల్లో వైసీపీ నేతలు, వారి అస్మదీయ కంపెనీలే తిష్ఠ వేసుకొని కూర్చున్నాయి. వారిని కదిలించకుండా గజదొంగల దోపిడీ కనిపెట్టే అవకాశమే లేదని నిపుణులు చెబుతున్నారు.

ఇసుక అనేది సహజవనరు. 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం ఇసుకను పేద వర్గాలకు ఉచితంగా అందించింది. జగన్ సర్కారు వచ్చాక ముందు ఎండీసీతో వ్యాపారం చేయించి ఆ తర్వాత జేపీ వెంచర్స్‌కు అప్పగించింది. ఆ తర్వాత ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ కంపెనీలకు టెండర్ ఇచ్చింది. ఎన్జీటీ, హైకోర్టు, సుప్రీం కోర్టులు వారించినా ప్రభుత్వ పెద్దల కోసం ఆ కంపెనీలు అక్రమ తవ్వకాలు చేపట్టి అడ్డంగా దొరికాయి. ఒక్క ఇసుక తవ్వకాలు, అమ్మకాల్లోనే 10 వేల కోట్ల అవినీతి జరిగిందన్నది జగన్ సర్కారుపై ఉన్న ప్రధాన ఆరోపణ. అంటే.. సర్కారు నియంత్రణలో ఉన్న ఇసుకను ప్రైవేటుకు ఇవ్వడం వల్ల జగన్‌కు, ఆయన అస్మదీయులకే లాభం జరిగింది. సేమ్ టు సేమ్ ఇలాంటి దందానే చిన్న తరహా ఖనిజాల విషయంలోనూ జరిగింది. ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్స్ కన్సెషన్ రూల్స్-1996 ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కూడా గనుల శాఖలో మైనర్ మినరల్స్ కింద కాల్సైట్, మైకా, లేటరైట్, గ్రానైట్ (గెలాక్సీ, బ్లాక్ , కలర్ గ్రానైట్)లు ఉన్నాయి. వీటికి లీజుదారుల నుంచి సీనరేజీ, రాయల్టీ, కన్సిడరేషన్, డెడ్‌రెంట్ వంటి ఫీజులు వసూలు చేస్తారు. 2013 నుంచి ఈ మినరల్స్ ఫీజులు లీజుదారులు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. ఇసుకను ప్రైవేటుపరం చేసి కోట్లు కొల్లగొట్టిన వైసీపీ పెద్దలు మైనర్ మినరల్స్‌పైనా కన్నేశారు. అంతే.. రాజస్థాన్ తరహాలో ఏపీలోనూ మైనర్ మినరల్స్ సీనరేజీ ఫీజుల వసూళ్లను గనుల శాఖ నుంచి తప్పించి ప్రైవేటు కంపెనీలకు అప్పగించాలని జగన్ సర్కారు 2022 డిసెంబరులో నిర్ణయించింది.

అడ్డదారుల్లో నిర్ణయాలు

సీనరేజీ ఫీజుల వసూళ్ల కాంట్రాక్ట్‌ను ప్రైవేటు కంపెనీలకు అప్పగించాలంటే ఏపీఎంఎంసీ-1996లో రూల్స్ 10, 12, 34 వంటి నిబంధనలను సవరించాలి. ఇందుకు సంబంధిత చట్టాన్ని సవరించాలి. ఆ తర్వాతే రూల్స్‌ను మార్చాలి. కానీ జగన్ సర్కారు ఆ పనిచేయలేదు. నిర్ణయం తీసుకున్నదే తడవుగా 2023 ఫిబ్రవరిలో మొదట ఐదు జిల్లాల్లో సీనరేజీ ఫీజుల వసూలు కాంట్రాక్ట్‌ను ప్రైవేటుకు ఇవ్వాలని నిర్ణయించింది. నాటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అస్మదీయుల కంపెనీలకే సీనరేజీ వసూళ్ల టెండర్లు కట్టబెట్టారు. శ్రీకాకుళం-విశ్వసముద్ర ఎక్స్‌పోర్ట్స్, తూర్పుగోదావరి-సుధాకర్ ఇన్‌ఫ్రా, అనంతపురం-ఎమిగోస్, కడప, చిత్తూరు-రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. వీటిలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ జగన్ అస్మదీయుడు, గతంలో వైసీపీ ఎంపీగా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానిది. అనంతపురం జిల్లా గనుల శాఖ డీడీ ఎమిగోస్ సంస్థతో కుదిరిన ఒప్పందపత్రంపై సంతకాలు చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆయన్ను ఆ పోస్టు నుంచి తప్పించి, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న మరోవ్యక్తిని తీసుకొచ్చి ఆ కుర్చీలో కూర్చోబెట్టి సంతకాలు చేయించారు.

కంపెనీలకు లబ్ధిచేకూర్చేలా...

ఏపీఎంఎంసీ-1996 ప్రకారం లీజుదారులు తమ కాంట్రాక్టు విలువపై 24 శాతం పర్సనల్ సెక్యూరిటీ డిపాజిట్, మరో 10శాతం సెక్యూరిటీ డిపాజిట్ కింద మొత్తం 34 శాతం ప్రభుత్వానికి డిపాజిట్ చేయాలి. తమకు స్ఫూర్తి అని జగన్ ప్రభుత్వం చెప్పిన రాజస్థాన్ చట్టంలోనూ ఇదే నియమం ఉంది. కానీ జగన్ సర్కారు ఆ పనిచేయలేదు. కాంట్రాక్టులు దక్కించుకునేవి అస్మదీయ కంపెనీలే కావడంతో ఒప్పందంలోనే డిపాజిట్ సొమ్మును 10 శాతంగా నిర్ణయించారు. అంటే.. 10 కోట్లు డిపాజిట్ చేస్తే సరిపోతుంది. దీన్ని అమలు చేయడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పందాలయిన ఆరు నెలల తర్వాత రూల్ 10ను మార్చారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 2 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఎన్‌ఎఫ్ఎస్‌సీలో బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్)



నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(ఎన్ఎఫ్ఎస్‌సీ)- బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024లో అర్హత స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 4న
- **అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిణీ:** జూలై 5న
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్:** జూలై 18, 19
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూలై 23న
- **అడ్మిషన్స్ తేదీ:** జూలై 29
- **వెబ్‌సైట్:** https://nfscbtechadmissions. com/

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)-'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఈ ప్రోగ్రామ్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్, అసైన్‌మెంట్, ప్రజంటేషన్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, క్విజ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్నల్&ఫైనల్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైమ్ యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఫ్రెషర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు

- వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్ 30 గంటలు, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నల్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** iift.ac.in

జేఎన్‌టీయూఏలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్



అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్ (బీటెక్&బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూఏ-కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్ఈ విభాగంలో 20 సీట్లు, ఈసీఈ విభాగంలో 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

- జేఎన్‌టీయూఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చదవాల్సి ఉంటుంది.
- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ అభ్యర్థులకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు; ఈసీఈ అభ్యర్థులకు మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉంటాయి.

అర్హత

- బీఐఈ(ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- పూర్తిచేసిన దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 29న
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలూమ్నీ మ్యాటర్స్ కార్యాలయం, జేఎన్‌టీయూఏ, అనంతపురం.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, జేఎన్‌టీయూఏ, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515002
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, dfaam@jntua.ac.in
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

ఐఐటీ మద్రాస్‌లో ఎంబీఏ- డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్



మద్రాస్‌లోని ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ప్రపంచంలోనే తొలిసారిగా వినూత్నమైన కోర్సు 'డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్'ని అందుబాటులోకి తెచ్చింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థ యాజమాన్య పద్ధతుల్లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించేందుకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా పెంపొందించుకోవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సును ఐఐటీ మద్రాస్‌కి చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ రూపొందించాయి. తొలి బ్యాచ్ 2024 సెప్టెంబరులో ప్రారంభం కాబోతుంది.

- **ఎంబీఏ ఇన్ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్**

వ్యవధి: రెండేళ్లు.

ప్రోగ్రామ్ వివరాలు: ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్ చెయిన్ వంటి డిజిటల్ టెక్నాలజీపై నైపుణ్యాలు సాధిస్తారు. 900 గంటలు క్లాస్ రూమ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. కోర్సుకి మొత్తం 192 క్రెడిట్స్ నిర్దేశించారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరవాత ఐఐటీ మద్రాస్ ఆలూమ్నీ స్టేటస్ కూడా లభిస్తుంది. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ ఇన్‌క్యుబేషన్ అండ్ స్టార్టప్ ప్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగావకాశాలు పొందే సౌలభ్యం కూడా ఉంది.

అర్హత: అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల పూర్తిస్థాయి(ఫుల్ టైం) పని అనుభవం ఉండాలి.


ఎంపిక విధానం: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కోర్సు ఫీజు: రూ.9,00,000. వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. అర్హులైన వారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.iitm.ac.in/

ఎన్‌హెచ్‌బీలో వివిధ ఖాళీలు

జాబ్ కార్నర్



న్యూఢిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంక్(ఎన్‌హెచ్‌బీ)...కాంట్రాక్ట్/రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 48

రెగ్యులర్ పోస్టులు

1. జనరల్ మేనేజర్(స్కేల్-7): 1 పోస్టు
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(స్కేల్-5): 1 పోస్టు
3. డిప్యూటీ మేనేజర్(స్కేల్-2): 3 పోస్టులు
4. అసిస్టెంట్ మేనేజర్(స్కేల్-1): 18 పోస్టులు

కాంట్రాక్ట్ పోస్టులు

1. చీఫ్ ఎకనామిస్ట్: 1 పోస్టు
2. సీనియర్ ప్రాజెక్ట్ ఫైనాన్స్ ఆఫీసర్: 10 పోస్టులు
3. ప్రాజెక్ట్ ఫైనాన్స్ ఆఫీసర్: 12 పోస్టులు
4. ప్రోటోకాల్ ఆఫీసర్: 1 పోస్టు
5. అప్లికేషన్ డెవలపర్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/ఐసీఏఐ/సీఎఫ్ఏ/ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ, బీటెక్(సీఎస్/ఐటీ)/ఎంసీఏ/ఎంటెక్(సీఎస్/ఐటీ)/బీఎస్సీ(సీఎస్/ఐటీ)/ఎమ్మెస్సీ(సీఎస్/ఐటీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.850. ఎస్సీ ఎస్టీ, దివ్యాంగులకు రూ.175

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 19

వెబ్‌సైట్: https://www.nhb.org.in/

హిందుస్థాన్ కాపర్‌లో జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్...వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ మేనేజర్

ఖాళీలు: 56

విభాగాలు: మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్ఆర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 21

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఐఐఎస్ఎస్‌లో రీసెర్చ్ పోస్టులు

భోపాల్(మధ్యప్రదేశ్)లోని ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ సైన్స్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. సీనియర్ రీసెర్చ్ ఫెలో: 1 పోస్టు

2. యంగ్ ప్రొఫెషనల్-1: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు, పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.31,000. యంగ్ ప్రొఫెషనల్-1కు రూ.30,000 చెల్లిస్తారు.

వయోపరిమితి: సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు మహిళలకు గరిష్ఠంగా 40 ఏళ్లు, పురుషులకు 35 ఏళ్లు, యంగ్ ప్రొఫెషనల్-1 పోస్టుకు 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 5, 8

వేదిక: ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ సైన్స్, నబీబాగ్, బెరాసియా రోడ్, భోపాల్, మధ్యప్రదేశ్

వెబ్‌సైట్: https://iiss.icar.gov.in/

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో అప్రెంటిస్‌లు



న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం....కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అప్రెంటిస్

ఖాళీలు: 2,700(ఏపీలో 27, తెలంగాణలో 34 ఖాళీలున్నాయి)

వయసు: 2024 జూన్ 30 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్‌లో రూ.10,000. పట్టణ ప్రాంతాల్లో రూ.12,000, మెట్రో ప్రాంతంలో రూ.15,000 చెల్లిస్తారు.

శిక్షణ వ్యవధి: ఏడాది

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

ఆన్‌లైన్ రాత పరీక్ష: జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు- 25 మార్కులు), జనరల్ ఇంగ్లిష్(25 ప్రశ్నలు- 25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు- 25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు-25 మార్కులు).

పరీక్ష వ్యవధి: 60 నిమిషాలు

పరీక్ష మాధ్యమం: ఇంగ్లిష్/హిందీ

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీలకు రూ.994. మహిళలు/ఎస్సీ/ఎస్టీలకు రూ.708. దివ్యాంగులకు రూ.472.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 14

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: జూలై 28


వెబ్‌సైట్:https://www.pnbindia.in/

చిట్టి



పరోపకారం


ఒక ఆశ్రమంలో గురువు గారి వద్ద అజేయుడు, విజయుడు అనే ఇద్దరు రాకుమారులు విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. గురువుగారు వారిద్దరికీ ఒక పరీక్ష పెట్టదలచి, వారిని దగ్గరకు పిలిచి ఇలా చెప్పారు. 'నాయనలారా మన ఆశ్రమానికి చాలా దూరంలో ఉన్న ఆటవికుల గుహల్లో ఒక అరుదైన మణి ఉంది దాన్ని ఎవరు ముందుగా తెచ్చిస్తే వారే మీ ఇద్దరిలో విజేత. ఈ మాటలు విన్న రాకుమారులు ఇద్దరూ వెంటనే బయల్దేరి ఆటవికుల గుహల వైపు ప్రయాణం సాగించారు. దారిలో వారికి బాగా దెబ్బలు తగిలి కింద పడిపోయిన ఒక వ్యక్తి కనిపించాడు. ఇతనితో మనకెందుకు విజయా పోదాం పద అని అజేయుడు ముందుకు వెళ్లిపోయాడు విజయుడు మాత్రం ఆగి, అతనికి సపర్యలు చేసి, మంచి నీళ్లు తాగించి, అతని నివాసం వద్ద వదిలేశాడు. కొంచెం సేపటి తర్వాత అజేయుడు, విజయుడు ఆటవికుల గుహల వద్ద కలిశారు. విజయుడు ఆ ఆటవికులతో చక్కగా మాట్లాడి గురువుగారు చెప్పిన మణిని వారి దగ్గరనుండి తీసుకున్నాడు. అంత సులువుగా మణిని ఎలా ఇచ్చారు? వీరు చాలా క్రూరులు అని గురువుగారు చెప్పారే అని విజయుడిని అడిగాడు అజేయుడు. దారిలో మనకు దెబ్బలు తగిలి కనిపించిన బాటసారి వీరి చేతిలో దెబ్బలు తిన్న వాడే. అతన్ని నేను కాపాడినందుకు కృతజ్ఞతగా ఆటవికులతో ఎలా మాట్లాడితే మణి దొరుకుతుందో చెప్పాడు. ఆపదలో ఉన్న వారికి మనం సాయం చేస్తే, మనకు కూడా మంచిదే, దేవుడు మనకు మరొక వైపునుండి సాయం పంపుతాడు అన్నాడు విజయుడు. గురువుగారు విజయుడిని విజేతగా ప్రకటించి, ఆ ఇద్దరి పరోపకార బుద్ధిని అభినందించాడు.



దారి కనుక్కోండి




10 తేడాలు గుర్తించండి!



ఏవి ఎన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 347

	9		1	6				
			7		9	6		5
					3			8
5				9				
9	8	4		2		7	3	6
				3				4
2			9					
4		7	8		6			
				7	2		4	

సుడోకు - 346 సమాధానం

3	2	8	6	9	4	7	1	5
5	6	9	7	2	1	4	3	8
7	1	4	8	5	3	9	6	2
2	7	6	9	4	8	1	5	3
1	9	5	2	3	6	8	7	4
4	8	3	5	1	7	6	2	9
9	3	1	4	7	2	5	8	6
6	5	7	3	8	9	2	4	1
8	4	2	1	6	5	3	9	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.